www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# ప్రజా విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శుక్రవారం
24-07-2026
RNI No : TGTEL/25/A1676
సంపుటి : 02 | సంచిక : 11 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




## పేదోడు హైదరాబాద్‌లో ఉండకూడదా?

- అత్యంత విలువైన ప్రభుత్వ భూములలో పేదలకు ఇళ్లు నిర్మించకూడదా?
- ప్రభుత్వ భూములను పేదల కోసం వినియోగిస్తే ఎందుకింత కడుపుమంట
- ప్రజలను తప్పుదోవ పట్టించేలా విష ప్రచారాలు చేస్తున్నారు
- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇందిరమ్మ టవర్స్‌గా మార్చి విక్రయిస్తారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవం
- ప్రభుత్వం ప్రకటించిన మార్గదర్శకాల ప్రకారమే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం
- లబ్ధిదారుల మీద ఆర్థిక భారం తగ్గించడానికి ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ ఇస్తోంది
- ఇది అమ్మకం కాదు, ప్రభుత్వ ఆర్థిక సహకారం
- మహానగరం నడిబొడ్డులో పేదలకు సొంతింటిని అందించాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం
- నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నాం
- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి

3

## దేశంలో అశాంతికి కాంగ్రెస్, వామపక్షాల ప్రయత్నం

- శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ తరహా పరిస్థితులను సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయి
- పూణే, ముంబై, హైదరాబాద్, ఢిల్లీల్లో కార్యక్రమాలకు విదేశీ శక్తుల మద్దతు ఉంది
- నీట్ పరీక్ష లీకేజీ వెలుగులోకి వచ్చిన వెంటనే కేంద్రం 31 మందిని అరెస్టు చేసింది
- పరీక్షల్లో అక్రమాలను అరికట్టేందుకు కేంద్రం కఠిన చట్టాన్ని అమలు చేస్తోంది
- బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు



2



## సమగ్ర తాగునీటి సరఫరా మాస్టర్ ప్లాన్ రూపొందించాలి

### రానున్న 50 ఏళ్ల అవసరాలకు తగినట్లుగా ఉండాలి

**తాగు నీటి సరఫరాపై ఎల్‌నినో ప్రభావం పడకుండా చూడాలి**

**కొన్ని ప్రాంతాల్లో మూడు నాలుగు రోజులకు ఒకసారి తాగు నీరు సరఫరా చేస్తున్నారు**

- ఆయా ప్రాంతాలకు రోజు విడిచి రోజు నీరు సరఫరా చేసేందుకు చర్యలు వెంటనే చేపట్టాలి
- విలీన మున్సిపాలిటీల్లోనూ తాగు నీటి సరఫరాలో ఏకరూపత ఉండాలి
- హైదరాబాద్ చుట్టూ ఉన్న తాగు నీటి వనరులను అనుసంధానం చేయాలి
- నిర్దేశిత సమయంలో ఎస్టీపీల నిర్మాణం పూర్తి చేయాలి
- వాటర్‌బోర్డు సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో తాగు నీటి సరఫరాకు సంబంధించి సమగ్ర తాగు నీటి సరఫరా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీలతో పాటు విలీన మున్సిపాలిటీల్లోనూ తాగు నీటి సరఫరాలో ఏకరూపత ఉండాలన్నారు. రానున్న 50 ఏళ్ల అవసరాలకు తగినట్లు మాస్టర్ ప్లాన్ ఉండాలని సీఎం సూచించారు. హైదరాబాద్ మహా నగర తాగు నీటి సరఫరా, సీవరేజీ బోర్డు పరిధిలోని పనులపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎంసీహెచ్ఆర్డీలో గురువారం రాత్రి సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం నెలకొనడంతో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎం సూచించారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న తాగు నీటి వనరులను అనుసంధానించాలని సీఎం సూచించారు. ఏదైనా కారణాలతో ఒక సోర్స్ నుంచి నీరు సరఫరా కాకపోయినా మరో సోర్స్ నుంచి వచ్చే నీటిని ఆయా ప్రాంతాలకు సరఫరా చేసేందుకు అనుసంధానత ఉపయోగపడుతుందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో అనేక సంవత్సరాలుగా పలు ప్రాంతాల్లో మూడు నాలుగు రోజులకు ఒకసారి తాగు నీరు సరఫరా చేస్తున్నారని, ఇక ముందు ఆ పరిస్థితి ఉండకూడదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయా ప్రాంతాలకు రోజు విడిచి రోజు నీరు సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న తాగు నీటి సరఫరా పనులను ఏడాదిన్నరలోపు కచ్చితంగా పూర్తి చేయాలని అధికారులకు సీఎం తేల్చిచెప్పారు. ఎస్టీపీల నిర్మాణ పనులపై సీఎం ఆరా తీశారు. ఎస్టీపీల.. మిగతా2లో...

## యూనిఫాంల నాణ్యతపై రాజీపడేది లేదు

- పంపిణీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు
- త్వరగా సరఫరా చేసేలా సంస్థలపై ఒత్తిడి పెంచాలి
- యూనిఫాం సరఫరాపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

3



## కేసీఆర్‌కు కమిటీ ఆహ్వానం

- కమిటీ సమావేశానికి రావాలని లేఖ రాస్తాం
- ఆయన సూచనలు, సలహాలు, అభిప్రాయాలను వెల్లడించే అవకాశం కల్పిస్తాం : ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం
- తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం కలిగే విధంగా కమిటీ నివేదిక రూపొందిస్తాం
- వీలైనంత త్వరగా కమిటీ నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తాం
- త్వరలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు, సూచనలు స్వీకరించే ప్రక్రియ ప్రారంభిస్తాం
- దీనికి రాజకీయ పార్టీలతో,సంఘాలతో సంబంధం లేదు
- కమిటీ చైర్మన్ కే. కేశవరావు





2

## విద్యార్థులు ఒంటరివారు కాదు

- మేం వాళ్లతో ఉన్నాం
- విద్యార్థుల డిమాండ్లకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నాం - రాహుల్ గాంధీ
- గాంధీ స్మృతికేంద్రం వద్ద నివాళులర్పించిన ఇండి కూటమి నేతలు
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల నినాదాలు

2








# సమగ్ర ఓట్ల ప్రక్షాళన చాలా ముఖ్యం

- ఓట్లు లేకుంటే ప్రభుత్వ పథకాలు ఎలా వస్తాయి
- ఎస్ఐఆర్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి
- ఓటరు జాబితాలో చిన్న పొరపాట్లు కూడా సరిచేసుకోవాలి
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయట్లేదు?
- మేం తెరిచిన ధర్నాచౌక్‌లోనే కేటీఆర్ ధర్నా చేస్తామని అంటున్నారు
- రాజధాని నగరంలో హైడ్రా సమర్థవంతంగా పనిచేస్తోంది
- ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి తిరిగి స్వాధీనం చేసుకుంటోంది
- కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్‌డీఎస్ఏ సూచనలను ప్రభుత్వం పూర్తిగా అమలు చేస్తాం
- విలేకరుల చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర ఓట్ల ప్రక్షాళన కార్యక్రమం చాలా ముఖ్యమని తమ పార్టీ నేతలకు గట్టిగా చెప్పినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అసెంబ్లీలో జరుగుతున్న మరమ్మతు పనుల పరిశీలన అనంతరం మీడియాతో చిట్‌చాట్‌లో అనేక అంశాలపై సీఎం స్పందించారు. ఓటరు జాబితా ప్రక్షాళన (ఎస్ఐఆర్), గ్లోబరీనా సంస్థ వ్యవహారం, కాళేశ్వరం ప్రాజెక్టు, హైడ్రా పనితీరు, బీఆర్ఎస్, బీజేపీలపై స్పందించారు.ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని చెప్పిన సీఎం.. ఎస్ఐఆర్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇప్పటికే 70 శాతం పూర్తయిందని, ఇంకా 30 శాతం మిగిలి ఉందని తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటరు జాబితాలో చిన్న పొరపాట్లు కూడా సరిచేసుకోవాలని సూచించారు. బూత్ స్థాయిలో పార్టీ ఏజెంట్లను ఏర్పాటు చేసి, నిజమైన ఓట్లు తొలగిపోకుండా పరిశీలిస్తున్నామన్నారు. గతంలో కొడంగల్ కర్ణాటకలో ఉండేదని, భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడినప్పుడు తెలంగాణలోకి వచ్చిందని సీఎం గుర్తుచేశారు. కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకొని, తన ఓటును బదిలీ చేయించుకున్నట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. తనకు రెండు ఓట్లు ఉంటే ఫిర్యాదు చేయాలని, తప్పుడు ఫిర్యాదు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటానన్నారు. ఓటు లేకుంటే ప్రభుత్వ పథకాల అమల్లోనూ ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రక్షాళన పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే అవకాశాలు ఉన్నందున, అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచించినట్లు చెప్పారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో లక్షలాది ఓట్లు తొలగించారని, అప్పట్లో కాంగ్రెస్ పార్టీ కోర్టును ఆశ్రయించడంతో ఎన్నికల సంఘం అప్పటి జీహెచ్ఎంసీ కమిషనర్ సోమేశ్ కుమార్‌పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిందన్నారు. కాంగ్రెస్ లక్ష్యంగా సర్ ప్రక్రియ జరుగుతోందని, పార్టీ ఓటు బ్యాంకును దెబ్బతీసే కుట్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు.పేదలకు ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం పేదల ఇళ్లను దళారులకు అమ్ముకుందని ఆరోపించారు. ఇప్పుడు నియోజకవర్గ పరిధిలోనే అర్హులైన పేదలకు నాణ్యమైన, ఖరీదైన ఇళ్లు నిర్మించి ఇస్తున్నట్లు వివరించారు.

**కేటీఆర్‌పై తీవ్ర ఆరోపణలు..**

గ్లోబరీనా సంస్థపై తీవ్ర ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వంలో గ్లోబరీనా సంస్థ ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో వ్యవహరించిన తీరుతో 27 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపించారు. గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీ సంస్థ అని సీఎం ఆరోపించారు. గ్లోబరీనా వ్యవహారంలో అమరవీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్‌కు ఆ సంస్థతో సంబంధం లేదని భావిస్తే సీసీఎస్‌లో ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరారు. ఈ విషయంలో కేటీఆర్ తన నిజాయితీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీపై దేశవ్యాప్తంగా ఉద్యమం జరుగుతుంటే, బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అంశంలో బీఆర్ఎస్ మౌనం ఎందుకని నిలదీశారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒకటేనని ఈ విషయం కూడా స్పష్టం చేస్తోందని ఆరోపించారు. తాము తిరిగి ప్రారంభించిన ధర్నాచౌక్‌లోనే, శుక్రవారం కేటీఆర్ ధర్నా చేస్తున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో శాంతియుతంగా ధర్నాలు, నిరసనలు నిర్వహించుకోవడానికి పూర్తి స్వేచ్ఛ ఉందని చెప్పారు. అయితే ప్రజలకు ఇబ్బందులు కలిగితే పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. ఇటీవల తెలంగాణ భవన్‌లో నిర్వహించిన రక్తదానంపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్ కుటుంబ సభ్యులు, కేటీఆర్ బంధువులు ఎవరైనా రక్తదానం చేశారా అని ప్రశ్నించారు. సేకరించిన రక్తాన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు అందిస్తే మరింత ఉపయోగకరంగా ఉండేదన్నారు. హరీశ్‌రావే సమాధానం చెప్పాలి. హైడ్రా సమర్థవంతంగా పనిచేస్తోందని, ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి తిరిగి స్వాధీనం చేసుకుంటోందని కొనియాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్‌డీఎస్ఏ సూచనలను ప్రభుత్వం పూర్తిగా అమలు చేస్తామని చెప్పారు. బ్యారేజ్ దెబ్బతిన్నప్పుడు అధికారంలో ఉన్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అప్పుడు కాఫర్ డ్యామ్ ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. ఇరిగేషన్ శాఖ నుంచి హరీశ్‌రావును కేసీఆర్ ఎందుకు తప్పించారో ఆయనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు తీసుకున్నారనే కారణంగానే ఆయనను పక్కన పెట్టారని ఆరోపించారు. ఎన్‌డీఎస్ఏ చైర్మన్ నాణ్యత ప్రమాణాలు పరిశీలించడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్, కేంద్ర జలశక్తి మంత్రికి స్వయంగా ఫిర్యాదు చేశారన్నారు. బీజేపీలో అంతర్గత విభేదాల కారణంగానే, ధాన్యం కొనుగోలు వ్యవహారంలో నాయకులు తలోమాట మాట్లాడుతున్నారని సీఎం అన్నారు. రాజధాని నగరంలో హైడ్రా బాగా పని చేస్తోందని సీఎం కితాబిచ్చారు. అనేక ప్రాంతాల్లో ఆస్తులకు రక్షణ కల్పించిందని చెప్పారు. తెలంగాణలో లక్ష కోట్లు పెట్టుబడులు పెడితే వాళ్ల పేర్లను ఆయా రోడ్లకు పెడతామని రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

## విద్యార్థులు ఒంటరివారు కాదు


**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచడమే లక్ష్యంగా విపక్షాలు వ్యూహరచన చేస్తున్నాయి. ఈ మేరకు ఢిల్లీలోని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నివాసంలో ఇండి కూటమి ఎంపీలు సమావేశమయ్యారు. పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహంపై రాహుల్ దిశానిర్దేశం చేశారు. పేపర్ లీకేజీలో బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళనలకు మద్దతుగా నిలవాలని విపక్ష కూటమి నిర్ణయించింది. విద్యార్థుల డిమాండ్లకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు రాహుల్, ప్రియాంక సహా విపక్ష నేతలు బస్సుల్లో బయలుదేరగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రాహుల్ నివాసం వద్ద కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సమయంలో మాట్లాడిన రాహుల్ గాంధీ, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వల్ల ఆత్మహత్య చేసుకున్న వారికి నివాళులు అర్పించేందుకు గాంధీ స్మృతివనం వద్దకు వెళ్లాలని నిర్ణయించామని చెప్పారు. మొదట ఇండియా గేట్ వద్దకు వెళ్లాలని భావిస్తే పోలీసులు అనుమతి నిరాకరించారని తెలిపారు. విద్యార్థులు ఒంటరివారు కాదన్న రాహుల్ వారితో తామంతా ఉన్నామని పేర్కొన్నారు. విద్యార్థుల డిమాండ్లకు ఇండి కూటమి సంపూర్ణ మద్దతు ఉందని ప్రకటించారు. అనంతరం నేతలంతా గాంధీ స్మృతి కేంద్రం వద్దకు చేరుకొని కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. నీట్ పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నివాళులు అర్పించారు. మరోవైపు ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు రాహుల్ గాంధీ నివాసం చుట్టుపక్కల బందోబస్తు పెంచారు. మంగళవారం ప్రధాని మోడీ నివాసం వద్ద మెరుపు ధర్నాను దృష్టిలో పెట్టుకొని పోలీసులు భద్రతను పెంచినట్లు తెలుస్తోంది.

## సమగ్ర తాగునీటి సరఫరా మాస్టర్ ప్లాన్ రూపొందించాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణాన్ని నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఎక్కడైనా న్యాయపరమైన సమస్యలు ఉంటే వాటిని వేగంగా పరిష్కరించుకునేందుకు ప్రయత్నించాలని సీఎం ఆదేశించారు. తాగు నీటి సరఫరాకు సంబంధించిన పనులు, ఎస్టీపీల నిర్మాణ పనుల ప్రగతిపై ప్రతి నెల తనకు నివేదిక సమర్పించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పనుల పురోగతి తెలుసుకునేందుకు వీలుగా డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో పరిశ్రమలు, వివిధ నిర్మాణ పనుల్లో గ్రే వాటర్ వాడేలా నిబంధనలు రూపొందించి అమలు చేయాలని సీఎం సూచించారు. సమీక్షలో ఎంఏ యూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎండీ అశోక్ రెడ్డి, జేఎండీ మయాంక్ మిట్టల్ తదితరులు పాల్గొన్నారు.

## ఓయూ, జేఎన్‌టీయూ సహా పలు వర్సిటీల పరిధిలో పరీక్షలు వాయిదా



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ వ్యాప్తంగా శుక్రవారం విద్యాసంస్థల బంద్‌కు పలు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ), జేఎన్‌టీయూ, తెలంగాణ విశ్వవిద్యాలయం (టీయూ), శాతవాహన వర్సిటీల పరిధిలో నిర్వహించే పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు ఆయా విశ్వవిద్యాలయాలు ప్రకటించాయి. అనుబంధ కళాశాలల్లో జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నామని.. త్వరలో కొత్త తేదీని ప్రకటిస్తామని ఓయూ, జేఎన్‌టీయూ, టీయూ, శాతవాహన వర్సిటీలు తెలిపాయి. ఈ మేరకు అనుబంధ కళాశాలలకు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించాయి. నీట్ పేపర్ లీకేజీ దోషులను శిక్షించడంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పలు విద్యార్థి సంఘాలు 24న బంద్‌కు పిలుపునిచ్చాయి.

## కేసీఆర్‌కు కమిటీ ఆహ్వానం

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అభిప్రాయాలను కూడా స్వీకరిస్తామని తెలంగాణ గుర్తింపు కమిటీ సభ్యుడు ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం తెలిపారు. కమిటీ సమావేశానికి రావాలని కేసీఆర్‌కు లేఖ రాసి, ఆయన సూచనలు, సలహాలు, అభిప్రాయాలను కమిటీ ముందు వెల్లడించే అవకాశం కల్పిస్తామని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల స్మారక భవనంలో తెలంగాణ కోసం ఉద్యమించిన మహిళా సంఘాల ప్రతినిధులతో తెలంగాణ గుర్తింపు కమిటీ సమావేశం నిర్వహించింది. భారీ సంఖ్యలో మహిళా ఉద్యమకారులు హాజరై పలు సూచనలు, అభిప్రాయాలను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ కే. కేశవరావు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం కలిగే విధంగా కమిటీ నివేదిక రూపొందిస్తామని స్పష్టం చేశారు. 1969 తెలంగాణ ఉద్యమం నుంచి 2009 ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వరకు ఉద్యమంలో పాల్గొన్న వారిని గుర్తించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. వీలైనంత త్వరగా కమిటీ నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని చెప్పారు. ఇప్పటివరకు నిర్వహించిన సమావేశాలతో పాటు అభిప్రాయాలు తెలియజేయలేక పోయిన వారికి కూడా అవకాశం కల్పించనున్నట్లు కేశవరావు వెల్లడించారు.

**త్వరలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు..**

త్వరలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు, సూచనలు స్వీకరించే ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే కీలక సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశాలు కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 6వ తేదీ నుంచి 16 రోజుల పాటు వివిధ వర్గాల నుంచి కమిటీ అభిప్రాయాలు సేకరించిందని, సుమారు 13 వేల మంది సమావేశాలకు హాజరయ్యారని, వెయ్యి మందికి పైగా తమ అభిప్రాయాలను నమోదు చేశారని కేశవరావు తెలిపారు. కమిటీ పరిధి ఉద్యమకారులను గుర్తించడం మాత్రమేనని, దీనికి రాజకీయ పార్టీలతో లేదా సంఘాలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అడ్డుకున్న కొందరు ఇప్పటికీ బాధ్యతారహితంగా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన విమర్శించారు.

**కేసీఆర్ పట్ల తమకు గౌరవం ఉంది..**

కేసీఆర్ పట్ల తమకు గౌరవం ఉందని పేర్కొన్న కోదండరాం, ఆయన అనుభవం కమిటీకి ఉపయోగపడుతుందని చెప్పారు. త్వరలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో కూడా ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు సేకరిస్తామని వెల్లడించారు.

**మహిళా ఉద్యమకారుల ఆందోళన..**

సమావేశం సందర్భంగా కొందరు మహిళా ఉద్యమకారులు కమిటీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిజమైన ఉద్యమకారుల అభిప్రాయాలను కమిటీ పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆరోపిస్తూ సభ్యులతో వాగ్వాదానికి దిగారు. అందరికీ సమాన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిటీ సభ్యులు వారికి వివరణ ఇవ్వడంతో పరిస్థితి సద్దుమణిగింది.

## దేశంలో అశాంతికి కాంగ్రెస్, వామపక్షాల ప్రయత్నం

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** దేశంలో అశాంతి నెలకొల్పి కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు కాంగ్రెస్, వామపక్షాలు, విదేశీ విచ్ఛిన్నకర శక్తులు కలిసి కుట్ర పన్నుతున్నాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ తరహా పరిస్థితులను భారత్‌లో సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. పూణే, ముంబై, హైదరాబాద్, ఢిల్లీల్లో నిర్వహించిన కార్యక్రమాలకు విదేశీ శక్తుల మద్దతు ఉందని, ఖలిస్తానీ వర్గాలు, కతార్, కెనడా, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుంచి ఆర్థిక సహకారం అందుతోందని పేర్కొన్నారు. నీట్ పరీక్ష లీకేజీ విషయం వెలుగులోకి వచ్చిన వెంటనే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుని 31 మందిని అరెస్టు చేసిందని, విద్యార్థులకు నష్టం జరగకుండా రీఎగ్జామ్స్ నిర్వహించిందని తెలిపారు. పరీక్షల్లో అక్రమాలను అరికట్టేందుకు కేంద్రం కఠిన చట్టాన్ని అమలు చేస్తోందని, ఎన్టీఏలో సంస్కరణలు చేపట్టిందని చెప్పారు. యూపీఏ హయాంలో అనేక జాతీయ స్థాయి పరీక్షల పేపర్లు లీక్ అయినప్పటికీ అప్పటి ప్రభుత్వాలు బాధ్యత వహించలేదని విమర్శించిన ఆయన, ప్రస్తుతం కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరుతున్న కాంగ్రెస్ తన గతాన్ని గుర్తు చేసుకోవాలని అన్నారు. ఉద్యోగాల కల్పనలో ఎన్డీయే ప్రభుత్వం కొత్త రికార్డులు సృష్టించిందని, 2014-2024 మధ్య 17 కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు నిరుద్యోగిత రేటు గణనీయంగా తగ్గిందని తెలిపారు. ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్, ఎన్ఐటీలు, మెడికల్ కళాశాలల సంఖ్య పెంచడంతో పాటు ఉన్నత విద్యలో ప్రవేశాలు కూడా విస్తరించాయని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దేశ వ్యతిరేక శక్తులకు మద్దతు ఇవ్వడం మానుకోవాలని హెచ్చరించిన రాంచందర్ రావు, దేశ సమగ్రతకు భంగం కలిగించే ప్రయత్నాలను భారత యువత తిప్పికొడుతుందని అన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ లీగల్ నోటీసులు



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** గ్లోబరీనా తన బినామీ సంస్థ అంటూ వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి లీగల్ నోటీసులు పంపినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. రేవంత్ రెడ్డి సమాధానం ఇవ్వకపోతే న్యాయపరంగా ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. గ్లోబరీనా సంస్థపై తనపై సీబీఐ, సీఐడీ, ఎఫ్‌బీఐతో విచారణ చేయిస్తే తాను సంపూర్ణంగా సహకరిస్తానని సంస్థ తనదేనని నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. లేదంటే సీఎంకు తనకు లైడిటెక్టర్ కూడా సిద్ధమేనన్నారు. ఒకవేళ సంస్థ తనదే అయితే మరి రేవంత్ సర్కారు గ్లోబరీనాతో ఎందుకు ఒప్పందం చేసుకుందో చెప్పాలని డిమాండ్ చేశారు. హన్మకొండలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన కేటీఆర్ మీడియా ప్రతినిధులతో చిట్ చాట్‌లో పలు అంశాలపై మాట్లాడారు. దేశ రాజధానిలో యువత చేస్తున్న ఉద్యమం తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేస్తుందని కేటీఆర్ తెలిపారు. నాయకుడు లేకుండానే యువత స్ఫూర్తివంతమైన ఉద్యమం చేస్తుందన్నారు. ఢిల్లీ ఉద్యమంతో మోడీ ప్రభుత్వం అతిపెద్ద సవాల్ ఎదుర్కొంటోందన్న కేటీఆర్ బీజేపీ ప్రభుత్వం ఎవరితో పెట్టుకోకూడదో వారితోనే పెట్టుకుందని తెలిపారు. మోదీపై యువత తీవ్ర వ్యతిరేకత, అసహనంతో ఉన్నారని అన్నారు. బీజేపీ పతనానికి నాంది పడిందని మోదీని దేవుడు అన్నోళ్లే తిరుగుబాటు చేస్తున్నారని అభిప్రాయపడ్డారు. దేశంలోనే దిక్కు లేకుండా పోయేపరిస్థితి బీజేపీకి ఎదురవుతోందని, ఇక తెలంగాణలో అధికారంలోకి వచ్చే పరిస్థితి ఎక్కడుందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మోదీపై మాట్లాడే దమ్ము ఎక్కడుందని నిలదీశారు. తోటి కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఢిల్లీ వెళ్లి మోదీ ఇంటిముందు ధర్నా చేస్తే రేవంత్ రెడ్డి కనీసం రాజ్ భవన్ ముందు కూడా ఆందోళన చేయకుండా కొడంగల్‌లో చేశారని విమర్శించారు. రేవంత్ రెడ్డి పగలు కాంగ్రెస్‌తో రాత్రి బీజేపీతో ఉంటాడని, బీజేపీ ఎంపీల కార్లలో వెళ్లి రేవంత్ రెడ్డి అమిత్ షాతో సమావేశాల్లో పాల్గొంటున్నాడని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ కాంగ్రెస్‌కి ఒక మూట ఇస్తే బీజేపీకి రెండు మూటలు పంపుతున్నాడని విమర్శించారు. వచ్చే ఏడాది తన పాదయాత్ర ఉంటుందన్న కేటీఆర్ ఏ పార్టీతోనూ పొత్తు ఉండబోదని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను సీఎం చేయడమే తన ఎజెండా అన్నారు. సీఎం పదవి వారసత్వ హక్కు కాదని, తనకు ఎలాంటి భ్రమలు లేవన్నారు. ఈ సారి రైతులు, యువత, మహిళలను తమవైపు ఆకర్షించేలా పార్టీ కార్యాచరణ ఉంటుందని ఆగస్టు 10 తర్వాత పార్టీ సంస్థాగత బలోపేతం చేపడతామన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి మంచి మనసు..

**పేద విద్యార్థిని చదువుకు రూ.10లక్షల ఆర్థికసాయం**



**విశ్వంభర, నల్గొండ:** తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంచి మనసును చాటుకున్నారు. నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన పేద విద్యార్థిని పరిమళ ఉన్నత చదువుకు రూ.10 లక్షల ఆర్థికసాయం అందజేశారు. పరిమళ.. ఐఐటీ మద్రాస్‌లో ఉన్నత విద్య పూర్తిచేసి జర్మనీ విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ చేసేందుకు సీటు సాధించింది. ఆమె తల్లిదండ్రులు రోజువారీ కూలీలు. పరిమళ ఆర్థిక పరిస్థితిని మంత్రి కోమటిరెడ్డి దృష్టికి దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి.. కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ.10లక్షల ఆర్థికసాయం అందజేశారు. మంత్రి అందించిన సహకారంపై పరిమళ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## అమెరికాపై 9/11 తరహా దాడులు

- ఇరాన్ తీవ్ర హెచ్చరికలు



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** పశ్చిమాసియాలో పరిస్థితులు మరింతగా దిగజారుతున్నాయి. అమెరికాఇరాన్ పరస్పర దాడులు, ప్రకటనలతో ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. హర్మూజ్ జలసంధిలో ఇరాన్ ఇకనుంచి ఏదైనా నౌకపై దాడి చేసినప్పుడల్లా ఆ దేశంలోని ఓ వంతెన లేదా విద్యుత్ కేంద్రంపై బాంబులేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఐఆర్‌జీసీ తీవ్రంగా స్పందించింది. అమెరికాపై 9/11 తరహా దాడి చేస్తామని బెదిరించింది. ఘర్షణలు ఇలాగే కొనసాగితే ఆ దేశం జాతీయ సంతాప దినాలు చేసుకోవాల్సి వస్తుందంటూ హెచ్చరికలు చేసినట్లుగా ఇరాన్ ప్రభుత్వ అనుబంధ మీడియా సంస్థ తస్నిమ్ పేర్కొంది.వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై ఉగ్రవాదుల దాడి అమెరికా చరిత్రలో అత్యంత విషాదకర ఘటనగా మిగిలిపోయింది. సెప్టెంబరు 11, 2001న నాలుగు విమానాలను అల్‌ఖైదా ఉగ్రవాదులు హైజాక్ చేసిన సంగతి తెలిసిందే. 19 మంది ఉగ్రవాదులు నాలుగు జట్లుగా విడిపోయి ‘ట్విన్ టవర్స్’గా పిలుచుకునే ప్రపంచ వాణిజ్య సంస్థ భవంతులపై దాడులకు పాల్పడ్డారు. ఈ మారణహోమంలో మొత్తం 2,996 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 25 వేల మంది పౌరులు క్షతగాత్రులయ్యారు. అప్పుడు అమెరికా జాతీయ సంతాప దినాలు ప్రకటించింది. ఆ విషయాన్ని ప్రస్తావిస్తూనే ఇరాన్ ఈ తరహా వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

**మేం చమురు అమ్మకపోతే.. ఇంకెవరూ అమ్ముకోలేరు: ఇరాన్..**


అమెరికా బలగాలు హర్మూజ్‌కు దూరంగా ఉంటేనే ఆ జలసంధి భద్రంగా ఉంటుందని ఇరాన్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. తాము చమురు విక్రయించకపోతే.. ఇంకెవరూ అమ్మలేరని పేర్కొన్నారు. హర్మూజ్‌లో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు చేయడంతో పశ్చిమాసియాలో మరోసారి మొదలైన ఘర్షణలు.. దాదాపు 12 రోజులుగా కొనసాగుతున్నాయి. టెహ్రాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీసేలా దాడులు చేశామని యూఎస్ సెంట్రల్ కమాండ్ తాజాగా ప్రకటించింది.

**సౌదీ చమురు ట్యాంకర్లపై దాడి చేశాం: హూతీలు..**


ఎర్ర సముద్రానికి గేట్‌వే వంటి బాబ్ ఎల్ మాండెబ్ జలసంధిని మూసివేస్తున్నట్లు యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. సౌదీ అరేబియా నౌకల రాకపోకలను అడ్డుకుంటామని వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే సౌదీకి చెందిన రెండు చమురు ట్యాంకర్లపై దాడులు చేసినట్లు ప్రకటించారు.

## విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు : కలెక్టర్ హరిత

**విశ్వంభర, ఆసిఫాబాద్ :** విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హరిత హెచ్చరించారు. గురువారం ఆసిఫాబాద్ మండలంలోని మోవాడ్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించగా నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపీ, మందుల స్టాక్ రిజిస్టర్లు ఖాళీగా ఉండడం, మందుల వివరాలు నమోదు చేయకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. అలాగే గత పది రోజులుగా సిబ్బంది హాజరు నమోదు కాకపోవడంతో సంబంధిత సిబ్బందికి గైర్హాజరు వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిబ్బంది తమ పనితీరును మార్చుకోవాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. 58 మంది విద్యార్థులకు గాను 10 మంది ఉపాధ్యాయులు ఉండడాన్ని గమనించి, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సిబ్బందిని ఆదేశించారు. అంతకుముందు కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే కోవలక్ష్మితో కలిసి జిల్లాస్థాయి ఆహార భద్రత విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో చౌకధరల దుకాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ వసతి గృహాలకు ప్రతి నెల 3,205 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా అవుతుందని, ఆ బియ్యం పక్కదారి పట్టకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలోని నార్సింగి పీఎస్ పరిధిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. పుప్పాలగూడలో ఈ ఘటన చోటుచేసుకుంది. అపార్ట్‌మెంట్ పదో అంతస్తు పైనుంచి దూకి మబ్బు విష్ణువర్ధన్‌రెడ్డి (24) బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ డా .చాచం సత్యనారాయణ చేతుల మీదుగా చైతన్యపురిలోని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన వెంకటేష్ ప్రశంస పత్రాన్ని అందుకున్నాడు. (విశ్వంభర, చైతన్యపురి)

# పేదోడు హైదరాబాద్‌లో ఉండకూడదా?



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** హైదరాబాద్ మహానగరం నడిబొడ్డులో పేదలకు గౌరవప్రదమైన సొంతింటిని అందించాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని చూసి బీఆర్ఎస్ నాయకత్వం తీవ్ర అసహనానికి గురవుతున్నదని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి విమర్శించారు. గురువారం సెక్రటేరియట్‌లోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, దరఖాస్తులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిరుపేదలు నివసిస్తున్న ప్రాంతంలోనే వారి సొంతింటి కలను నెరవేర్చడానికి నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ ఇళ్ల కోసం స్థానికంగా అందుబాటులో ఉన్న మీ సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మీసేవ వాట్సాప్ నెంబర్ (8096958096), వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పదేళ్ల పాలనలో వారు చేయలేని పనిని సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టించేలా విష ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఉద్యోగాలు, ఉపాధి, పిల్లల చదువులు, వైద్య సౌకర్యాలకు 3040 కిలోమీటర్ల దూరంలో కనీస వసతులు కల్పించకుండా అరకొరగా ఇళ్లను నిర్మించి అదే పేదల సంక్షేమమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ భూములను ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తూ పేదలకు శాశ్వత భరోసా కల్పించే చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే దానిపై ఎందుకు ఇంత విషప్రచారమని ప్రశ్నించారు. పేదోడు హైదరాబాద్‌లో ఉండకూడదా? నగరంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములలో పేదలకు ఇళ్లు నిర్మించకూడదా? అని నిలదీశారు. ప్రభుత్వ భూముల పేదల కోసం వినియోగిస్తే ఎందుకింత కడుపుమంట అన్నారు. బీఆర్ఎస్ చేస్తున్న విష ప్రచారాలను, కపట నాటకాలను హైదరాబాద్ మహానగర ప్రజలు గమనించాలని.. పేదల సంక్షేమాన్ని అడ్డుకునే రాజకీయాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇందిరమ్మ టవర్స్‌గా మార్చి విక్రయిస్తారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని.. ప్రభుత్వ ప్రకటించిన మార్గదర్శకాల ప్రకారమే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. లబ్ధిదారుల మీద ఆర్థిక భారం తగ్గించడానికి ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ ఇస్తోంది.. ఇది అమ్మకం కాదు, ప్రభుత్వ ఆర్థిక సహకారమన్నారు. లబ్ధిదారుడి వాటా అన్ని ప్రాంతాల్లో రూ.6 లక్షలు మాత్రమే అని.. ఫ్లాట్ మార్కెట్ విలువ తొలి విడతలో ప్రారంభించనున్న 16 నియోజకవర్గాలలో రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. ఎస్ఆర్‌వో (బేసిక్) విలువ రూ.14.6 లక్షల నుంచి రూ.28.4 లక్షల వరకు ఉన్నదని.. దీంతో ప్రభుత్వం అందించే సబ్సిడీ, భూమి విలువ, నిర్మాణ వ్యయాన్ని కలిపి పేదలకు అత్యంత తక్కువ ధరలో గృహాలను అందించే అవకాశం కల్పిస్తున్నదని చెప్పారు. లబ్ధిదారుడికి ప్రభుత్వం రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల విలువైన ఇల్లు సమకూరుస్తున్నదని.. ఇందులో లబ్ధిదారుడి వాటా కేవలం ఆరు లక్షల రూపాయలు మాత్రమేనని వెల్లడించారు. ఈ విష ప్రచారాన్ని ఇదేవిధంగా కొనసాగిస్తే జూబ్లీహిల్స్, కంటోన్మెంట్ ఉప ఎన్నికలలో పట్టిన గతే రాష్ట్రవ్యాప్తంగా పడుతుందని హెచ్చరించారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత

**విశ్వంభర, చంపాపేట్ :** చంపాపేట డివిజన్ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీ లో నివాసం ఉంటున్న సంధ్య కిడ్నీలకు సంబందించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారి యొక్క కుటుంబ సభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ని సంప్రదించారు.వెంటనే స్పందించిన సుధీర్ రెడ్డి వారి చికిత్సకు అవసరమైన వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా దరఖాస్తు చేయించారు.దానికి గాను రూ.2,80,000 (రెండు లక్షల ఎనభై వేల రూపాయలు) ఎల్.ఓ.సీ. మంజూరు కాగా ఆ చెక్కును బాధిత భర్త శ్రీనివాస్ కి అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయడం తమకు ఎంతో సంతృప్తిని ఇస్తుందని తెలిపారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక మంది పేద కుటుంబాలకు సహాయం చేసే అవకాశం లభించిందన్నారు.ఈ కార్యక్రమంలో భారాస నాయకులు రాకేష్ దాగూర్,పందాల రాజశేఖర్ గౌడ్,అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆషాడ మాసం గోరింటాకు సంబురాలు



**విశ్వంభర, సరూర్ నగర్ :** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కె పురం డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీ లో గురువారం గ్రీన్ హిల్స్ కాలనీ అభ్యుదయ మహిళా మండలి అధ్యక్షురాలు చిట్టెడి పుష్పలత రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలందరూ చేతులకు గోరింటాకు పెట్టుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం పుష్పలత రెడ్డి మాట్లాడుతూ ఆషాడ మాసం అంటే జూన్‌జులై ఈ నెలలో వర్షాలు మొదలవుతాయి అని ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకే గోరింటాకు పెట్టుకుంటారని తెలిపారు. వర్షాకాలం ప్రారంభమయ్యే నాటికి ఫంగస్, బ్యాక్టీరియా ఎక్కువగా వస్తాయి అని యాంటీ బ్యాక్టీరియల్ యాంటీ ఫంగల్ గా ఉండేందుకు గోరింటాకు పెట్టుకుంటారని తెలిపారు. చేతులు, కాళ్లకు పెట్టుకుంటే వేడి తగ్గి, ఇన్ఫెక్షన్స్ రాకుండా కాపాడుతుంది. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ అర్చన, ట్రెజరర్ కృష్ణవేణి పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## ఖేలో ఇండియా గేమ్స్–2026 ఏర్పాట్లు పరిశీలించిన అధికారుల బృందం



**విశ్వంభర, సరూర్ నగర్ :** తెలంగాణలో నిర్వహించనున్న 8వ ఎడిషన్ ఖేలో ఇండియా గేమ్స్-2026 ఏర్పాట్లలో భాగంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయి) అధికారుల బృందం గురువారం రంగారెడ్డి జిల్లాలో పర్యటించింది. సాయి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమర్ జ్యోతి నేతృత్వంలోని బృందంలో అసిస్టెంట్ డైరెక్టర్లు మధు హర్ష, గోపాల్ కందపాల్, మోహిత్ పరిశీలించారు. ఈ బృందం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలోని సరూర్‌నగర్ స్టేడియంతో పాటు అజీజ్‌నగర్‌లోని శ్రీనిధి ఫుట్‌బాల్ అకాడమీని సందర్శించింది. ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడా వసతులు, క్రీడాకారులు, సాంకేతిక అధికారులు, సందర్శకులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. పోటీల నిర్వహణకు అనుగుణంగా అవసరమైన మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. పరిశీలనలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు రవీందర్, రవితేజ, అశోక్ కుమార్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు శ్రీనివాస్, సందీప్, రంగారెడ్డి జిల్లా డీవైఎస్‌వో, స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లు, ఫిజియోథెరపిస్టులు, తెలంగాణ ఖేలో ఇండియా విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యూనిఫాంల నాణ్యతపై రాజీపడేది లేదు

**విశ్వంభర, హైదరాబాద్:** యూనిఫాంలు పంపిణీ చేసిన తర్వాత వాటి నాణ్యత, సైజు ఇతర అంశాలపై ప్రతి విద్యార్థి నుంచి వాట్సాప్ ద్వారా అభిప్రాయ సేకరణ (ఫీడ్ బ్యాక్) తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. విద్యార్థులు ఇచ్చే ఫీడ్ బ్యాక్ ఆధారంగా వచ్చే ఏడాది పంపిణీ, వాటి రంగులు ఇతర అంశాలపై నిర్ణయం తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థులకు యూనిఫాంల అందజేతపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో గురువారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో చదివే విద్యార్థులకు అందజేసే యూనిఫాంల నాణ్యతలో రాజీపడమని సీఎం తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నాటికి పిల్లలందరికీ యూనిఫాం అందజేయాల్సినదేనని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే సహించనని సీఎం హెచ్చరించారు. మహిళా సంఘాలు కుట్టు పని వేగవంతం చేసేలా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సెర్ప్ సీఈవో దివ్యకు సీఎం సూచించారు. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు యూనిఫాంల అందజేతలో అడ్డగోలుగా వ్యవహరించారని సీఎం అన్నారు. తాము వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని... నాణ్యమైన యూనిఫాంలు అందిస్తామని తెలిపారు. పేద పిల్లల కోసం పని చేస్తున్నామని అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. వచ్చే సంవత్సరం జూన్ 2వ తేదీ నాటికే విద్యార్థులకు యూనిఫాం అందేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, ఆయా శాఖల అధికారులు బాల మాయా దేవి, షఫీ ఉల్లా, విజయేంద్ర బోయి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

## విఎంహోమ్ లో "యంగ్ ఇండియా స్టూడెంట్ కిట్" పంపిణీ

### పాల్గొన్న రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి



**విశ్వంభర, సరూర్ నగర్ :** మహేశ్వరం నియోజకవర్గం సరూర్‌నగర్ డివిజన్లోని విక్టోరియా మెమోరియల్ హోమ్ రెసిడెన్షియల్ పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అకడమిక్ ఇయర్ 2026-2027 కు సంబంధించిన "యంగ్ ఇండియా స్టూడెంట్ కిట్ అవసరమైన వస్తువుల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సమానమైన అవకాశాలు కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు. విద్యార్థులకు విద్యా సంవత్సరానికి కావలసిన స్టూడెంట్ కిట్లు ఇతర మౌలిక అవసరమైన వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మల్రెడ్డి రామిరెడ్డి ,ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, ఎన్టీఆర్ నగర్ డివిజన్ అధ్యక్షుడు ముప్పిడి లింగస్వామి గౌడ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ మైనార్టీ నాయకుడు ఎస్కే మహమ్మద్, బండి మధుసూదన్ రావు, రమేష్ నేత, మహేందర్ యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే తమ లక్ష్యం : మంత్రి అడ్లూరి

**విశ్వంభర, చైతన్యపురి :** ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోమ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఇంటర్‌కు అప్‌గ్రేడ్ చేస్తామని తెలిపారు. విక్టోరియా మెమోరియల్ హోమ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి యంగ్ ఇండియా స్టూడెంట్ కిట్ అండ్ అమెనిటీస్ డిస్ట్రిబ్యూషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు, అవసరమైన అమెనిటీస్‌ను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోమ్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణిస్తున్నారని అభినందించారు. అండర్ 16 విభాగంలో ఖేలో ఇండియా, స్కూల్ గేమ్స్ పోటీల్లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, ఈశ్వరమ్మ యాదవ్, పున్న గణేశ్ నేత, బుద్ద సత్యనారాయణ, చిలుక ఉపేందర్ రెడ్డి, కందికంటి శ్రీధర్ గౌడ్, స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీపార్వతి, వైస్ ప్రిన్సిపాల్ నర్సింహరెడ్డి, స్కూల్ సెక్రటరీ సాల్మాబాను తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్ట్ నియంతృత్వ పోకడలకు నిదర్శనం

### - పున్న గణేష్ నేత




**విశ్వంభర, ఎల్బీనగర్ :** లోక్ సభ ప్రధాన ప్రతిపక్ష నేత, ఏఐసీసీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ ని అరెస్ట్ నియంతృత్వ పోకడలకు నిదర్శనం అని శ్రీ రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత అన్నారు. శ్రీ రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చిలక ఉపేందర్ రెడ్డి, ఎన్టీఆర్ నగర్ డివిజన్ అధ్యక్షుడు ముప్పిడి లింగస్వామి గౌడ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల మీద అమానుశంగా ప్రవర్తించి లాఠీ చార్జి చేసినందుకు, రాహుల్ గాంధీ ని అరెస్ట్ కు నిరసనగా శాంతియుతంగా నిరసన ర్యాలీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది .ఈ సందర్భంగా పున్న గణేష్ నేత మాట్లాడుతు 12 సంవత్సరాల బిజెపి పాలనలో 152 సార్లు ప్రశ్నాపత్రాలు లీక్ చేసిన వారిని అరెస్టు చేయకుండ 7.5 కోట్ల విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేశారు అని అన్నారు. నీట్ సహా అనేక ప్రశ్నాపత్రాల లీకేజీలతో కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తును అయోమయంలో పడేశారు. దోషులంతా స్వేచ్ఛగా బయట తిరుగుతున్నారు.దీనికి మౌనంగా ఉన్న ప్రధానమంత్రి మోడీ సమాధానం చెప్పాలి అని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను రాజీనామా చేయించాలని , మంత్రివర్గము నుండి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బండి మధుసూదన్, రమేష్ నేత, రంగారెడ్డి జిల్లా సీనియర్ మైనార్టీ నాయకులు ఎస్కే మహమ్మద్, రామకృష్ణ , బొడ్డుపల్లి మహేందర్, పెద్దవూర సైదులు, యాదవ రెడ్డి, దుర్గాప్రసాద్, వెంకటరమణారెడ్డి, దుబ్బాక శేఖర్ , జెల్లా జగన్నాథం, అక్బర్, జ్ఞానేశ్వర్, రేణుక, విప్లవ రెడ్డి, నగేష్, మంజుల, స్వరూప ,ఈశ్వరి పార్వతమ్మ ,శ్వేత స్వరూప, జ్యోతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చండూరులో కాంగ్రెస్ నాయకుల ధర్నా, రాస్తారోకో



**విశ్వంభర, చండూర్ :** ఎఐసిసి, పిసిసి,డీసిసి,మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పిలుపు మేరకు రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును ఖండిస్తూ చండూరు మున్సిపాలిటీ పరిధిలోని మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ ధర్నా మరియు రాస్తారోకో నిర్వహించాయి. ఈ సందర్భంగా చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్లే ప్రతిష్టాత్మక నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ అయిందని, ఈ స్కామ్ వల్ల సుమారు 21 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడమే కాకుండా లక్షలాది మంది భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడటం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం, న్యాయం కోసం గళమెత్తిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీయడమేనని, ప్రశ్నించే గొంతులను నొక్కేస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందని మండిపడ్డారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి సంపూర్ణ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు మేకల సాగర్ రెడ్డి , మున్సిపల్ పట్టణ అధ్యక్షులు ఐతరాజు మల్లేష్, వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, కౌన్సిలర్లు కోడి సుష్మ వెంకన్న, బూషిపాక వాసు, కటకం రమేష్, కో ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు దోటి వెంకటేష్ యాదవ్, కాంగ్రెస్ మండల మరియు పట్టణ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, అనుబంధ సంఘాల నాయకులు, యూత్ కాంగ్రెస్ మరియు ఎన్ఎస్‌యుఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ పట్ల మోదీ ప్రభుత్వం వ్యవహరించిన తీరుకు నిరసన




**విశ్వంభర, దిల్ సుఖ్ నగర్ :** పార్లమెంటులో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్ల మోడీ ప్రభుత్వం వ్యవహరించిన తీరుకు నిరసనగా గడ్డి అన్నారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు యం.సునీల్ బాబు ఆధ్వర్యంలో దిల్సుఖ్నగర్లో మూతికి నల్ల రిబ్బన్లు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ బాబు మాట్లాడుతూ.. నీట్ పేపర్ లికేజి తీరుతో లక్షలాది మంది విద్యార్థులు ఎంతో ఇబ్బంది పడ్డారని, కొంతమంది యూత్ యువకులు ప్రాణాలు కూడా కోల్పోయారని అన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రిగా పనికిరాని ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు మర్రి శశికళ , బబ్బురి ఆనంద్ గౌడ్, చందర్ యాదవ్, తుడి గోవర్ధన్, రవీందర్, బొల్లి సురేష్, సాయి , కందికంటి పండరినాథ్ గౌడ్, వై వి కృష్ణారెడ్డి, సన్నాయి శ్రీనివాస్, కుమార్, సురేష్‌నాయుడు, సంతోష్, రాజు, అనంత వెంపటి, శ్రీనివాస్ విజయ్ చౌదరి, నవీన్ గౌడ్, కృష్ణ, మహేష్, డింపు, వేణు తదితరులు పాల్గొన్నారు.

## రాజలక్ష్మి కాలనీలో నూతన కమ్యూనిటీ హాల్ ప్రారంభం




**విశ్వంభర, నాగోల్ :** నాగోల్ లోని రాజలక్ష్మి కాలనీలో నూతనంగా నిర్మించిన "రాజలక్ష్మి కాలనీ కమ్యూనిటీ హాల్" ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. కొలన్ రాజ్యలక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఈ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించి కాలనీవాసులకు అంకితం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీ ప్రజలకు సామాజిక,సాంస్కృతిక,శుభకార్యాల నిర్వహణకు ఈ కమ్యూనిటీ హాల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే శాశ్వత ఆస్తిని నిర్మించి ప్రజలకు అందించిన దాతలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్ ,మాజీ నాగోల్ స్కూల్ కమిటీ అధ్యక్షులు బద్దం వెంకటేష్ గౌడ్ గారు, అనంతుల రాజరెడ్డి ,తూర్పటి చిరంజీవి,రంగేశ్వరి నాయుడు,సతీష్ యాదవ్,శిల్పరెడ్డి పాల్గొన్నారు.

రిపోర్టర్లు కావలెను
V3 NEWS
ప్రజా "విశ్వంభర" తెలుగు దిన పత్రిక
ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108

# మారుతున్న సమాజం – మసకబారుతున్న సిగ్గు గుణం!

సిగ్గు లేకపోతే మనిషి కాదు అని మన పెద్దలు తరచూ ఒక నానుడిగా చెబుతుండేవారు. తెలుగు నేల ముంగిట్లో, సాంప్రదాయ కుటుంబాల ఆవరణంలో పెరిగిన ప్రతి ఒక్కరికీ బాల్యం నుంచే పరిచితమైన నిత్య సత్యమిది. అమ్మమ్మలు, నాన్నమ్మలు తమ ముద్దుల మనవరాళ్లకు కాస్త సిగ్గు పడటం అలవాటు చేసుకోమ్మాఅని మందలించడమో, హితవు చెప్పడమో అప్పట్లో నిత్యకృత్యం. నలుగురిలోకి వచ్చినప్పుడు పెద్దల సమక్షంలో నెమ్మదిగా మాట్లాడటం, కళ్లు వాల్చి వినయంతో నడవడం, పెద్దల మాట జవదాటకపోవడం ఇవన్నీ ఒకప్పుడు సమాజంలో ఉన్నతమైన సంస్కారానికి, మర్యాదకు, కుటుంబ గౌరవానికి సజీవ సాక్ష్యాలుగా నిలిచేవి. కానీ, నేటి అత్యంత వేగవంతమైన, తీవ్రమైన పోటీతత్వంతో నిండిన ఆధునిక యంత్రయుగంలో సిగ్గు అనే విశిష్టమైన మానవీయ గుణం క్రమక్రమంగా తన అస్తిత్వాన్ని, స్థానాన్ని కోల్పోతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. సాంప్రదాయ బద్ధమైన సామాజిక జీవన స్రవంతిలో ఇది నిజంగా విలువల పతనానికి దారితీస్తున్న పరిణామమా? లేక కాలమాన పరిస్థితులకు అనుగుణంగా రూపాంతరం చెందుతున్న నవీన సమాజపు ప్రతిబింబమా? అనే అంశంపై నేడు సమగ్రమైన సామాజిక విశ్లేషణ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. భారతీయ సాంప్రదాయ సమాజంలో, ముఖ్యంగా అచ్చతెలుగు జీవన విధానంలో సిగ్గు అనేది కేవలం ఒక భావోద్వేగం లేదా సంకోచం మాత్రమే కాదు. అది ఒక వ్యక్తి యొక్క విశిష్ట ప్రతిభకు, శీలసంపదకు, క్రమశిక్షణతో కూడిన ప్రవర్తనకు నిలువుటద్దంగా నిలిచేది. విశేషించి స్త్రీమూర్తులకు సిగ్గు అనేది దేవుడిచ్చిన అపూర్వమైన ఆభరణంగా రూఢిగా నిలిచింది. సిగ్గే స్త్రీకి అసలైన అందం, అలంకారం అనే ఆర్యోక్తి తరతరాలుగా తెలుగు ఇంటి ముంగిళ్లలో మార్మోగుతూనే ఉంది. అదే సమయంలో పురుష పుంగవులకు సైతం పెద్దల సమక్షంలో, గురువుల ముందు వినయవిధేయతలతో మసలుకోవడం, హద్దులు దాటి అనవసరంగా పెదవి విప్పకపోవడం సంస్కారవంతమైన, గౌరవప్రదమైన నడవడిగా భావించేవారు. ఇది సమాజంలో అరాచకత్వం పెరగకుండా సామాజిక సమతుల్యతను కాపాడే సాధనంగా పనిచేసింది. పెద్దల పట్ల అమితమైన గౌరవభావాన్ని కలిగి ఉండటం, నైతిక హద్దులను ఏనాడూ మీరకపోవడం, తొందరపాటుతనంతో నిర్ణయాలు తీసుకోకపోవడం ఇవన్నీ సిగ్గు, వినయం అనే గుణాల ద్వారానే మానవ జీవితంలో లభ్యమవుతాయని నమ్మేవారు.అయితే, ఇరవై ఒకటవ శతాబ్దపు నవ సమాజం రూపురేఖలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. గ్లోబలైజేషన్ ఉప్పెన, డిజిటల్ విప్లవం, సోషల్ మీడియా ప్రభావంతో నేటి నవ్య యువతరం మానసిక దృక్పథంలో ఊహించని విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. ఆధునిక కాలంలో పాఠశాల ప్రాంగణాలు, కళాశాల కారిడార్లు, కార్పొరేట్ ఉద్యోగ రంగాలలో ఆత్మవిశ్వాసం అనే పదం అత్యంత ప్రాముఖ్యత కలిగిన మంత్రంగా మారింది. ఉద్యోగ ఇంటర్వ్యూలలో అభ్యర్థి కాస్త సిగ్గు పడుతూ, నమ్రతతో మాట్లాడితే లభించే ఉద్యోగ అవకాశాలు చేజారిపోతాయి. తరగతి గదిలో సందేహాలు వచ్చినప్పుడు వెనకడుగు వేసి ధైర్యంగా చేయి ఎత్తి ప్రశ్నించకపోతే విద్యాభ్యాసంలో వెనుకబడిపోతారు. పబ్లిక్ వేదికలపై ధారాళంగా ప్రసంగించలేకపోతే వారిలో నాయకత్వ లక్షణాలు లేవని సమాజం ముద్ర వేస్తుంది. ఈ పరిణామాల నేపథ్యంలో, ఒకప్పుడు ఆభరణంగా వెలిగిన సిగ్గు అనే గుణం ఇప్పుడు ఒక బలహీనతగా, ఆత్మవిశ్వాస లేమికి ప్రతిరూపంగా చులకనగా చూడబడుతోంది. నేటి తల్లిదండ్రులు సైతం తమ సంతానానికి అనవసరంగా సిగ్గుపడకండి, ధైర్యంగా మీ గొంతును వినిపించండి అని నూరిపోస్తున్నారు. ఇది ఒకప్పటి సాంప్రదాయ బోధనలకు పూర్తి భిన్నమైన నవ్య దృక్పథం.సమాజంలో చోటు చేసుకుంటున్న ఈ మార్పును సమర్థించే మేధావుల, పురోగమనవాదుల ముఖ్యమైన వాదన ఏమిటంటే పరిమితికి మించి అతిగా సిగ్గుపడటం వల్ల వ్యక్తులు తమలో దాగి ఉన్న అంతర్గత సామర్థ్యాలను, ప్రతిభను వెలికితీసి ప్రదర్శించలేకపోతున్నారు. ముఖ్యంగా ప్రాచీన కాలం నుండి మహిళల విషయంలో, సిగ్గు అనే సాకుతో వారి స్వేచ్ఛను, స్వతంత్ర ఆలోచనలను తీవ్రంగా అణచివేసిన వైనం చరిత్ర పుటల్లో కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. తమకు తీవ్రమైన అన్యాయం జరుగుతున్నా నోరు విప్పి గొంతు విప్పలేకపోవడం, ప్రాథమిక హక్కుల సాధన కోసం నిలబడలేకపోవడం, స్వంత అభిప్రాయాలను వ్యక్తపరచలేకపోవడం వంటి అంశాలు సిగ్గు అనే ముసుగులోనే సాగిన సామాజిక అణచివేతలేనని వీరు గట్టిగా వాదిస్తున్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసంతో తమ అభిప్రాయాలను స్పష్టంగా చెప్పడం, తమ హక్కుల పరిరక్షణ కోసం పోరాటం చేయడం నవ సమాజ పురోగమనానికి, వికాసానికి సంకేతమని వీరి విశ్వాసం.



మరొకవైపు, సాంప్రదాయ ప్రతిపాదకులు, పెద్దలు ఈ ధోరణిని పూర్తిగా భిన్నమైన కోణంలో చూస్తున్నారు. వారి అభిప్రాయం ప్రకారం, సిగ్గు అంటే భయం లేదా పిరికితనం కానే కాదు, అది వినయం, విధేయత, గౌరవభావాకి ప్రతీక. సమాజంలో సిగ్గు బిడియాలు లేకపోవడం అంటే హద్దులు మీరి ప్రవర్తించడం, పెద్దల పట్ల మర్యాద లేకపోవడం, సామాజిక విలువలను తుంగలో తొక్కడమే అని వీరు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేటి ఆధునిక యువతరంలో పెరుగుతున్న అహంకార పూరిత వైఖరి, పెద్దలతో అనుచితంగా మాట్లాడే ప్రవర్తన, మానవ సంబంధాలలో నిబద్ధత లోపించడం వంటి అనేక సమస్యలకు ప్రాథమిక మూలకారణం మనుషులలో సిగ్గు, వినయం, బిడియం వంటి గుణాలు క్రమంగా మరుగునపడిపోవడమేనని వీరు అభిప్రాయపడుతున్నారు.

వాస్తవానికి ఈ రోజు సాగుతున్న సమగ్ర చర్చలో అసలైన చిక్కుముడి సిగ్గు అనే మానసిక గుణంలో లేదు, దానిని నేటి సమాజం అర్థం చేసుకుంటున్న విధానంలోనే ఉంది. సిగ్గు అంటే ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం లేకపోవడం కాదు; అది వ్యక్తిలోని సంస్కారానికి, సంయమనానికి సంకేతం. అదే సమయంలో నిజమైన ఆత్మవిశ్వాసం అంటే అహంకారం, గర్వం కానే కాదు, అది తన శక్తియుక్తులపై తనకు ఉన్న నమ్మకం. ఈ రెండు మానవీయ గుణాలు ఒకదానికొకటి పరస్పర వ్యతిరేకమైనవి కావు. ఇవి రెండూ ఒకే వ్యక్తిలో సమతుల్యంగా కలసి మెలసి మనగలిగే అద్భుతమైన లక్షణాలు. ఒక సమర్థుడైన వ్యక్తి అత్యంత ఆత్మవిశ్వాసంతో వేదికపై మాట్లాడుతూనే, తన ఎదుటివారి పట్ల గౌరవప్రదంగా, వినయంగా నడుచుకోగలడు. అవసరమైన సందర్భాలలో ధైర్యంగా తన స్పష్టమైన అభిప్రాయాన్ని వెల్లడిస్తూనే, పెద్దల సమక్షంలో సముచిత మర్యాదలు పాటించగలడు. కానీ నేటి వేగవంతమైన సమాజం ఈ రెండు విభిన్న గుణాలను ఒకదానికొకటి ప్రత్యామ్నాయ శత్రువులుగా చిత్రీకరిస్తోంది. సిగ్గును పూర్తిగా వదిలివేయాలి అని నూరిపోసే క్రమంలో, మనుషులు తమలోని వినయం, గౌరవం, సామాజిక మర్యాద వంటి ఉత్కృష్ట గుణాలను కూడా నేలపాలు చేసుకుంటున్న దుస్థితి నేడు దాపురించింది.మనకు ప్రస్తుత సమాజంలో అత్యంత ఆవశ్యకమైనది ఏంటంటే సమతుల్యత. మన ప్రగతికి ప్రతిబంధకంగా మారే అనవసరమైన భయాందోళనలు, తనను తాను తక్కువ అంచనా వేసుకునే న్యూనతా భావం, అన్యాయాన్ని చూస్తూ కూడా ప్రశ్నించలేకపోవడం వంటి ప్రతికూల సిగ్గును మనం తక్షణమే తుడిచిపెట్టాలి. కానీ అదే సమయంలో గౌరవప్రపత్తులు, నమ్రత, వినయం, సంస్కారంతో కూడిన సానుకూల సిగ్గును మనం ప్రతి గుండెలో పదిలంగా కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. నేటి నవతరానికి భయం లేకుండా, నిర్భయంగా, స్పష్టంగా మాట్లాడటం నేర్పిస్తూనే, అదే సమయంలో వయోవృద్ధులను, ఉపాధ్యాయులను గౌరవించే విలువలను నూరిపోయాలి. తమ హక్కుల కోసం దృఢంగా నిలబడటం నేర్పిస్తూనే, ఎదుటి మనుషుల భావోద్వేగాలను, మనోభావాలను గౌరవించాలనే విలువైన సూత్రాన్ని నేర్పించాలి.తుది మాటగా చెప్పాలంటే, సిగ్గు అనేది కాలం చెల్లిన ఒక బలహీనత కానే కాదు. అలాగని కాలానుగుణ మార్పులను నిరోధిస్తూ దాన్ని గుడ్డిగా అంటిపెట్టుకుని ఉండాల్సిన మూఢ నియమం కూడా కాదు. అది సందర్భాన్ని బట్టి, ఎదురయ్యే పరిస్థితులను బట్టి సముచితంగా ఆచరించాల్సిన ఒక అత్యంత సున్నితమైన, సంస్కారవంతమైన గుణం. నవీన కాలంలో మార్పు అనేది అపరిహార్యం. అయితే, అభివృద్ధి మరియు మార్పు అనే ఆకర్షణీయమైన పేరుతో మన సాంస్కృతిక మూలాలను, జీవన విలువలను పూర్తిగా తిలోదకాలు ఇవ్వడం ఎంతమాత్రం శ్రేయస్కరం కాదు. నవతరం యొక్క ఆత్మవిశ్వాసాన్ని, పాతతరం యొక్క వినయ విధేయతలను రసవత్తరంగా మేళవించి ముందుకు తీసుకెళ్లినప్పుడే నవ సమాజ నిజమైన పురోగతి, సర్వాంగీణ వికాసం సాధ్యమవుతాయి. చివరికి సిగ్గు అనేది ఒక విలువై విరాజిల్లాలో, లేక మానసిక బలహీనతగా కుంచించుకుపోవాలో అనేది సమాజంలో దానిని మనం ఎలా అర్థం చేసుకుంటున్నాం, మన నిత్య జీవితంలో ఎలా ఆచరిస్తున్నాం అనే దానిపైనే సంపూర్ణంగా ఆధారపడి ఉంటుంది.




- డా .సూర్యదేవర రామకృష్ణ,
ఫోన్ : 9490754169

# జాడ లేని రెండో సతీవ్రతుడు

మొత్తం మానవ జాతిలో ఒక్క సతీవ్రతు(ఒకే స్త్రీతో జీవిత కాలం నిజాయితీగా కలిసి జీవించే వ్యక్తి)డి పేరు ఎవరైనా చెప్పగలరా? మనం ఇక్కడ ఈ దేశంలో ఉన్నాం కాబట్టి ఇక్కడి సంగతే మాట్లాడుకుందాం. పురాణ పురుషుడు, మర్యాదా పురుషోత్తముడు, ఏకపత్నీ వ్రతుడిగా పేరొందిన శ్రీరాముడి తరువాత మరో వ్యక్తి ఎవరైనా చరిత్రలో, పురాణాల్లో ఒక్కరైనా ఉన్నారా? చరిత్రను సంపూర్ణంగా గాలించినా, పురాణాలు మొత్తం తిరిగేసినా, ఒక్కరు ఒక్కరంటే ఒక్కరు కూడా లేరు. అదే మరి.శ్రీ రాముడి తరువాత సతీవ్రతుడు అనే వాడు లేనే లేడు అనేది ఒక నిష్ఠుర సత్యం. అదేమిటి? సీత,సావిత్రి,అనసూయ,సక్కుబాయి, రుక్మిణి,మండోదరి,ద్రౌపది లాంటి పతివ్రతల జాబితా చాలా పెద్దది కదా. శ్రీ రాముడి తరువాత ఎవరూ లేరేమిటి? అదే మరి. అందుకే సతీవ్రతుడు అనే పదం వింతగా,విచిత్రంగా అనిపిస్తున్నది కదా. పతివ్రతలు ఉన్నపుడు, సతీవ్రతులు కూడా ఉండాలి కదా. పాతివ్రత్యం ఉన్నపుడు, సతీవ్రత్యం కూడా ఉండాలి కదా. మరి లేదేమిటి? భర్త చనిపోయిన స్త్రీని విధవ అని అంటారు కదా.మరి భార్య చనిపోయిన పురుషుడిని ఏమని పిలవాలి? పిలుస్తారు? అతడిని సమాజం ఎలా చూస్తుంది? పెళ్లికాని యువతి శృంగారంలో పాల్గొంటే కాలు జారింది అంటారు. కట్టు తప్పింది అంటారు. బరి తెగించింది అని నిందలు వేస్తారు. ఇంకా అనేక రకాలుగా ఆ యువతి, స్త్రీని అంటరాని వ్యక్తి గా చూస్తుంది సమాజం. అదే పెళ్లి కాని యువకుడు అదే పని చేస్తే అతగాడిని ఏమని పిలుస్తారు? మగ మహారాజు అని ఒక బిరుదును ఇస్తారు. ఒకరి కంటే ఎక్కువ మందితో లైంగిక సంబంధం కలిగిన స్త్రీని ఏమని పిలుస్తారో అందరికీ తెలుసు కదా. అదే పనిని పురుషుడు చేస్తే రసికుడు అంటారు. ప్లేబాయ్ అంటారు. శృంగార వీరుడు అంటారు. పెళ్ళైన స్త్రీ మరో పురుషుడిని లైంగిక దృష్టితో చూస్తే ఆవిడను సమాజం ఎలా చూస్తున్నది? అదే పనిని ఒక పెళ్లి అయిన ఒక పురుషుడు చేస్తే ఏమంటారు? రసికుడు,శృంగార పురుషుడు లాంటి బిరుదులతో గొప్ప వాడిగా చూస్తున్నది భారత సమాజం. అదే పనిని ఒక వివాహిత చేస్తే కామ పిశాచి అని పిలుస్తుంది. ఏమిటీ వ్యత్యాసం? లైంగిక చర్య అనేది అత్యంత సహజమైన జీవ అవసరం(బయోలా జికల్ నీడ్) మాత్రమే కదా. అది స్త్రీపురుషులు ఇద్దరికీ సహజంగా ఉండే అవసరమే కదా. ఇద్దరూ సమానులే అయిన పక్షంలో ఇద్దరికీ వేర్వేరు నీతి ఏమిటి?ఆ తీరు వివక్ష మాత్రమే అవుతుంది కదా. అంటే సామాజికంగా స్త్రీ పురుషులు ఇద్దరూ సమాన స్థాయి వాళ్లు కారు అని అర్థం కదా. స్వతంత్ర భారత రాజ్యాంగం స్త్రీ పురుషులు ఇద్దరూ సమానులే అని చెబుతున్నది. కానీ ఈ సమాజం ఆ సమానత్వ సూత్రాన్ని అంగీకరించడం లేదు. అంగీకరించే పరిణతి, ఉదారత మగ ప్రపంచానికి లేవు. స్త్రీ, యువతి సమ్మతి లేకుండా జరిపే లైంగిక చర్యను అత్యాచారం అని చట్టం చెబుతున్నది. ఆ చర్య ను ఒక నేరంగా పరిగణిస్తున్నది చట్టం. అయితే విచిత్రంగా భార్యాభర్తల ఈ సూత్రం చెల్లుబాటు కాదు. భార్య సమ్మతి లేకుండా ఆవిడపై భర్త పాల్పడే లైంగిక చర్యను చట్టం నేరంగా చూడడం లేదు. భర్త కాబట్టి ఆవిడ సమ్మతి లేకున్నా లైంగిక చర్యకు పాల్పడవచ్చును అని చట్టం నిర్ధారిస్తున్నది. భార్య అంటే ఒక భర్త కు సంబంధించిన ఒక ఆస్తి లాంటిది అనే చట్టం చెబుతున్నది అని అర్థం కదా. అంటే ఇక్కడి వివాహ వ్యవస్థ లో పెళ్లి ద్వారా భర్త గారికి అతడి భార్య శరీరంపై అధికారం హక్కులు సంక్రమి కలుస్తున్నాయని స్థూలంగా చట్టం చెబుతున్నది అని అర్థం కాదు. అంటే హిందూ వివాహ వ్యవస్థలో స్త్రీ పురుషులు ఇద్దరూ సమాన ప్రతిపత్తి కలిగిన వారు కాదని అర్థం కదా. పెళ్లి ద్వారా పురుషుడి అధికారాన్ని స్త్రీ అనివార్యంగా అంగీకరించాలని చెబుతున్నది. అంటే ఇక్కడి వివాహం ఒక అసమ బంధం అని అర్థం చేసుకోవాలి కదా. ఇక్కడే కాదు ప్రపంచంలోని అన్ని సమాజాల్లో కూడా పురుషుడి ఆధిపత్యమే అనాదిగా కొనసాగుతున్నది. అమెరికా ఐరోపాలోని పలు సమాజాల్లో కూడా వివాహంలో పురుషుడిదే ఆధిపత్యం.కాకపోతే భారతీయ స్త్రీతో పోల్చితే ఆ సమాజాల్లో మహిళల స్థితి కొంత మెరుగే అని చెప్పాలి. చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ల గురించి ప్రస్తావించ వలసి ఉన్నది. వారికి 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని పార్లమెంటు ఒక చట్టం నిర్మించింది. అది ఇప్పట్లో అమలయ్యేది కాదనేది ప్రస్తుత సందర్భానికి అవసరం లేదు. అయితే రిజర్వేషన్ల బిల్లు ఇప్పుడే ఇప్పుడే తీసుకు వచ్చింది ఏమీ కాదు. దశాబ్దాల నుంచి ఈ ప్రతిపాదన ఉంది. అనేక మార్లు ఈ బిల్లు పార్లమెంటులో వీగి పోయిన సంగతి మనకు తెలుసు. అప్పటి నుంచీ దానికి చట్ట రూపం ఎందుకు రాలేదు. ఇంతకు ముందు అధికారంలో ఉన్నవాళ్లకు మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకులా? అంటే... ప్రభుత్వ ప్రతిపక్ష రాజకీయ పార్టీలు అన్నీ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేక వైఖరిని కలిగినవే. ఆ కారణాలతో మాత్రమే ఆ బిల్లు ఇన్నాళ్లూ చట్ట రూపం దాల్చ లేదు. ఇప్పుడు మహిళా రిజర్వేషన్ చట్టంగా మారిపోయింది కాబట్టి ఇప్పుడు అధికారంలో ఉన్నవాళ్లు స్త్రీ సమానత్వాన్ని కోరుకుంటున్నారు, కోరుకునే వారు అని భావిస్తే అది ఉత్త అమాయకత్వం మాత్రమే అవుతుంది. ఇప్పుడు అధికారంలో ఉన్న వారికి స్త్రీ ఒక బోగ వస్తువు సంతానోత్పత్తి సాధనం మాత్రమే అనేది ఒక సత్యం. వాళ్లు వెలుపలికి అంగీకరించకపోవచ్చును గాని అది వాళ్ల ఆచరణను అర్థం చేసుకుంటే ఆ సత్యం చాలా తేలిగ్గా బోధపడి పోతుంది. ఇంకో ముఖ్యమైన సంగతిని ఇక్కడ తప్పకుండా ప్రస్తావించాలి. సమాజంలో స్త్రీ జనాభా సుమారుగా 50 శాతం ఉంటుంది కదా. మరి చేసిన చట్టం ప్రకారం చట్ట సభల్లో స్త్రీలకు 33 శాతం స్థానాలను కేటాయిస్తున్నారేమిటి? 50 శాతంగా ఉన్న స్త్రీలకు 33 శాతం స్థానాలను కేటాయించి తమ భుజాలను చరచుకోవడం ఏమిటి? డీలిమిటేషన్ (నియోజక వర్గాల పునర్విభజన) బిల్లుతో కలిపి మహిళా రిజర్వేషన్ల బిల్లు ప్రతిపాదనలోని ఆంతర్యం ఏమిటి? ఇది మహిళా రిజర్వేషన్ల కోసం వారి రాజకీయ ప్రాతినిధ్యం పెంపొందించే ప్రయత్నం ఏమీ కాదు.స్త్రీ భుజంపై తుపాకీ మోపి తమ ఆధిపత్యం కోసం చేస్తున్న ఒక రాజకీయ బూటకపు విన్యాసం మాత్రమే.దీనిని లోతుగా తరచి చూస్తే తెలిసే సత్యం ఇది.ఇటు అధికార పక్షం గానీ విపక్ష పార్టీలు గానీ చట్ట సభల్లో స్త్రీల ప్రాతినిధ్యం పెరిగాలని,పురుషులతో సమాన స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నాయని భావిస్తే అంతకంటే అమాయకత్వం మరొకటి లేదు.ఈ నాటకంలో అధికార విపక్షాలకు ఎవరి ప్రయోజనాలు వాటికి ఉన్నాయి. వెలుపలికి మాత్రమే మహిళా రిజర్వేషన్ వారి రాజకీయ ప్రాతినిధ్యం పెంపు అనేవి ఉత్తుత్తి ముసుగులు మాత్రమే. ఇదే ఇదే...ఇక్కడి ఆచరణలో ఉన్న వాస్తవిక స్త్రీపురుష సమానత్వం.





- గంటె గోవర్ధన్,
ఫోన్ : 9347056621

# ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదు

## యువత గొంతు వినాల్సిందే,

## తెలంగాణ విద్యావంతుల వేదిక

భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పార్లమెంటరీ ప్రజాస్వామ్య దేశంగా గర్వంగా చెప్పుకుంటున్నాం.అయితే ప్రజాస్వామ్యం అనేది కేవలం ఎన్నికలు నిర్వహించుకోవడం ద్వారా ప్రభుత్వాలు ఏర్పడడం మాత్రమే కాదు.ప్రజల అభిప్రాయాన్ని గౌరవించడం, విభిన్న స్వరాలను వినడం,నిరసన తెలిపే హక్కును రాజ్యాంగబద్ధంగా పరిరక్షించడం ,ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించే అవకాశాన్ని గౌరవించడం కూడా ప్రజాస్వామ్యంలో అంతర్భాగం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 పౌరులకు భావ ప్రకటన స్వేచ్ఛ, శాంతియుత సమావేశాలను ఏర్పాటు చేసుకునే హక్కు, సంఘాలు ఏర్పరచుకునే హక్కును కల్పించింది. ఈ హక్కులను అణచివేసే ఏ ప్రభుత్వ చర్యైనా ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమే.

గతంలో లడక్‌కు చెందిన సామాజిక ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌పై దేశద్రోహం ఆరోపణలు చేయడం, ఆయనను నిర్బంధించడం, ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రయత్నించడం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది.అనంతరం ఆయన చేపట్టిన నిరాహార దీక్ష, ప్రజా మద్దతు, సామాజిక ఒత్తిడి నేపథ్యంలో ప్రభుత్వం చర్చలకు ముందుకు రావడం ప్రజాస్వామ్యంలో ప్రజా ఉద్యమాల ప్రాముఖ్యతను మరోసారి చాటిచెప్పింది. ప్రజల సమిష్టి సంకల్పం ముందు ఏ అధికార వ్యవస్థ అయినా చివరకు చర్చల మార్గానికే రావాల్సి వస్తుందని ఈ పరిణామం సూచించింది. గత రెండు మూడు రోజులుగా దేశ రాజధాని ఢిల్లీలో పేపర్ లీకేజీలపై విద్యార్థులు, యువత చేపట్టిన నిరసనలు కూడా అదే వాస్తవాన్ని గుర్తు చేస్తున్నాయి.ఇలాంటి సందర్భాల్లో యువత రోడ్లపైకి రావడం ప్రజాస్వామ్యంలో అసాధారణం ఏమి కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(a) భావ ప్రకటన స్వేచ్ఛను, ఆర్టికల్ 19(1)(b) శాంతియుత సమావేశాల హక్కును, ఆర్టికల్ 19(1)(c) సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కును పౌరులకు కల్పించాయి.ఈ హక్కులను వినియోగిస్తున్న పౌరుల పట్ల ప్రభుత్వ స్పందన రాజ్యాంగబద్ధంగా, నిష్పాక్షికంగా, అవసరమైన పరిమితుల్లో ఉండాలి.

పోటీ పరీక్షల కోసం సంవత్సరాల తరబడి శ్రమించిన లక్షలాది మంది యువత భవిష్యత్ ను ఛిద్రం చేసే విధంగా పేపర్ లీకేజీలు చేయడం కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదు.అది వారి జీవితకాల ఆశయాలపై చూపిన తీవ్రమైన ప్రభావం. ఒక పరీక్ష రద్దు కావడం అంటే లక్షల కుటుంబాల ఆర్థిక,మానసిక స్థితిపై తీవ్రమైన ప్రభావం పడటం. నిరుద్యోగం,వయోపరిమితి,ఆర్థిక ఇబ్బందులు, కుటుంబాల ఆశలు అన్ని కలిసినప్పుడు విద్యార్థి ఆవేదన సహజంగానే ఉద్యమంగా మారుతుంది. విద్యార్థుల ఆవేదనను వినాల్సిన సమయంలో, ప్రభుత్వం విమర్శలను శత్రుత్వంగా చూడకూడదు. విద్యార్థులు అడుగుతున్న ప్రశ్నలు రాజకీయ కుట్రల ఫలితమని కొట్టిపారేయడం కంటే, పేపర్ లీకేజీలు ఎందుకు పునరావృతమవుతున్నాయి.? భద్రతా వ్యవస్థ ఎక్కడ విఫలమైంది..? బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు.? భవిష్యత్తులో ఎలా నివారిస్తారు..? అనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి.కానీ ఈ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం వారిని అనుమానితులుగా చూడటం,శాంతియుత నిరసనలను అణచివేయడానికి అధిక బలప్రయోగం చేయడం, భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఏమాత్రం మంచిది కాదు.నిరసనలను అణచివేయడం ద్వారా సమస్య పరిష్కారం కాకపోగా సమస్యను మరింత తీవ్ర తరమవుతుంది ఇది చరిత్ర చెబుతున్న సత్యం. ప్రజల గొంతును కొంతకాలం మూయించవచ్చు గానీ, ప్రజల ఆవేదనను శాశ్వతంగా అణచివేయలేరు.



యువత, విద్యార్థి లోకం రోడ్లపైకి రావడం అనేది ఏ ప్రభుత్వానికైనా ఒక గంభీరమైన హెచ్చరిక.అది ప్రభుత్వంపై వ్యతిరేకత మాత్రమే కాదు.వ్యవస్థ సరిదిద్దుకోవాలని ప్రజలు ఇస్తున్న సంకేతం.పాలకులు దీనిని రాజకీయ కోణంలో కాకుండా పరిపాలనా బాధ్యతగా చూడాలి. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన పరిపాలనా వ్యవస్థపై సందేహాలు పెరుగుతాయి. ఆ సందేహాలను పారదర్శకత, బాధ్యతాయుత వైఖరి, చర్చలు సంప్రదింపుల ద్వారానే ద్వారానే తొలగించవచ్చు.

పేపర్ లీకేజీలు దేశ భవిష్యత్తును దెబ్బతీసే అత్యంత ప్రమాదకరమైన నేరాలలో ఒకటి.ఇవి ప్రతిభను నిర్వీర్యం చేస్తాయి.కష్టపడి చదివే విద్యార్థులలో నిరాశను పెంచుతాయి. ప్రభుత్వ నియామక వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తాయి.అవినీతి, అక్రమాలపై అనుమానాలను బలపరుస్తాయి..ఒకసారి ప్రజల విశ్వాసం దెబ్బతింటే దానిని తిరిగి పొందడం చాలా కష్టం.అందువల్ల కేంద్ర ప్రభుత్వం తక్షణమే అన్ని రాజకీయ పార్టీలను, విద్యావేత్తలను, విద్యార్థి సంఘాలను, నిపుణులను, పోటీ పరీక్షల నిర్వహణ సంస్థలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి జాతీయ స్థాయి చర్చలు నిర్వహించాలి. ప్రశ్నాపత్రాల భద్రత, డిజిటల్ సెక్యూరిటీ, పారదర్శక నియామక వ్యవస్థ, స్వతంత్ర పర్యవేక్షణ సంస్థలు, కఠినమైన శిక్షా విధానం, వేగవంతమైన దర్యాప్తు, ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటు వంటి అంశాలపై సమగ్ర విధానాన్ని రూపొందించాలి. ఇది కేవలం రాజకీయ సమస్య కాదు. దేశ భవిష్యత్తుకు సంబంధించిన జాతీయ అంశం.


ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం శత్రువు కాదు. అది ప్రజల మరో స్వరం.నిరసనకారులు దేశద్రోహులు కాదు.వారు తమ రాజ్యాంగబద్ధ హక్కులను వినియోగిస్తున్న పౌరులు. ఉద్యమాలను అణచివేయడానికి భయపెట్టే చర్యలు, అవసరానికి మించిన బలప్రయోగం,పౌర స్వేచ్ఛలపై ఆంక్షలు,విభిన్న అభిప్రాయాలను దేశ వ్యతిరేకంగా చిత్రీకరించడం వంటి ధోరణులు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ప్రభుత్వం తన యొక్క బలాన్ని చూపించాల్సింది ఉద్యమాలను అణచడంలో కాదు,విమర్శలను వినడంలో, లోపాలను సరిదిద్దడంలో చూపించాలి.

ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి పేపర్ లీకేజీని తీవ్రమైన నేరంగా అభివర్ణించడం మంచిదే.అయితే ప్రకటనలకే పరిమితం కాకుండా, వ్యవస్థాగత సంస్కరణలు తీసుకురావడం, బాధ్యులపై నిర్దాక్షిణ్య చర్యలు తీసుకోవడం, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం మరింత అవసరం. బాధ్యతాయుత పరిపాలనకు అదే నిజమైన ప్రమాణం.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం, ప్రతిపక్షం, పౌర సమాజం, విద్యార్థులు, మీడియా అందరూ రాజ్యాంగ పరిధిలో భాగస్వాములే.సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించడం ప్రజాస్వామ్యం యొక్క బలం.బలప్రయోగంతో అణచివేయడం ప్రజాస్వామ్య బలహీనత. దేశ యువత భవిష్యత్తు రాజకీయ లాభనష్టాల కంటే గొప్పది.

పేపర్ లీకేజీలపై జీరో టాలరెన్స్ విధానం, పారదర్శక పరీక్షా వ్యవస్థ, నిష్పాక్షిక దర్యాప్తు, బాధ్యులపై కఠిన చర్యలు, తీసుకోవడం ద్వారా మాత్రమే విద్యార్థుల విశ్వాసాన్ని చూరగొనడానికి సాధ్యమవుతుంది.భారతదేశం ప్రపంచానికి ప్రజాస్వామ్యానికి ఆదర్శంగా నిలవాలంటే ప్రజల గొంతును వినాలి ,యువత ఆకాంక్షలను గౌరవించాలి, రాజ్యాంగ విలువలను కాపాడాలి. ప్రజల ఆవేదనను శత్రుత్వంగా కాకుండా హెచ్చరికగా స్వీకరించి చర్చలు, సంస్కరణలు, బాధ్యత అనే విషయాలపై ముందుకు సాగితేనే దేశ ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది.యువతకు న్యాయం చేయడం అంటే దేశ భవిష్యత్తును కాపాడడమే.అదే నిజమైన దేశభక్తి, అదే ప్రజాస్వామ్య పరిరక్షణ.

పాలకులు గుర్తుంచుకోవలసిన చారిత్రక సత్యం ఒక్కటే. అధికార బలం శాశ్వతం కాదు.ప్రజల విశ్వాసమే శాశ్వతం. లాటీల ద్వారా, టియర్ గ్యాస్ ల ద్వారా విద్యార్థులను కొన్ని రోజులు చెదరగొట్టవచ్చు, కానీ అన్యాయంపై నిలిచిన ప్రశ్నలను చెదరగొట్టలేదు.చరిత్రలో ప్రతి గొప్ప ప్రజాస్వామ్య మార్పు యువత నుంచే ప్రారంభమైంది. యువతను ప్రత్యర్థులుగా చూడడం కాదు, భాగస్వాములుగా చూడడమే ప్రజాస్వామ్య ప్రభుత్వ బాధ్యత.దేశ యువత భవిష్యత్తు,ప్రజాస్వామ్య విలువలు [illegible] కంటే గొప్పది. పేపర్ లీకేజీ వంటి వ్యవస్థాగత వైఫల్యాలపై కఠిన చర్యలు, పారదర్శక పరీక్ష విధానం, బాధ్యులపై నిష్పాక్షిక చర్య, నిరసన తెలిపే రాజ్యాంగ హక్కుకు గౌరవం.ఇవే ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం సృష్టించాల్సింది భయాన్ని కాదు, నమ్మకాన్ని నిర్మించాలి. బలప్రయోగంతో కాకుండా రాజ్యాంగానికి అనుగుణంగా వ్యవహరించాలి. అదే భారత రాజ్యాంగానికి, అదే భారత యువతకు ఇవ్వాల్సిన నిజమైన గౌరవం.



- పందుల సైదులు,
న్యాయవాది
తెలంగాణ విద్యావంతుల వేదిక
ఫోన్ : 9441661192



## కెప్టెన్ లక్ష్మీ ఆశయాలతో యువత ముందుకు సాగాలి

**విశ్వంభర, బాగ్ లింగంపల్లి:** కెప్టెన్ లక్ష్మీ సెహగల్ ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ప్రజాస్వామ్య, లౌకిక, సమానత్వ విలువల పరిరక్షణలో యువత భాగస్వాములు కావాలి అని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ పిలుపునిచ్చారు. ఐద్వా ఆధ్వర్యంలో హైదరాబాదు బాగ్ లింగంపల్లి లో కెప్టెన్ లక్ష్మీ సెహగల్ 14వ వర్ధంతి కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణజ్యోతి అధ్యక్షత వహించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.ఎన్. ఆశలత చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మీ మాట్లాడుతూ, సుభాష్ చంద్రబోస్ పిలుపుతో 1943లో ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరిన కెప్టెన్ లక్ష్మీ సెహగల్ ఝాన్సీ రాణి రెజిమెంట్‌కు నాయకత్వం వహించి స్వాతంత్ర్య పోరాటంలో విశేష సేవలందించారని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం మహిళా హక్కులు, సమానత్వం, కార్మికుల, రైతుల, అణగారిన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేశారని కొనియాడారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేమ, ఇందిర,కవిత, రెష్మ , వెంకటమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

## యాదాద్రి శిల్పకళాశాలను బలోపేతం చేయాలి



**విశ్వంభర, హైదరాబాదు :** యాదాద్రి శిల్పకళాశాలను పూర్తి స్థాయి మౌలిక వసతులు, అధ్యాపకులు, సిబ్బందితో అభివృద్ధి చేయాలని, దీంతో సంప్రదాయ శిల్పకళ పరిరక్షణతో పాటు శిల్పులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి అని తెలంగాణ స్థపతులు, శిల్పులు కోరారు. గురువారం దేవాదాయ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన వారు, దేవాదాయ శాఖలో ఖాళీగా ఉన్న స్థపతి పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేసి స్థపతి విభాగాన్ని బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని చారిత్రక దేవాలయాల సంరక్షణకు నైపుణ్యం కలిగిన స్థపతులు, శిల్పుల సేవలను వినియోగించాలని కోరారు. అలాగే రామప్ప దేవాలయం తరహాలో ఇతర చారిత్రక దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వినతిపై దేవాదాయ శాఖ కమిషనర్ సానుకూలంగా స్పందించి సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ప్లాస్టిక్ వద్దు.. స్టీల్ పాత్రలే ముద్దు

### ఇనుగుర్తి టీచర్స్ స్టీల్ పాత్రల వాడకానికి శ్రీకారం



**విశ్వంభర, ఇనుగుర్తి:** ప్లాస్టిక్ ప్లేట్లలో భోజనం చేయడం, డిస్పోజబుల్ గ్లాసుల్లో నీళ్లు తాగడం వద్దనుకున్నారు. మీటింగుల అనంతరం,శిక్షణలలో,ఫంక్షన్ లలో, ప్లాస్టిక్ వాడకం నిషేధించే విధంగా మెసేజ్ పంపడానికి శ్రీకారం చుట్టారు ఇనుగుర్తి మండల టీచర్స్. గురువారం మండల కేంద్రం ఇనుగుర్తి జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఉపాధ్యాయులకు మండల స్థాయిలో మూడు రోజుల పాటు జరిగిన ఇంటిగ్రేటెడ్ ఇన్ సర్వీస్ ట్రైనింగ్ లో మధ్యాహ్నం భోజన సమయంలో మానవాళికి హానిక కలిగించే ప్లాస్టిక్ ప్లేట్లు గ్లాసులు వాడవద్దనుకున్నారు.ఈ మేరకు స్టీల్ ప్లేట్లలో భోజనం చేసి స్టీల్ గ్లాసులతో మంచినీళ్లు తాగారు. ఇకనుంచి ఎప్పుడూ ప్లాస్టిక్ ప్లేట్లు క్లాసులు వాడమని భీష్మించారు.ఈసందర్భంగా టీచర్స్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వలన మానవ ఆరోగ్యానికి హానికరం తో పాటు పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. వేడి పదార్థాలు ప్లాస్టిక్ ప్లేట్లలో, చాయ్ కాఫీ వంటి వి కప్పులతో వాడినప్పుడు థాలెట్స్ వంటి ప్రమాదకర రసాయనాలు కరిగి మనలోనికి వెళ్తాయని దీంతో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో 100 సంవత్సరాలైనా కలిసిపోవని, పైగా నీరును భూమిలోకి ఇంక కుండా చేస్తాయన్నారు. అందుకే ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు.

## సెప్టెంబర్ 1న 'ఛలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ

**విశ్వంభర, హిమాయత్ నగర్ :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 6 నుంచి 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రలు, సెప్టెంబర్ 1న 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీపీఐ నాయకులు తెలిపారు.ఈ మేరకు గురువారం హైదరాబాదు హిమాయత్ నగర్ లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో 'చలో ఢిల్లీ' పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రలు చేపట్టి, అనంతరం సెప్టెంబర్ 1న ఢిల్లీలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగం హేమంతరావు, కలవేన శంకర్, పశ్య పద్మ, కె. రామకృష్ణ, కూనంనేని సాంబశివరావు, బాలకిషన్, తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, వి.ఎస్. బోస్, ఈటి నరసింహ పాల్గొన్నారు.



# నీట్ లీకేజీపై కేంద్రం బాధ్యత వహించాలి




**విశ్వంభర, ముషీరాబాదు :** నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని, విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణలు చేపట్టాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ ఉమెన్స్ అండ్ ట్రాన్స్‌జెండర్స్ ఆర్గనైజేషన్ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాదు ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో ఢిల్లీలో జరిగిన ఘటనకు నిరసనగా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, మహిళా సంఘాలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం పెరుగుతున్నప్పటికీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. నీట్ పరీక్షల్లో చోటుచేసుకున్న లోపాలు, ప్రశ్నపత్రాల లీకేజీలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపాయని ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచాలని, పరీక్షా వ్యవస్థను రాజకీయాలకు అతీతంగా నిర్వహించే విధానాన్ని అమలు చేయాలని వారు కోరారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేయకుండా వారి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు. నీట్ లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ వ్యవహారంపై నైతిక బాధ్యత వహించాలని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సినీ గాయని చిన్మయి, రమా మేల్కొట్టి, సజయ, డి. స్వరూప, అంజు రావు, వసుధ నాగరాజ్, దీప్తి సిర్ల, రచయిత్రి భండారు విజయ, సామాజిక వేత్త విష్ణు తేజ, సాయిరాజు, పి.ఓ.డబ్ల్యూ. సంధ్య, ఝాన్సీ, పి.ఓ.డబ్ల్యూ. స్వరూప, భూమిక ఆర్గనైజేషన్ జ్యోతి రావు పాల్గొని సంఘీభావం తెలిపారు.

## ప్రధాని నివాసం ముట్టడి ఘటనను ఖండిస్తూ కమాన్‌పూర్‌లో బీజేపీ నిరసన

### బస్టాండ్‌లో ఆందోళన.. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి



**విశ్వంభర, కమాన్‌పూర్ :** ప్రధాని నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించే ప్రయత్నాన్ని నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కమాన్‌పూర్ మండలశాఖ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కొయ్యడ సతీష్ మాట్లాడుతూ, దేశ ప్రజల మద్దతుతో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. అలాంటి సమయంలో ప్రధాని నివాసాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు ప్రయత్నించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. దేశ రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు సహజమే అయినప్పటికీ, నిరసన కార్యక్రమాలు రాజ్యాంగబద్ధమైన పరిమితుల్లోనే జరగాలని పేర్కొన్నారు. ప్రధాని నివాసాన్ని లక్ష్యంగా చేసుకుని ఆందోళనలు చేపట్టడం తగదని అభిప్రాయపడ్డారు. ఇటువంటి చర్యలను ప్రజలు సమర్థించరని, భవిష్యత్తులో కూడా బీజేపీ ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే స్పందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము, సీనియర్ నాయకులు మట్ట శంకర్, జంగపల్లి అజయ్, మల్లారపు అరుణ్, మండల ప్రధాన కార్యదర్శి పంతకాని విశ్వతేజ్, పెద్దపల్లి శ్యాంసుందర్, మండల ఉపాధ్యక్షుడు పిల్లి చంద్రయ్య, సదానందం, కార్యదర్శి అగ్గి శ్రావణ్, సంపత్, శ్రీమన్, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జ్, కాంగ్రెస్ నేతల అరెస్టు అప్రజాస్వామికం



**విశ్వంభర, చింతపల్లి :** ఢిల్లీలో విద్యార్థులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా చేపట్టిన నిరసనపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం అప్రజాస్వామిక చర్య అని, వారికి మద్దతుగా వెళ్లిన కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జటావత్ హరి నాయక్ విమర్శించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం చింతపల్లి మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా హరి నాయక్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ప్రశ్నించే హక్కు కల్పించిందని, ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను బలప్రయోగంతో అణచివేయడం సమంజసం కాదన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిరసనలను అణచివేసే ధోరణిని అవలంబించడం బాధాకరమని అన్నారు.నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యతతో వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా పారదర్శక పరీక్షా విధానాన్ని అమలు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, జిల్లా అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి, మాజీ ఎంపీపీ కొండూరు భవాని పవన్ కుమార్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం, కాసారపు శ్రీనివాస్, ఊజ్జిని నరేందర్ రావు, ముద్దం మల్లేష్ గౌడ్, జితేందర్ రెడ్డి, సిద్దిక్ బాబా, జటావత్ శ్రీను, సలీం పాషా, గుణమోని కొండల్, గోవింద్ రవి, ఎలిమినేటి నర్సింహా, ఈరటి మల్లేష్, జాఫర్, అబ్బాస్, గునుకుల నరేష్, కోటేష్, రాము, పల్లె వెంకటయ్య, మెండే వెంకటయ్య, గొల్లపల్లి సర్పంచ్ ఆనంతుల శ్రీను, పంబలి వెంకటయ్య, రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న సమీకృత శాఖాహార-మాంసాహార మార్కెట్ భవనాన్ని వెంటనే పూర్తి చేయాలి

### హుస్నాబాద్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకుడు అయిలేని మల్లికార్జున్ రెడ్డి



**విశ్వంభర, హుస్నాబాద్ :** హుస్నాబాద్ పట్టణంలోని పాత ఎమ్మార్వో కార్యాలయ ఆవరణలో నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన సమీకృత శాఖాహార--మాంసాహార మార్కెట్ భవనాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గ బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ రూ.2.70 కోట్ల వ్యయంతో 2022 ఫిబ్రవరిలో మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ శంకుస్థాపన చేసిన ఈ భవనం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా నిలిచిపోయిందని ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజలకు ఉపయోగపడే పనులను రాజకీయాలకు అతీతంగా పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా చేపల మార్కెట్ నిర్వహిస్తున్న వ్యాపారులకు మున్సిపల్ అధికారులు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని, పెండింగ్‌లో ఉన్న మార్కెట్ భవనాన్ని పూర్తి చేస్తే వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించి సమీకృత మార్కెట్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని, లేనిపక్షంలో ప్రజల తరఫున బీఆర్ఎస్ పార్టీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చిత్తారి శ్రీనివాస్, యాస శ్రీనివాస్, మేకల వికాస్ యాదవ్, అయిలేని గాల్ రెడ్డి, భూక్యా రాజు నాయక్, మార్క శ్రీనివాస్ గౌడ్, కనుక రాజు, సుకూర్, మాటూరి రాజశేఖర్ గౌడ్, చేపల వ్యాపారులు ముద్రవేణి సుగుణ, చొప్పరి వెంకటయ్య, హరిత, పెసరి నిరోషా తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



**విశ్వంభర, కాచిగూడ :** హైదరాబాదు కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధి సత్యనగర్‌లో గురువారం ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మహ్మద్ యాసీన్ (46) ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొంతకాలంగా మానసిక ఒత్తిడికి గురైన ఆయన ఇంట్లోని బెడ్‌రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బయటకు వెళ్లిన కుటుంబ సభ్యులు ఇంటికి తిరిగి వచ్చేసరికి గది తలుపు లోపల నుంచి గడియ వేసి ఉండటంతో స్థానికుల సహాయంతో తలుపు తెరిచి చూడగా యాసీన్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న వైద్య సిబ్బంది ఆయన అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు ఎలాంటి అనుమానం వ్యక్తం చేయలేదని పోలీసులు తెలిపారు. కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బంగారు మైసమ్మ దేవాలయంలో బ్రోచర్ ఆవిష్కరణ



**విశ్వంభర, గౌలిపుర:** ఆషాఢ మాస బోనాల మహోత్సవాన్ని పురస్కరించుకొని, బోనాల జాతర, అమ్మవారి కళ్యాణోత్సవ ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ప్రెసిడెంట్ అశోక్ మాట్లాడుతూ 31 న ఉదయం అభిషేకము కలశ స్థాపన,ధ్వజారోహణము అంకురార్పణ, 2న మధ్యాహ్నం 2 గంటలకు కాశీ విశ్వనాథ్ దేవాలయం శాలిబండ నుండి ఉమ్మడి దేవాలయాల ఘటాల ఊరేగింపు తో పాటు ఘటం ఎదుర్కోలు, సాయంత్రం ఘటస్థాపన అలాగే 4న మైసమ్మ అమ్మవారి కళ్యాణం, అన్న ప్రసాద వితరణ జరుగుతుందని వెల్లడించారు . 10న పోతురాజు స్వాగతం. అమ్మవారి బ్రహ్మాండమైన ఊరేగింపు దేవాలయం నుండి నయాపూల్ వరకు సాగుతుందని తెలిపారు.

## విద్యార్థులపై పోలీసు చర్యను ఖండిస్తూ నిరసన ర్యాలీ




**విశ్వంభర, అంబర్‌పేట :** ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యను నిరసిస్తూ గురువారం బాగ్ అంబర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు రావుల సుధాకర్ ఆధ్వర్యంలో హైదరాబాదు అంబర్‌పేట గాంధీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రావుల సుధాకర్ మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసు చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. విద్యార్థుల సమస్యలను అణచివేయకుండా చర్చల ద్వారా పరిష్కరించాలని, కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం శ్రీధర్ గౌడ్, కోటం అనిల్, సునీత రెడ్డి, సర్ఫరాజ్, మొయిజ్, మహేందర్, సైఫ్, సందీప్ గౌడ్, కిరణ్, నవాజ్, సలీం, అఫ్జల్, లావణ్య, భాస్కర్, శ్రీధర్, రాకేష్, శ్రీకాంత్, ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆగస్టు 5న కరీంనగర్‌లో తెలంగాణ రాష్ట్ర చేనేత చైతన్య సభ

### చేనేత కార్మికుల సంక్షేమమే లక్ష్యం

### రాష్ట్ర చేనేత ఐక్యవేదిక అధ్యక్షులు రాపోలు వీర మోహన్



**విశ్వంభర, హుస్నాబాద్:** తెలంగాణ రాష్ట్ర చేనేత చైతన్య సభ పోస్టర్‌ను హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి ఆలయ ప్రాంగణంలో రాష్ట్ర చేనేత ఐక్యవేదిక అధ్యక్షులు రాపోలు వీర మోహన్, కోశాధికారి రఘు, రాష్ట్ర, జిల్లా నాయకులు సంయుక్తంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా రాపోలు వీర మోహన్ మాట్లాడుతూ, కరీంనగర్ పద్మశాలి కళ్యాణ మండపంలో ఆగస్టు 5న తెలంగాణ రాష్ట్ర చేనేత చైతన్య సభను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో గెలుపొందిన మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, చేనేత సహకార సంఘాల అధ్యక్షులను సభలో ఘనంగా సన్మానించనున్నట్లు వెల్లడించారు. సభలో రాష్ట్రంలోని చేనేత కార్మికుల ప్రస్తుత పరిస్థితులు, సంక్షేమం, అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై ప్రముఖులు ప్రసంగిస్తారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పద్మశాలి సామాజిక వర్గం, చేనేత కార్మికులు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్యవేదిక రాష్ట్ర, వివిధ జిల్లాల బాధ్యులు గాజుల భగవాన్ నేత, చింతకింది శ్రీనివాస్, ఎలిగేటి శ్రీనివాస్, విజయలక్ష్మి, ఉమారాణి, కుమారస్వామి, శారద, ప్రభాకర్, కోటేశ్వర్, నాగభూషణం, లక్ష్మీపతి, రజిని, అరుణ్ తేజ్, లక్ష్మీనారాయణ, రమేష్, కనకయ్య తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## కార్మిక సంక్షేమమే ప్రభుత్వాల బాధ్యత: రామన్న

**విశ్వంభర, బాగ్ లింగంపల్లి:** సంఘటిత, అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుని ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ కార్మిక సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి రామన్న అన్నారు. హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించిన తెలంగాణ కార్మిక సమాఖ్య రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడారు. కార్మికులకు 100 గజాల ఇంటి స్థలం కేటాయించి గృహాలు నిర్మించాలని, పోడు, సీలింగ్, లావణి పట్టా భూములకు పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, గ్రామ పంచాయతీ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని, మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అలాగే ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో: జేఏసీ కన్వీనర్ కోలా జనార్ధన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు నెమలి పులి నాగమణి కె. లక్ష్మి రత్న కుమారి పి. నారాయణ స్వరాజ్యం ముంతాజ్ బేగం దైదా సాగర్ ఈశ్వర్ గణేష్ జి. శేఖర్ ఎన్. నీలా రెడ్డి పాల్గొన్నారు.





## 11వ అఖిల భారత పోలీసు జూడో క్లస్టర్ క్రీడలు ప్రారంభం

**విశ్వంభర, గచ్చిబౌలి :** గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో గురువారం 11వ అఖిల భారత పోలీసు జూడో క్లస్టర్--2026 క్రీడా పోటీలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు చెందిన క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అతిధులను ఆకట్టుకున్నవి. ఈ కార్యక్రమంలో పోలీసు శాఖ ఉన్నతాధికారులు, క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఏఐ డిజిటల్ ల్యాబ్ ప్రారంభం



**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలం ఎదులాబాద్ జెడ్పీహెచ్ఎస్ బాలికల ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో ఏఐ ఆధారిత అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌ను గురువారం ప్రారంభించారు. టీడీఎఫ్ అమెరికా అట్లాంటా చాప్టర్ సభ్యులు స్వాతి సుదిని, విక్రమ్ రెడ్డి సుదిని దాతృత్వంతో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌లో ఐదు హై-పర్ఫార్మెన్స్ కంప్యూటర్లు, నెట్‌వర్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీఎఫ్ ఇండియా అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "మన తెలంగాణ బడి" కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని మరిన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ లెర్నింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కొండాల వెంకట కృష్ణారెడ్డి బాలుర ప్రభుత్వ పాఠశాలకు మరో కంప్యూటర్ ల్యాబ్‌ను విరాళంగా అందజేస్తామని ప్రకటించారు ఈ కార్యక్రమం లో హెడ్ మాస్టర్ కృష్ణ కుమారి పాల్గొన్నారు.

## నీట్ లీకేజీపై సమగ్ర విచారణ జరపాలి



**విశ్వంభర, బాగ్‌లింగంపల్లి :** నీట్ పరీక్షల్లో జరుగుతున్న అక్రమాలు, ప్రశ్నపత్రాల లీకేజీలు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని, లీకేజీలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, పరీక్షా విధానంలో పారదర్శకతను తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నవీన్ నాయక్ అన్నారు. హైదరాబాదులోని బాగ్‌లింగంపల్లిలో గురువారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నీట్ పరీక్షల్లో వరుసగా జరుగుతున్న అవకతవకలతో లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. ప్రతిభకు ప్రాధాన్యం కల్పించేలా పరీక్షల నిర్వహణను పారదర్శకంగా చేపట్టాలని, లీకేజీలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే ఢిల్లీలో నీట్ లీకేజీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలను ఆయన ఖండించారు. విద్యార్థుల సమస్యలకు మద్దతుగా వెళ్లిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీలపై పోలీసులు తీసుకున్న చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేయకుండా వారి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని, పరీక్షా వ్యవస్థపై విద్యార్థుల్లో తిరిగి నమ్మకం కల్పించే చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో: లోకేష్ యాదవ్, అంజి యాదవ్, నాగభూషణ్, రాజు, వర్మ, జబ్బార్, కన్నా, బబ్లు, ప్రేమ్ కుమార్, భూపాల్, శ్రీకర్, విద్యార్థులు,, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మురుగు కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ నివేదిత

**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 24వ వార్డు సీతారాంపురం ప్రాంతంలో మున్సిపల్ సాధారణ నిధుల ద్వారా మంజూరైన 5 లక్షలతో మురికి కాలువ (డ్రైనేజీ) నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వార్డుకు విచ్చేసిన చైర్‌పర్సన్‌కు 24వ వార్డు కౌన్సిలర్ మన్నెం అరుణ మల్లేష్ లు శాలువాతో ఘనంగా సన్మానం చేసి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పట్టణంలోని శివారు ప్రాంతాలతో పాటు అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సూర్యాపేటను నిర్మించేందుకు మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న వేసవికాలంలో నీటి ఎద్దడిని నివారించేందుకు దోసపాడు ప్రాజెక్టును పునరుద్ధరించి, సూర్యాపేట ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం అందించే దిశగా చర్యలు చేపడతామని చెప్పారు. సూర్యాపేట సమగ్ర అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమాలకు భాగస్వాములు కావాలని చైర్‌పర్సన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

## మూడు జిల్లాల అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష




**విశ్వంభర, హుస్నాబాద్:** ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశమున్న నేపథ్యంలో హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. హుస్నాబాద్ ఇంటిగ్రేటెడ్ ఆఫీసర్ కాంప్లెక్స్‌లో సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. హుస్నాబాద్ పీఠభూమి ప్రాంతం కావడంతో సాధారణ పరిస్థితుల్లోనే వర్షాభావం ఉంటుందని, ఈసారి ఎల్ నినో ప్రభావం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందన్నారు. ప్రతి శాఖ కార్యాచరణ ప్రణాళికతో పనిచేసి తాగునీటి సరఫరా, పశుగ్రాసం, భూగర్భ జలాల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రైతులు వరికి బదులుగా మొక్కజొన్న, కందులు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఆయిల్‌పామ్ వంటి ఆరుతడి పంటలను సాగు చేసేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. విబిజీ రామ్‌జీ, తెలంగాణ జలసిరి పథకాల ద్వారా ఫామ్‌పాండ్లు, ఇంకుడు గుంతలు నిర్మించి ప్రతి వర్షపు చుక్కను సంరక్షించాలని సూచించారు. మంజూరైన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని, గౌరవెల్లి ప్రాజెక్టు, శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల, 250 పడకల ఆస్పత్రి, ఫోర్‌లైన్ రోడ్డు తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని, హుస్నాబాద్‌ను ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు చర్యలు కొనసాగించాలని సూచించారు. సిద్దిపేట కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ రైతులను ఆరుతడి పంటల వైపు మళ్లిస్తూ కంటింజెన్సీ ప్రణాళికలను అమలు చేస్తున్నామని తెలిపారు. హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా, నీటి సంరక్షణపై ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ పంటల మార్పిడి, ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తూ తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# స్వీయ సంరక్షణతోనే గుండె జబ్బులు, స్ట్రోక్‌కు చెక్

## స్వీయ సంరక్షణ దినోత్సవం పై 108 ఈఎంఆర్ఐ అవగాహన






**విశ్వంభర, హుస్నాబాద్ :** అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హుస్నాబాద్‌లో 108 ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ స్వీయ సంరక్షణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా గుండె జబ్బులు, స్ట్రోక్ వంటి ప్రాణాంతక వ్యాధులను నివారించవచ్చని తెలంగాణ రాష్ట్ర 108 అంబులెన్స్ సేవల కార్యనిర్వాహణ అధికారి బి. సుధాకర్, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సంపత్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2026 జనవరి నుంచి జూన్ వరకు రాష్ట్రంలో 17,940 ఛాతీ నొప్పి అత్యవసర కేసులు, 5,025 స్ట్రోక్ కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. ముఖ్యంగా 30--40 ఏళ్ల వయస్సు వారిలో గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రక్తపోటు, రక్తంలో చక్కెర, లిపిడ్ ప్రొఫైల్ వంటి ఆరోగ్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, రోజూ కనీసం 30 నిమిషాలు నడవడం, పొగాకు, మద్యపానానికి దూరంగా ఉండడం, యోగా, ధ్యానం చేయడం అలవర్చుకోవాలని సూచించారు. అలాగే తగినంత నిద్ర, క్రమం తప్పని వ్యాయామం, డిజిటల్ డిటాక్స్, కుటుంబ సభ్యులతో సమయం గడపడం శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా వెంటనే 108 అంబులెన్స్ సేవలకు కాల్ చేయడం కూడా ఉత్తమ స్వీయ సంరక్షణ చర్యేనని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండి ఆరోగ్యకర జీవనశైలిని పాటించాలని పిలుపునిచ్చారు.

# ఏకలవ్యుని జయంతిని అధికారంగా నిర్వహించాలి

## తెలంగాణ ఎరుకల ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షులు కెమసారం తిరుపతి




**విశ్వంభర, బషీర్ బాగ్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా ఏకలవ్యుని జయంతి నిర్వహించాలని తెలంగాణ ఎరుకల ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షులు కెమసారం తిరుపతి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏకలవ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ, ఎరుకల కులస్తులు 6 లక్షలపైగా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం వారి అభివృద్ధి కొరకు ప్రత్యేక ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ట్యాంక్ బండ్ పై ఏకలవ్య విగ్రహం ఏర్పాటు చెయ్యాలన్నారు. ప్రత్యేక ప్యాకేజీ కింద ఎరుకల కులస్తులకు ప్రతి ఏడాది 10 కోట్లు కేటాయించాలని కోరారు. 33 జిల్లాలలో ప్రతి జిల్లా కేంద్రానికి ఏకలవ్య గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. ప్రతి ఏడాది ఏకలవ్యుని జయంతి ఉత్సవాలను 5 రోజులపాటు జరుపుకోవాలని ఎరుకల కులస్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ఉపేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుతాడి అశోక్, తిరుపతి సంపత్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు నడిగడ్డ కుమారస్వామి, రేవెల్లి ఓదెలు, ఉండ్రాల ఎల్లయ్య, కెమసారం నగేష్, కెమసారం నాగేశ్వర్, మానుపాటి జయశంకర్, కోనేటి పోచయ్య, మల్లపూర్తి సాయిలు, ఎరుకలి బసప్ప, తెలంగాణ ఎరుకల మహిళ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూతాడి కోమల, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్ర రజిత, కోనేటి రమాదేవి, దాసరి విజయ, రెవెల్లి శారద, కట్ట జ్యోతి, ఉండాడి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల సంక్షేమానికి 18 కోట్ల నిధులు విడుదల

## కృతజ్ఞతలు తెలిపిన సర్వాయి పాపన్న గౌడ సంఘం



**విశ్వంభర, రామన్నపేట:** రాష్ట్రంలోని గీత కార్మికుల సంక్షేమం కోసం ఇటీవల తెలంగాణ ప్రభుత్వం 18 కోట్ల రూపాయల నిధులను విడుదల చేయడం పట్ల సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా నిధులు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కప్పల రవి కుమార్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది గీత కార్మిక కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని, గౌడ అన్నలకు ప్రభుత్వం తోడుగా నిలవడం అభినందనీయమని రవి కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఇదే సమయంలో గీత కార్మికులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వృత్తి రీత్యా చెట్లు ఎక్కేటప్పుడు ప్రమాదాల బారిన పడకుండా గీత కార్మికులందరికీ నాణ్యమైన సేఫ్టీ మోకులను అందించాలని, వృత్తి రీత్యా శారీరక శ్రమతో కూడుకున్న పని కాబట్టి, 50 సంవత్సరాలు నిండిన ప్రతీ గీత కార్మికునికి ఆసరా/సామాజిక పింఛను మంజూరు చేయాలని, కల్లు విక్రయాలు, రవాణా సులభతరం చేసేందుకు అర్హులైన గీత కార్మికులకు రాయితీపై ద్విచక్ర వాహనాలు పంపిణీ చేయాలని కోరారు. అంతే కాకుండా గీత వృత్తిలో వికలాంగులైన వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో 20 శాతం రాయితీ ఇచ్చి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. గీత కార్మికుల న్యాయమైన కోరికలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించి, త్వరితగతిన సానుకూల నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నట్లు పరిటాల రవి కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## అంబాలలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన గొంగిడి సునీత రెడ్డి



**విశ్వంభర, గుండాల:** గుండాల మండలం అంబాల గ్రామానికి చెందిన దేశపాక అశోక్ ఇటీవల పాము కాటుకు గురై మృతిచెందిన విషయం తెలుసుకున్న మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని వారి నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా అశోక్ కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. ఈ విషాద ఘటనపై ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ ఖలీల్, గ్రామ ఉపసర్పంచ్ బీసు ప్రశాంత్, జక్కుల యాదయ్య, మాజీ ఎంపీటీసీ పొన్నగాని మహేష్, వార్డు సభ్యుడు మధు, మహేష్, నర్సింహ, వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ భిక్షమయ్య, రాములు, లోడె ప్రవీణ్, మహేందర్ రెడ్డి, రమేష్, ఉపేందర్, శ్రీనివాస్ రెడ్డి, యాదిరెడ్డి, నర్సయ్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



## కందుకూరు సిఐ వెంకటేశ్వర్లు కు పౌర సన్మానం

**విశ్వంభర, బషీర్ బాగ్:** ఇటీవల 10 లక్షల దోపిడీ కేసులో నిందితుల నుండి పది లక్షలు రికవరీ చేసి బాధితులు కందుకూరు మండలం అన్నోజిగూడ నివాసి ఢిల్లీ నారాయణకు తక్కువ సమయంలో తిరిగి ఇప్పించినందుకు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు, తెలంగాణ మేధావుల ఫోరం అధ్యక్షులు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ కందుకూరు పోలీస్ స్టేషన్ కు విచ్చేసి శాలువతో సిఐ వెంకటేశ్వర్లకు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ పోలీస్ టీమ్ లోని కందుకూరు పోలీస్ స్టేషన్ ఎస్సై పరమేశ్వర, కానిస్టేబుల్ మహేష్, మల్లేష్, శేఖర్లకు సైతం అభినందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో సంఘ సేవకులు కోరేళ్ళ చంద్రయ్య మహేశ్వరం మహేశ్వరం మండలం, హైకోర్టు న్యాయవాది గద్ద గూటి ఎట్టయ్య, ఢిల్లీ యాదయ్య, కటికల మహేందర్, కొరివి సురేందర్, శ్రీరాములు, పిసిసి కోఆర్డినేటర్ ఢిల్లీ శివకుమార్ పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన 8వ వార్డు సభ్యులు పుట్టల లక్ష్మమ్మ-ముత్యాలు దంపతుల కుమారుడు సాయి కుమార్ కుమార్తె మొదటి పుట్టిన రోజు సందర్భంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చిన్నపాక శ్రీనివాస్ హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వీరి వెంట గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్, నాయకులు సింగనబోయిన గణేష్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్ట్ కు నిరసనగా కాంగ్రెస్ నాయకుల ధర్నా



**విశ్వంభర, త్రిపురారం:** లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీఅరెస్టుకు నిరసనగా నాగార్జునసాగర్ నియోజకవర్గ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి ఆదేశాల మేరకు త్రిపురారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అలంపల్లి జానయ్య ఆధ్వర్యంలో త్రిపురారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టి కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భాస్కర్నాయక్, మాజీ మండల అధ్యక్షులు బుచ్చిరెడ్డి,కాంగ్రెస్నాయకులు అనుముల శ్రీనివాస్ రెడ్డి , మాజీ మార్కెట్ చేర్మెన్ మర్ల చంద్రారెడ్డి, మైలరశెట్టి సైదయ్య , నరోత్తమ్ రెడ్డి, కసిరెడ్డి నరేష్ ,అంబటి రాము ,అంబటి సోమయ్య, శ్యాముందరెడ్డి ,అవిరెండ్ల వీరయ్య ,కొండభాస్కర్,రాంచంద్రయ్య ,నజీమ్,వంకుడోతుపాండు ,బొల్లం వెంకటేశ్వర్లు , పద్మ వివిధ గ్రామాల సర్పంచులు, మాజీప్రజాప్రతినిధులు, సీనియర్నాయకులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఘనంగా బీఎంఎస్ వ్యవస్థాపక దినోత్సవం




**విశ్వంభర, చిక్కడపల్లి:** 35 మంది సభ్యులతో ప్రారంభమైన భారతీయ మజ్దూర్ సంఘ్ నేడు 3 కోట్ల సభ్యులతో దేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా ఎదిగిందని భారతీయ మజ్దూర్ సంఘ్ అఖిల భారత కార్యదర్శి అనిల్ ధుమ్లే అన్నారు. హైదరాబాదు ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఉన్న దత్తోపంత్ ఠెంగడి భవన్‌లో గురువారం భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) తెలంగాణ శాఖ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ ధుమ్లే బీఎంఎస్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం బీఎంఎస్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో: రాష్ట్ర సంఘటనా కార్యదర్శి రామోహన్ ప్రజారంగ ప్రధాన కార్యదర్శి రావుల వెంకటరావు తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు జయేందర్ జీ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

## రామన్నపేట సర్కిల్ ఇన్ స్పెక్టర్‌గా మోలుగురి రవి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా మోలుగురి రవి గురువారం రోజు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ మోలుగురి రవి మాట్లాడుతూ, చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పనిచేస్తానని తెలిపారు. ప్రజల సహకారంతో నేరాల నియంత్రణకు కృషి చేస్తామని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.

## రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నాయికోటి రాజు



విశ్వంభర, హైదరాబాదు : తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం 40 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా బ్యాలెట్ పద్ధతిలో రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. గురువారం ఎల్బీనగర్‌లో జరిగిన ఎన్నికల్లో నాయికోటి రాజు రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రిటైర్డ్ సివిల్ సప్లై అధికారుల పర్యవేక్షణలో నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్రంలోని జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 43 ఓట్లు పోలవగా, నాయికోటి రాజుకు 23 ఓట్లు, పారేపల్లి నాగరాజుకు 15 ఓట్లు లభించాయి. దీంతో నాయికోటి రాజు రాష్ట్ర అధ్యక్షుడిగా విజయం సాధించారు. విజయం అనంతరం రాష్ట్రంలోని జిల్లా నాయకులు నూతన అధ్యక్షుడిని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయికోటి రాజు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. డీలర్ల హక్కుల పరిరక్షణ, పెండింగ్ డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసి ప్రతి రేషన్ డీలర్‌కు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగంచేసుకోవాలి



విశ్వంభర, త్రిపురారం : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకులు, జ్యోతి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ మువ్వ రామా రావు కోరారు. త్రిపురారం మండలం చెన్నైపాలెం గ్రామంలో గురువారం జ్యోతి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు వైద్యం అందక అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఆయాప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగావందలాదిమంది ప్రజలకు బిపి, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాము, మాజీ ఎంపీటీసీ చేన్నలు, బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్,వైద్య బృందం డాక్టర్లువినీత్,సాయి,విక్రమ్, వైద్యసిబ్బంది నాగేంద్రబాబు, నాగరాజు, విష్ణు, సంధ్య, రేణుక,ప్రత్యూ పాల్గొన్నారు.

## ఆర్పీఐ (అథవాలే) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిని నేనే: పసుల రవికుమార్




విశ్వంభర, హైదరాబాద్ (బషీర్‌బాగ్): రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా తానే గత మూడేళ్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్నానని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవికుమార్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా పేరం శివనాగేశ్వరరావు గౌడ్ చెలామణి అవుతుండటాన్ని తీవ్రంగా ఖండించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాను ఆర్పీఐ (అథవాలే) పార్టీలో పదేళ్లుగా పనిచేస్తున్నానని, మూడేళ్లుగా రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నానని తెలిపారు. పార్టీ పదవులను దుర్వినియోగం చేస్తూ పార్టీ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడడం, కార్యకర్తలను బెదిరించడం లేదా పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలకు పాల్పడే వారికి పార్టీలో స్థానం ఉండదని హెచ్చరించారు. తెలంగాణలో పార్టీకి స్థానికులే నాయకత్వం వహించాలని, రాష్ట్ర ఇన్‌చార్జి కూడా స్థానికుడే ఉండాలని పేర్కొన్నారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారికి తెలంగాణ విభాగంలో ఎలాంటి పదవులు ఇవ్వబోమని స్పష్టం చేశారు. అలాంటి వారిని ప్రోత్సహించే వారిని కూడా పార్టీ ద్రోహులుగా పరిగణిస్తామని అన్నారు. అక్టోబర్ నెలలో హైదరాబాద్‌లో పదివేల మంది కార్యకర్తలతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు కేంద్ర మంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షుడు రాందాస్ అథవాలే ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘుముద్రి పీటర్ నాయుడు, ఉపాధ్యక్షులు బానోతు రవి, బీసీ సెల్ అధ్యక్షుడు రాముకుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు స్నేహలత, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి సునీల్, ఉపాధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశ్వంభర, షాద్‌నగర్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు సూచించారు. గురువారం ఫరూక్‌నగర్ మండల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన వర్షాకాల అత్యవసర ప్రణాళిక సమీక్ష సమావేశంలో సర్పంచులు, డిప్యూటీ సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, ఏఈఓలకు ఆరోగ్య అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిల్వ నీటిలో దోమలు పెరిగి మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు వ్యాపిస్తాయని హెచ్చరించారు. వర్షాకాలంలో గోరువెచ్చని నీరు తాగడం, తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్లు వంటి పోషకాహారం తీసుకోవడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీకాంత్, వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్, ఇతర అధికారులు, సర్పంచులు, డిప్యూటీ సర్పంచులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.




## జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

### పనులను త్వరగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

### రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి: ఎస్పీ నరసింహ



విశ్వంభర, సూర్యాపేట: సూర్యాపేట జిల్లా కేంద్రంలో జాతీయ రహదారి 65 కు సంబంధించి జరుగుతున్న రోడ్డు విస్తరణ , ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను గురువారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ సంయుక్తంగా పరిశీలించారు. జాతీయ రహదారుల అథారిటీ అధికారులతో కలిసి వారు క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని నిశితంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణ పనులను నిర్దేశిత గడువులోగా, అత్యంత వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు మరియు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన, సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. తదుపరి జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ.. నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికుల రక్షణే ధ్యేయంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రమాదాల నివారణకు అవసరమైన చోట్ల సైన్ బోర్డులు, రక్షణ కంచెలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జాతీయ రహదారుల అథారిటీ అధికారులు, జిల్లా యంత్రాంగం మరియు పోలీస్ శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

### ఎస్పీ నరసింహ



విశ్వంభర, సూర్యాపేట: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో వాహనాల రద్దీని నియంత్రిస్తూ, ట్రాఫిక్ సమస్యలను పూర్తిగా తొలగించడం ద్వారా ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కల్పించేందుకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని జిల్లా పోలీస్ ఎస్పీ నరసింహ తెలిపారు. గురువారం సూర్యాపేట కొత్త బస్టాండ్, దాని పరిసర రోడ్లను స్థానిక పోలీస్ అధికారులు, ఆర్టీసీ అధికారులతో కలిసి ఎస్పీ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రయాణికుల భద్రతపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సాధారణ ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా బస్టాండ్‌లోకి ఆర్టీసీ బస్సులు సజావుగా వచ్చి వెళ్లేలా ప్రత్యేక మార్గాలను (రూట్లను) ఏర్పాటు చేసుకోవాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. బస్టాండ్ చుట్టుపక్కల రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు రోడ్లపైకి రాకుండా, తమ పరిధిలోనే వ్యాపారాలు చేసుకోవాలని, లేనిపక్షంలో చర్యలు ఉంటాయని తెలిపినారు. బస్టాండ్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా స్థానిక పోలీస్, ట్రాఫిక్ సిబ్బంది ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పర్యవేక్షించాలని ఆదేశించారు. పొరుగు ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణికులకు సూర్యాపేట పట్టణంలో ప్రయాణం సురక్షితంగా, సులభంగా ఉండేలా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టుపై గుండాలలో కాంగ్రెస్ నిరసన



విశ్వంభర, గుండాల: రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ గుండాల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కాంగ్రెస్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించిన నాయకులు, అనంతరం ధర్నా చేపట్టి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్మడి దశరథ గుప్తా మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ అంశంపై విద్యార్థులు నిర్వహిస్తున్న ఆందోళనలకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ఈ అక్రమ అరెస్టును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏలూరి రాంరెడ్డి, జిల్లా కార్యదర్శి పోడిశెట్టి వెంకన్న, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చిందం ప్రకాష్, సర్పంచులు గద్వాల ఉపేందర్, గూడెపు కుమార్, లింగాల అనిల్ కుమార్ గౌడ్, కాళీ మంజుల, ఆంజనేయులు, తాండ్ర నారాయణస్వామి, వల్లాల రమేష్, పీఏసీఎస్ డైరెక్టర్లు పొనగాని నారాయణ, అన్యపర్తి యాదగిరి, నూనె ముంతల యాదయ్య, మాజీ ఎంపీపీ సంఘీ వేణుగోపాల్ రావు, హరిత దేవి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కుమ్మరికుంట్ల రాజారత్నం, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇమాంపేట గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



విశ్వంభర, సూర్యాపేట: సూర్యాపేట పరిధిలోని ఇమాంపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, ఆహార సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తనిఖీలో భాగంగా కిచెన్, డైనింగ్ హాల్, కూరగాయలు, బియ్యం తదితర నిత్యావసర సరుకుల నిల్వ గదులను పరిశీలించి పరిశుభ్రత, నిర్వహణపై పలు సూచనలు చేశారు. కూరగాయలు, సరుకులను నాణ్యత దెబ్బతినకుండా భద్రపరచాలని, గుడ్లను అవసరానికి అనుగుణంగా మాత్రమే నిల్వ ఉంచాలని సూచించారు. వంటశాల, భోజనశాలలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం పదో తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులకు కొద్దిసేపు హిందీ పాఠాన్ని బోధించి, ఉన్నత లక్ష్యాలతో చదువుకుని భవిష్యత్తును నిర్మించుకోవాలని ప్రోత్సహించారు. కంప్యూటర్ ల్యాబ్, క్రీడా మైదానాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్లేగ్రౌండ్ విస్తరణకు విద్యార్థులు చేసిన విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్, ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. మెస్ కమిటీ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. టాయిలెట్లు, ఫ్యాన్లు, లైట్లు, డోర్లకు సంబంధించిన చిన్నపాటి మరమ్మతులను 15 రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయురాలు భవాని తదితరులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గుచూపాలు

### జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర



విశ్వంభర, నెల్లికుదురు: ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల్లో రైతులు సాగు తో పాటు పండించాల్సిన పంటల పట్ల అనుసరించే విధానంపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నెల్లికుదురు మండలంలోని సొల్ల తండాలో గురువారం కర్షకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నీరు అధికంగా అవసరం లేనటువంటి కంది,పెసర,మినుము, బొబ్బర్లు, సజ్జ,జొన్న, కూరగాయలు, ఆయిల్ ఫామ్ పంటలు పండించేందుకు రైతులు ముగ్గు చూపాలన్నారు. ఎక్కువ నీటి ఆధారంగా పండే వరి పంటల పట్ల ఆసక్తి కనపరచకుండా ఎంతో కొంత తిండి కోసం మాత్రమే సాగు చేసుకోవాలన్నారు. ఎప్పుడూ పండించే వరి,పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలనే సాగు చేయకుండా పంట మార్పిడి చేసుకోవడం వలన వర్షాభావ పరిస్థితులను అధిగమించడమే కాకుండా అనేక ప్రయోజనాలు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భూక్య మహేందర్, ఇరిగేషన్ ఏఈ ప్రణయ్,ఏఈవో ధరణీష్ రైతులు పాల్గొన్నారు.



## కేకే స్వర ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స


విశ్వంభర, బోడుప్పల్: బోడుప్పల్‌లోని కేకే స్వర సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యంత క్లిష్టమైన "ట్రామాటిక్ డయాఫ్రాగ్మాటిక్ హెర్నియా విత్ గ్యాస్ట్రిక్ పెర్ఫొరేషన్" కేసుకు వైద్యులు విజయవంతంగా అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి రోగి ప్రాణాలను కాపాడారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో థొరాసిక్ సర్జన్ డా. అరుణ్ కనాల మాట్లాడుతూ, అత్యవసర లాపరోటమీ, థొరాకోటమీతో పాటు డయాఫ్రాగ్మాటిక్ హెర్నియా రిపేర్, ఓమెంటల్ ప్యాచ్ రిపేర్ నిర్వహించామని తెలిపారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, త్వరలో పూర్తిగా కోలుకుంటారని చెప్పారు. హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డా. శ్రీకాంత్ మోటే మాట్లాడుతూ, సమయానికి సరైన నిర్ధారణ, వైద్య బృందం సమన్వయం, ఆధునిక సాంకేతికతతో ఈ క్లిష్ట శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను తక్కువ ఖర్చుతో అందించడం తమ ఆస్పత్రి లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా. ఎల్. సాయి భార్గవ్, డా. జి. క్రాంతి కిరణ్, డా. కృష్ణస్వామి తదితర వైద్యులు పాల్గొన్నారు.

## రైతులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



విశ్వంభర, పరిగి: కుల్కచర్ల మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 16 మంది రైతులకు సుమారు రూ.72 లక్షల విలువైన పిఎసిఎస్ ఎల్టి లోన్ చెక్కులను పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, సహకార సంఘాల ద్వారా అందిస్తున్న రుణాలు రైతులకు ఆర్థికంగా ఎంతో తోడ్పాటునిస్తాయని అన్నారు.రైతులు ఈ రుణాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ భీమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గోపాల్ నాయక్, కమిటీ సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాల కోసం నీటిని సంరక్షించాలి మున్సిపల్ కమిషనర్




విశ్వంభర, పరిగి: పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ నెంబర్ వన్ పాఠశాలలు సేవ్ వాటర్ సేవ్ లైఫ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లేష్ పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీరు ప్రాముఖ్యత భవిష్యత్ తరాల కోసం నీటిని సంరక్షించవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. వర్షపు నీటిని నిల్వ చేయడం పర్యావరణ సమతుల్యతను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై కలుదన్నారు. ఇండ్లలో వర్షపు నీటి సేకరణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, లీక్ అవుతున్న పైపులు, కళాయిలను వెంటనే మరమ్మతులు చేయించుకోవాలని తెలిపారు. విద్యార్థులకు వర్షపు నీరు వృధా కాకుండా ఎలా కాపాడ లో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు గోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నీట్ లీకేజీపై సీపీఐ నిరసన

విశ్వంభర, హిమాయత్ నగర్: నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జ్ ప్రజాస్వామ్య విరుద్ధమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ, ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జ్‌ను నిరసిస్తూ గురువారం సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హైదరాబాదు హిమాయత్ నగర్ లిబర్టీ చౌరస్తా నుంచి ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, విద్యార్థుల ఆందోళనలను అణచివేయడం కాకుండా వారి సమస్యలను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే చర్యలు తగవని అన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ, వరుసగా నీట్ పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీలు జరుగుతున్నందున కేంద్ర విద్యాశాఖ మంత్రి బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ నిర్వహణ బాధ్యతలను రాష్ట్రాలకు అప్పగిస్తే ఇలాంటి ఘటనలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె. నారాయణ మాట్లాడుతూ, విద్యార్థుల ఉద్యమాన్ని రాజకీయ కోణంలో చూడకుండా వారి న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశ్య పద్మ ఈ.టి. నరసింహ తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కలవేన శంకర్ బాగం హేమంత్‌రావు వి.ఎస్. బోస్ నెల్లికంటి సత్యం బొమ్మగాని ప్రభాకర్ పాలమాకుల జంగయ్య దండి సురేష్ అందోజు రవీంద్రాచారి మంద పవన్ తాండ్ర సదానందం కలకొండ కాంతయ్య ఆర్. అంజయ్య నాయక్ కర్రె బిక్షపతి ఎస్. బాలరాజు జ్యోతి బి. స్టాలిన్ విజయలక్ష్మి పండిట్ ముత్యాల యాదిరెడ్డి ఎం. అనిల్ కె. ధర్మేంద్ర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# కంచర్లగూడెంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



విశ్వంభర, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కంచర్లగూడెంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ఓటరు జాబితా సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియ, గ్రామకంతం--ఆబాది రీ సర్వే, ఎస్‌జీటీ ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్ఐఆర్ ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పూర్తిగా పారదర్శకంగా కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తున్నామని, వాటిని సక్రమంగా నింపి సమర్పిస్తే డిజిటలైజేషన్ ద్వారా ఓటు వివరాలు నిర్ధారించబడతాయని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తూ ఎలాంటి పొరపాట్లు లేని ఓటరు జాబితా సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఎంపికైన 70 గ్రామాల్లో 11 గ్రామాల్లో గ్రామకంతం, ఆబాది రీ సర్వే పూర్తయిందని, మిగిలిన ప్రాంతాల్లో కూడా ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్‌జీటీ ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. సత్యనారాయణ మూర్తి, డీఎస్ఓ అప్పారావు, ఎంఈఓ బాలాజీ, తహసీల్దార్ విజయ, ఎంపీడీవో వీరబాబు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీకి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నిరసన



విశ్వంభర, డిండి: మండల కేంద్రంలో టీపీసీసీ పిలుపు మేరకు, కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ కి సంఘీభావంగా డిండి రాజీవ్ గాంధీ చౌరాస్తాలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శశిధర్ రెడ్డి సందర్భంగా మాట్లాడుతూ, ఇటీవల ఢిల్లీలో జరిగిన నిరసన కార్యక్రమంలో రాహుల్ గాంధీ పై జరిగిన దాడి దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఒక దురదృష్టకర సంఘటన అని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకుడికి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసే హక్కు ఉందని, ఆ హక్కును కాలరాయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ పై జరిగిన దాడి ఒక్క వ్యక్తిపై జరిగిన దాడి కాదు రాజ్యాంగంపై ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఆధునిక భారత నిర్మాణానికి పునాది వేశారని, శ్రీమతి ఇందిరా గాంధీ దేశ సమగ్రత కోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని రాజీవ్ గాంధీ సాంకేతిక విప్లవానికి శ్రీకారం చుట్టారని, శ్రీమతి సోనియా గాంధీ కాంగ్రెస్ పార్టీని క్లిష్ట పరిస్థితుల్లో బలోపేతం చేశారని ఈ నిరసన కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు. కాంగ్రెస్ పార్టీ సర్పంచులు. మాజీ సర్పంచులు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు. ఎన్ఎస్‌యూఐ నాయకులు. కార్యకర్తలు. పాల్గొన్నారు.

# ఫాం పాండ్‌ల నిర్మాణాలతో భూగర్భ జలాలు పెంపు

## జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



విశ్వంభర, కుభీర్ : రైతులు తమ పంట క్షేత్రాలలో ప్రతి వర్షపు చుక్కను ఒడిసి పట్టేందుకుగాను ఫామ్ పాండ్ల ( ఖీుతీఎ జూశీఅఎం ) ను నిర్మించుకోవాలని కలెక్టర్ భవేష్ మిశ్రా పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలం డోడర్న గిరిజన గ్రామంలో గురువారం ఆయన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి గోరేఖ సంతోష్ సాగర రైతు క్షేత్రంలో ఫాం పాండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో ప్రస్తుత పరిస్థితుల్లో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నందున ప్రతి నీటిబొట్టును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు తమ పంట క్షేత్రాలు, బోరు బావుల వద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకుని భూగర్భ జలాల పెంపునకు నడుం బిగించాలని అన్నారు. ఫాం పాండ్ల నిర్మాణానికి ముందుకు వచ్చిన రైతు దంపతులను శాలువాతో సత్కరించారు. భూగర్భ జలాల పెరుగుదలకు మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో విజయలక్ష్మి, ఎంపీడీవో అక్కల్దేవి శ్రీనివాస్, ఏపీడీ ప్రసాద్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీవో భీమేష్, ఏపీవో రాథోడ్ హరిలాల్, టీఏలు, ఆయా శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# 42 ఆటో డ్రైవర్స్ కుటుంబాలకు వ్యాల్ల హరీష్ రెడ్డి చేయూత

విశ్వంభర, గోదావరిఖని : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రవ్యాప్తంగా ఆటోడ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, వీహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వ్యాల్ల హరీష్ రెడ్డి అన్నారు. గోదావరిఖని మార్కండేయ కాలనీలోని శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్ లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బర్త్ డే సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్ లో భాగంగా ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఆర్థిక చేయూత అందిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత ప్రయాణం ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్లకు జీవనోపాధి లేకుండా చేశారని అన్నారు. వారికి ఏడాదికి రూ.12వేలు ఇస్తానని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు ముఖం చాటేశాడని అన్నారు. అంతేగాకుండా ఆటో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని గాలికి వదిలేశాడని అన్నారు. ఇదే క్రమంలో రేపటి కేటీఆర్ బర్త్ డే సందర్భంగా ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి రామగుండం ప్రాంతంలోని మరణించిన ఆటో డ్రైవర్లు, అనారోగ్యంతో ఉన్న 42 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున మొత్తం రూ.4లక్షల 20 వేల చెక్కులను అందిస్తున్నామన్నారు. కేటీఆర్ బర్త్ డే సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్ లో భాగంగా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అన్ని వర్గాల అభ్యున్నతికి సహకారం అందిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కౌశిక్ హరి, మాజీ ఎంపీపీ వ్యాల్ల అనసూయ రామిరెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య యాదవ్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# గీత కార్మికులకు కాటమయ్య రక్షణ పరికరాల పంపిణీ



విశ్వంభర, కోల్ సిటీ : గోదావరిఖనిలో గీత కార్మికులకు గురువారం కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేశారు. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ, ఎక్సైజ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రెండో నంబర్ గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులకు సురక్షితమైన కిట్లను అధికారులు అందజేశారు. వృత్తి రీత్యా తాటి, ఈత చెట్లు ఎక్కే క్రమంలో గీత కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారనీ, ఇలాంటి పరిస్థితిలో ఈ ఆధునిక రక్షణ పరికరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. గీత కార్మికులకు వృత్తిపరమైన భద్రతకు ఎల్లప్పుడు సహకారం అందిస్తామన్నారు. అనంతరం గీత కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనర్లు బుచ్చయ్య గౌడ్, జితేందర్, ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది స్వప్న, శ్రీనివాస్, గీత సహకార సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, రంగు రాజయ్య, బండారి రాంమ్మోహన్, గోపుగోని సతీష్, గంగాధర్ కృష్ణ, శ్రీనివాస్, పద్మ, శ్రీనివాస్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కంచాలి




విశ్వంభర, ముకరంపుర : యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 13వ రోజైన గురువారం తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ (టీజీ పీఈ జేఏసీ) ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం ముందు విద్యుత్ ఉద్యోగుల నిరసన కొనసాగింది. నల్లబ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్వహణకు టెండర్లు పిలవడాన్ని నిరసిస్తూ 30 రోజులుగా వ్యతిరేకిస్తున్నా శుక్రవారం వైటీపీఎస్ టెండర్లను ఓపెన్ చేసేందుకు ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. మేనేజ్ మెంట్ మొండిగా వ్యవహరిస్తే నిరసనను ఉధృతం చేస్తామన్నారు. ఆ తర్వాత జరిగే పరిణామాలకు మేనేజ్ మెంట్ బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. విద్యుత్ సంస్థల్లో ఖాళీగా ఉన్న అన్ని క్యాడర్లలోని పోస్టులను భర్తీ చేయాలనిడిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వామి, మహేందర్ రావు, శ్రీనివాస్, రఘు, రాజు, సంపత్ కుమార్, యుగంధర్, సంతోష్, రంగు వెంకటనారాయణ, నిఖిల్, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



విశ్వంభర, బాగ్ లింగంపల్లి: తెలంగాణ ఉద్యమకారుల సంఘాలన్నీ ఒకే వేదికపైకి వచ్చి ఐక్యంగా పనిచేస్తే ఉద్యమకారుల సమస్యలకు త్వరగా పరిష్కారం లభిస్తుందని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి అన్ని సంఘాల అభిప్రాయాలు, సూచనలతో కూడిన సమగ్ర నివేదిక అందించాలని తెలంగాణ ఉద్యమకారుల కమిటీ చైర్మన్ డాక్టర్ సీమ శ్రీనివాస్ అన్నారు. హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం సాయంత్రం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్రాధ్యక్షులు చీమ సీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమకారుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయడానికి అన్ని ఉద్యమకారుల సంఘాలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి ఉద్యమకారుల సమస్యలు, డిమాండ్లు, సూచనలను సమగ్రంగా అందించి నివేదికను త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఉద్యమకారుల ప్రయోజనాల పరిరక్షణే అందరి లక్ష్యమని, ప్రభుత్వం లేదా కమిటీని విమర్శించడం కాదని ఆయన స్పష్టం చేశారు. ఉద్యమకారుల హక్కులు, గుర్తింపు అంశాల్లో అన్ని సంఘాలు ఐక్యంగా కృషి చేస్తే సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘాల నాయకులు కరుణాకర్ రెడ్డి, నాగరాజు, నవీన్ కుమార్, భూపాల్, ఆనంద్, సుదర్శన్, బాలయ్య, అన్వర్ పటేల్, వెంకటరత్నం, మల్లయ్య, పూస నరసింహ, పద్మ పాల్గొన్నారు.

# కొత్తపల్లి పాఠశాలలో ఎన్‌సీఎం ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు



విశ్వంభర, హాలియా: కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎన్‌సీఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టైలు, బెల్టులు, ఐడీ కార్డులు పంపిణీ చేయడంతో పాటు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేశారు. అలాగే జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ కొత్తపల్లి పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులకు తిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి, హాలియా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల అభివృద్ధికి నిబద్ధతతో పనిచేస్తున్నారని అభినందించారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకుని సమాజానికి సేవ చేయాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల అభివృద్ధికి తమ ఫౌండేషన్ సహకారం కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రమావత్ రామచంద్రయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎన్‌సీఎం ఫౌండేషన్ సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నేడు ఆమ్‌ఆద్మీ జనచైతన్య సభ




విశ్వంభర, హిమాయత్‌నగర్ : జన చైతన్య సభను విజయవంతం చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో నిర్వహించనున్న జన చైతన్య సభకు సంబంధించిన గోడపత్రికలను గురువారం హైదరాబాదు హిమాయత్‌నగర్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హేమా సుదర్శన్ జిల్లోజు మాట్లాడుతూ, సభకు పార్టీ జాతీయ ప్రధాన అధికార ప్రతినిధి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ ప్రియాంక కక్కర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. సభలో నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, అవినీతి రహిత పాలన, ఉపాధి అవకాశాలు, ప్రజా సంక్షేమం, ప్రత్యామ్నాయ రాజకీయాలపై పార్టీ విధానాలను ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు. ప్రజలు, యువత, మహిళలు, రైతులు, మేధావులు, ఉద్యోగులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా ముమ్ము గౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి హైదర్, అధికార ప్రతినిధి ప్రశాంత్ రాజ్, రాకేష్ రెడ్డి, దర్శనం రమేష్ పాల్గొన్నారు.

# రామన్నపేటలో మీనాక్షి నటరాజన్ జన్మదిన వేడుకలు



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ విశ్రాంతి భవనంలో ఏ.ఐ.సిసి తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ జన్మదిన వేడుకలు ఘనంగా కాంగ్రెస్ నాయకులు జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న జగన్మోహన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ జమీరుద్దీన్, డిసిసి కార్యదర్శి కొత్తపల్లి అబ్రహం కుమార్, డిసిసి కార్యనిర్వాహ కార్యదర్శి గుండాల నరసింహ, మార్కెట్ కమిటీ వైస్-చైర్మన్ సింగిరెడ్డి మల్లారెడ్డి, సింగల్ విండో చైర్మన్ బిక్షంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పూస బాలకిషన్, ఇతర మండల నాయకులు, వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వంభర వార్తకు స్పందన.. 25వ వార్డును సందర్శించిన మున్సిపల్ ఏఈ



విశ్వంభర, మహబూబాబాద్: విశ్వంభర దినపత్రికలో "చిన్న వర్షానికి చిత్తడి" శీర్షికతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. గురువారం మున్సిపల్ ఏఈ సౌజన్య 25వ వార్డును సందర్శించి స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డు కమిటీ కన్వీనర్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు నర్రా శ్రావణ్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు రోడ్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినప్పటికీ ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభించాలని ఏఈని కోరారు. దీనిపై స్పందించిన ఏఈ సౌజన్య, రెండు నుంచి మూడు రోజుల్లో కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హామీ అమలు కాకపోతే రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తయ్యే వరకు దశలవారీగా ఆందోళనలు కొనసాగిస్తామని నర్రా శ్రావణ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కాగితం శ్రీనివాస్, సీపీఐ నాయకులు మంద శంకర్, దారమల్ల మహేష్, మొలకలపల్లి సమ్మక్క, ఉపేంద్ర, అనూష, సులోచన, తండా శ్రీనాథ్, రాకేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇనుగుర్తిలో టీచర్ ట్రైనింగ్ ప్రారంభం



విశ్వంభర, ఇనుగుర్తి: మండల కేంద్రం ఇనుగుర్తి లోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో మండల స్థాయి ఇన్ సర్వీస్ టీచర్స్ ట్రైనింగ్ ఎంఈఓ వెంకటరెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ..విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించేలా వినూత్న పద్ధతితో బోధించినప్పుడే విద్యార్థుల్లో పాఠ్యాంశంపై ఆసక్తి, విశ్లేషణా సామర్థ్యం పెంపొందుతుందని ఎంఈఓ వెంకట్ రెడ్డి అన్నారు. విద్యా శాఖ ఏర్పాటు చేసిన 3 రోజుల శిక్షణ సద్వినియోగం చేసుకుని పాఠశాల విద్యార్థులలో ఉన్న లోపాలను సవరించే లా కృషి చేయాలనీ ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ లు భాస్కర్ రెడ్డి,సారంగపాణి,వేణు, కోటేశ్వర్,బాలరాజులు పలు బోధనాంశాలు,మెలకువలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ



విశ్వంభర, కేసముద్రం: కేసముద్రం మున్సిపాలిటీ ఎంపీడీవో కార్యాలయం పరిధిలో రైతు వేదిక నందు కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులు మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్యా మురళి నాయక్, కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజయ్ రెడ్డితో కలసి కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్నలబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు, ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ రావుల మురళి,వార్డ్ కౌన్సిలర్ వల్లందాస్ ఉమా రవి, బానోత్ విజయ బద్రు,కనుకుల రాంబాబు,దశ్రు నాయక్,మహేందర్ రెడ్డి,బండారు వెంకన్న,నీలం దుర్గేష్,కదిరే సురేందర్,రెడ్డి,మార్కెట్ డైరెక్టర్ ఎండీ అయబ్ ఖాన్,యాదగిరి, తాజుద్దీన్, సర్పంచులు,గ్రామ కమిటీ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపాలిటీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి వ్యక్తి తమ పేరును ఓటర్ లిస్టులో నమోదు చేసుకోవాలి

: మండల కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట్ రాములు, పిఎసిఎస్ వైస్ చైర్మన్ రాజ పుల్లారెడ్డి



విశ్వంభర, పరిగి: మండల పరిధిలోని రంగంపల్లి, జీడి గడ్డ తండా, మల్కాయ్ పెట్, ఇబ్రహీంపూర్, హిర్యా నాయక్ తండ, గ్రామంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రాములు, మండల పిఎసిఎస్ వైస్ చైర్మన్ బద్రి గారి రాజ పుల్లారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి వ్యక్తి తమ పేరును ఓటర్ లిస్టులో నమోదు అయ్యేవిధంగా ఆయా గ్రామాల్లోని బి ఎల్ ఎ, బి ఎల్ వో లు దగ్గరుండి చేయించాలని తెలిపారు. ఎస్ ఐ ఆర్ ఫామ్ లో ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. ఓటర్ లిస్టులో ఓటర్ పేరు నమోదు కావాలంటే బీఎల్ఏ లు పూర్తి సహాయ సహకారాలు అందించినప్పుడే 100% ఓటర్ నమోదు కార్యక్రమం పూర్తి కావడం జరుగుతుందని పేర్కొన్నారు. బి ఎల్ ఏ ల బాధ్యత ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్డు సూపర్వైజర్ యాదయ్య, బి ఎల్ ఏ లు గోపాల్, రమేష్, వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజీ పై కాంగ్రెస్ పార్టీ నిరసన



విశ్వంభర, హాలియా: నీట్ పేపర్ లీకేజీ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన నిరసనకు మద్దతుగా పీసీసీ పిలుపు మేరకు, నాగార్జున సాగర్ శాసనసభ్యులు జయవీర్ రెడ్డి ఆదేశాల మేరకు అనుముల మండల కేంద్రంలో హాలియా సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, విద్యార్థులకు ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ నాయకులు నినాదాలు చేశారు. అలాగే, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిని తీవ్రంగా ఖండిస్తూ, కాంగ్రెస్ నాయకుడు గౌరవ శ్రీ రాహుల్ గాంధీని అరెస్టు చేయడాన్ని ప్రజాస్వామ్య విరుద్ధ చర్యగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, హాలియా మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కాకునూరి నారాయణ గౌడ్, కుందూరు వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ అనుమల మండల అధ్యక్షుడు రావుల శ్రీనివాస్ యాదవ్, ఆలియా టౌన్ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పొదిల కృష్ణ, కౌన్సిలర్లు, సర్పంచులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళ నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఈ తరానికి ఓపిక తక్కువ.. ‘హనీమూన్ హత్య’ కేసులో సుప్రీం వ్యాఖ్యలు

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** సమాజంలో వస్తోన్న మార్పుల కారణంగానే ఈ మధ్య కాలంలో ‘హనీమూన్ హత్య’ లాంటి కేసులు వెలుగుచూస్తున్నాయని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ తరం వాళ్లకు జ్ఞానం పెరుగుతున్నప్పటికీ.. ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో తెలియట్లేదని పేర్కొంది. అందుకే వారు మరింత బలహీనంగా మారుతున్నారని తెలిపింది. సోనమ్ రఘువంశీ బెయిల్ అంశంపై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. భర్త రాజా రఘువంశీని హత్య చేసిన కేసులో నిందితురాలిగా ఉన్న సోనమ్‌కు సుప్రీంకోర్టు గురువారం బెయిల్ రద్దు చేసింది. ఆమె మూడు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది. ఈ కేసు విచారణ సందర్భంగా జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ పీబీ వరాలె ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. “మారుతున్న సమాజంలో ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయ...

## ఢిల్లీ ఆందోళనల్లో పాల్గొన్నవారి పాస్‌పోర్టులు రద్దు!



**విశ్వంభర, ఢిల్లీ:** నీట్ పేపర్ లీక్ , చలో పార్లమెంట్ ఆందోళనల్లో పాల్గొన్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. నిరసనల్లో పాల్గొన్న వారిని గుర్తించి, వారి పాస్‌పోర్టులు కూడా రద్దు చేయాలని దిల్లీ పోలీసులు నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు పోలీసు వర్గాలు వెల్లడించాయి. దీనిపై ఇప్పటికే కార్యాచరణ కూడా ప్రారంభమైనట్లు తెలుస్తోంది.నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) చేపట్టిన చలో పార్లమెంట్ సోమవారం ఉద్రిక్తంగా మారిన సంగతి తెలిసిందే. పార్లమెంట్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన బారికేడ్లను ధ్వంసం చేసి, విద్యార్థులు, సీజేపీ నేతలు నిరసనలు చేపట్టారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించడంతోపాటు, లాఠీ ఛార్జ్ చేశారు. ఈ క్రమంలో పలువురు ఆందోళనకారులు, పోలీసులకు కూడా గాయాలయ్యాయి.

**24న దేశవ్యాప్త నిరసనలకు పిలుపు..**

ఆందోళనపై పోలీసుల తీరును నిరసిస్తూ శుక్రవారం దేశవ్యాప్తంగా శాంతియుత నిరసనలు చేపడుతున్నట్లు సీజేపీ ప్రకటించింది. ఈ నిరసనకు మద్దతివ్వాలని విద్యార్థి సంఘాలను కోరింది. ఈ క్రమంలో విద్యా సంస్థలు మూతపడనున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక విద్యార్థి నేతలు అప్రమత్తంగా ఉండాలని విద్యార్థి సంఘాలు కోరాయి.

## హైదరాబాద్-లండన్ విమానంలో పైలట్లకు అస్వస్థత..




**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** హైదరాబాద్ నుంచి లండన్‌కు బయల్దేరిన బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో ముగ్గురు పైలట్లు అస్వస్థతకు గురయ్యారు. విమానం 30వేల అడుగుల ఎత్తులో ఉన్నప్పుడు ఒక పైలట్‌కు ఆక్సిజన్ అందించాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన విమానయాన సంస్థ దర్యాప్తు ప్రారంభించింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం..బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం హైదరాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరింది. విమానం టేకాఫ్ అయిన కొన్ని గంటల తర్వాత ఒక పైలట్ విధులు నిర్వర్తించలేని విధంగా అస్వస్థతకు గురయ్యారు. అప్పుడు విమానం 30వేల అడుగుల ఎత్తులో ఉంది. శ్వాస తీసుకోలేకపోవడంతో ఆక్సిజన్ అందించారు. మరో ఇద్దరు పైలట్లు కూడా స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. అలాగే విధులు నిర్వర్తించిన వారు.. చివరకు లండన్‌లోని హీత్రూలో విమానాన్ని దింపారు. ఈ ఘటనపై విమానయాన సంస్థ ప్రకటన చేసింది. “మా ఉద్యోగుల సంక్షేమమే మాకు తొలిప్రాధాన్యం. అదే సమయంలో ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. పైలట్లకు ఎదురైన పరిస్థితి గురించి సమీక్షిస్తున్నాం” అని ప్రకటన విడుదల చేసింది. తర్వాత వారికి తగిన వైద్య సహాయం అందించారు. వారు ముగ్గురు హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో అల్పాహారం తిన్నట్లు తెలుస్తోంది. ఫుడ్ పాయిజినింగ్ జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు.

# ఒక విద్యార్థి చనిపోయినప్పుడే స్పందించాల్సింది: కమల్



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశమవుతోన్న నీట్ విద్యార్థుల ఆందోళన అంశంపై అగ్ర కథానాయకుడు కమల్ హాసన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటోన్న సమస్యలపై ‘ఎక్స్’ వేదికగా స్పందించిన ఆయన.. ప్రస్తుత విద్యా విధానంలో మార్పులు రావాలని పేర్కొన్నారు.“ఒక విద్యార్థి బాధపడినప్పుడే మనం విని ఉంటే బాగుండేది. కానీ, చాలా మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయే వరకూ వేచి చూశాం. చదువు స్థానంలోకి కోచింగ్, నేర్చుకోవాలనే తపన స్థానంలోకి ఆందోళన, ప్రతిభకి బదులు క్రిమినల్ మైండ్స్ వచ్చాయి. దీంతో ఈ వ్యవస్థ పూర్తిగా కుళ్లిపోయింది. ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సింది బదులు మన పిల్లలను బారికేడ్లు, లాఠీలతో ఎదుర్కొంటున్నాం. వ్యవస్థ విఫలమైందనడానికి ఇది ఉదాహరణ” అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.ఇక విద్యార్థులకు సందేశమిచ్చిన కమల్.. “మీ బాధ్యతను మీరు నిర్వర్తించారు. ఇప్పుడు దేశం తన బాధ్యతను నెరవేర్చాల్సిన సమయం వచ్చింది. ప్రభుత్వ వైఫల్యాల కంటే మీ కలలు ఎప్పుడూ గొప్పవిగా నిలవాలి” అని పేర్కొన్నారు. అలాగే, నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై పోరాడుతోన్న ప్రముఖ పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్‌చుక్‌ను దీక్షవిరమించాలని ఈ సందర్భంగా కమల్ కోరారు.

**బాధ్యులను ఇలా శిక్షించాలి: మాధవన్..**

ఈ వ్యవహారంపై నటుడు మాధవన్ సోషల్ మీడియాలో స్పందించారు. అర్థవంతమైన సంస్కరణల కోసం శాంతియుతంగా పోరాడుతోన్న విద్యార్థుల పట్టుదలను ఆయన అభినందించారు. అదే సమయంలో ఈ ఉద్యమాన్ని స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడానికి, దాన్ని నిజమైన ఉద్దేశం నుంచి పక్కదారి పట్టించడానికి ప్రయత్నించే వారితో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులను కోరారు. “పరీక్షా పత్రాల లీక్‌ల వంటి సంఘటనలు విద్యా వ్యవస్థపై విద్యార్థులు పెట్టుకున్న నమ్మకాన్ని దెబ్బతీస్తాయి. విద్య కీలక పాత్ర పోషించే భారత్ లాంటి దేశంలో ఇవి ఎంతో మంది యువకులు, వారి కుటుంబాల ఆశలను, కష్టాన్ని, కలలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఈ వ్యవహారంలో బాధ్యులైన ప్రతి ఒక్కరినీ త్వరగా చట్టం ముందుకు తీసుకురావాలని నేను ప్రభుత్వాన్ని కోరుతున్నా. మన యువత భవిష్యత్తుతో ఆడుకోవడానికి మరోసారి ఎవరూ సాహసించని విధంగా వారిని శిక్షించాలి” అని చెప్పారు.

## ఎప్పుడైనా మీ ఇష్టమే.. చర్చలకు ప్రభుత్వం సిద్ధం: జితేంద్ర సింగ్



**విశ్వంభర, ఢిల్లీ:** నీట్ పేపర్ లీకేజీపై ఆందోళనలు ఉధృతమైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు ముమ్మరం చేసింది. చర్చలకు రావాలని విద్యార్థులు, కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) నేతలను మరోసారి ఆహ్వానించింది. ‘మీకు అనుకూలంగా ఉండే సమయంలో ఎప్పుడైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది’ అని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు. “ఆందోళనకారులకు కేంద్రం నాలుగు ప్రతిపాదనలు చేసింది. వాటిపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆందోళనకారుల తరఫున కొందరు వచ్చి ప్రభుత్వంతో చర్చించవచ్చు. మీరు ఎప్పుడైనా రావొచ్చు. ప్రభుత్వం తరఫున నేను, జేపీ నడ్డా చర్చలో పాల్గొంటాం” అని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. జేపీ నడ్డా కార్యాలయంలోగానీ, ఆయన నివాసంలో గానీ చర్చిద్దామన్నారు. తొలుత చర్చ ప్రారంభిస్తే.. క్రమంగా సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

**కన్నాట్ ప్లేస్‌లో 6:30కే దుకాణాలు బంద్..**

సీజేపీ ఆందోళనల నేపథ్యంలో న్యూదిల్లీ ట్రేడర్స్ అసోసియేషన్ (ఎన్‌డీటీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. ఆందోళనల తీవ్రత అధికంగా ఉన్న కన్నాట్ ప్లేస్ (సీపీ) ప్రాంతంలో గురువారం సాయంత్రం 6:30కే దుకాణాలు, కార్యాలయాలు మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. అందుకు యజమానులు సహకరించాలని కోరింది. ఎన్‌డీటీఏ ఆదేశాలను ఆమ్‌ఆద్మీపార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. సాయంత్రం 6:30 గంటలకే దుకాణాలు మూసేయమనడం, జంతర్‌మంతర్ వద్ద పోలీసులను మోహరించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై కేంద్రం మరోసారి బలప్రయోగం చేయాలని చూస్తోందని ఆరోపించారు.

## మెట్రో స్టేషన్ల మూసివేత అంశం.. జోక్యం చేసుకోవాల్సి వస్తుందన్న సుప్రీం



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో వరుసగా రెండోరోజు 16 మెట్రో స్టేషన్లను అధికారులు మూసివేశారు. దాంతో ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. న్యాయవాదులు, వ్యాజ్యదారులు, కోర్టు సిబ్బంది న్యాయస్థానానికి రావడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ పిటిషన్ వేసింది. దీనిపై జోక్యం చేసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను కోరింది. దీనికి సీజేఐ స్పందిస్తూ.. మధ్యాహ్నం వరకు వేచి చూద్దామని అన్నారు. ఆ తర్వాత కూడా సమస్య పరిష్కారం కాకపోతే తాము జోక్యం చేసుకుంటామని పేర్కొన్నారు.

**అధికార, విపక్ష ఎంపీల పోటాపోటీ నిరసనలు..**

మరోవైపు, నీట్ పేపర్ లీక్ వ్యవహారం పార్లమెంట్ ను కుదిపేస్తోంది. దానిపై చర్చకు సిద్ధమని ప్రభుత్వం ప్రకటించిన తర్వాత కూడా.. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు విపక్ష ఎంపీలు పట్టుబట్టడంతో ఉభయ సభలు గురువారం కూడా దద్దరిల్లాయి. వాయిదాల పర్వం కొనసాగింది. సభలు వాయిదా పడటంతో పార్లమెంట్ మకరద్వారం వద్ద విపక్ష ఎంపీలు నిరసన చేపట్టారు. వీరికి వ్యతిరేకంగా ఎన్డీయే కూటమి సభ్యులు కూడా నినాదాలు చేయడం గమనార్హం.

**షరతులు పెట్టకండి: రిజిజు..**

నీట్ పేపర్ లీక్‌పై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు పునరుద్ఘాటించారు. “మీరు ఎలాంటి షరతులు పెట్టొద్దని కోరుతున్నాను. రాజకీయాలు చేయొద్దు. ఈరోజే చర్చ ప్రారంభించొచ్చు. మీరు షరతులు పెడుతున్నారంటే.. మీ ఉద్దేశాలు సరిగా లేవని అర్థం” అని ప్రతిపక్షాలను ఉద్దేశించి మంత్రి వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉంటే.. నీట్ పేపర్ లీక్ పై జులై 20న జరిగిన ‘చలో పార్లమెంట్’ నిరసనపై జాతీయ దర్యాప్తు సంస్థ తో విచారణ జరిపించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనిపై శుక్రవారం అత్యవసర విచారణకు హైకోర్టు అంగీకరించింది. విదేశీ నిధులతో నడిచే సంస్థలు, రాజకీయ శక్తుల కుట్రలో ఈ నిరసన భాగమని పిటిషనర్ ఆరోపించారు.

## ముగ్గురు అక్కాచెల్లెళ్లు.. ఒకే ‘కెమెరామెన్’ను పెళ్లాడారు!



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇటీవల ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సోషల్ మీడియాలో క్రియాశీలకంగా ఉండే ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. వారి రీల్స్ తీసే కెమెరామెన్‌నే పెళ్లి చేసుకోవడం గమనార్హం. ఓ ఆలయంలో జరిగిన ఈ వివాహానికి సంబంధించిన వీడియో, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. యూపీలోని అమ్రోహా జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.ధౌరియా గ్రామానికి చెందిన అల్కా, దేవిక, సంతోష్‌లు అక్కాచెల్లెళ్లు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ.. రీల్స్, వీడియో కంటెంట్‌ను చేస్తుంటారు. ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లలోనూ వీరికి ఫ్యాన్ ఫాలోయింగ్ ఎక్కువగానే ఉంది. అదే జిల్లాలోని శ్యాంపురి గ్రామానికి చెందిన వికాస్ అనే యువకుడు వీరి వీడియోలు చిత్రీకరిస్తుంటాడు. కొన్ని వీడియోల్లో భర్తగానూ నటించాడట. అయితే, అక్కాచెల్లెళ్లలో ఇటీవల ఓ భయం నెలకొందని తెలిసింది. వివాహం చేసుకుంటే వేర్వేరు కుటుంబాలకు వెళ్లిపోతామని, అందుకే ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సోదరులనే పెళ్లి చేసుకుంటామని తల్లిదండ్రులకు చెప్పారని తెలిసింది. చివరకు ఏమైందో తెలియదు కానీ.. ఇటీవల ఈ ముగ్గురూ కెమెరామెన్ వికాస్‌ను స్థానికంగా ప్రసిద్ధి చెందిన ఆలయంలో వివాహం చేసుకున్నారు. అయితే, ఇరు కుటుంబాలు ఇందుకు దూరంగా ఉన్నట్లు తెలిసింది. వీరి పెళ్లి విషయం బయటకు తెలియడంతో కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. విమర్శలు కూడా వచ్చాయి. వీటికి స్పందిస్తూ ఓ వీడియో విడుదల చేసిన అక్కాచెల్లెళ్లు.. వారి నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. ఏదేమైనా కలిసే జీవిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంపై స్థానిక పోలీసులు విచారణ జరపగా.. వారితోనూ ఇదే విషయాన్ని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇదిలాఉంటే, వీరిలో ఇద్దరు అమ్మాయిలు తోబుట్టువులు కాగా.. మరో అమ్మాయి మాత్రం వరుసకు సోదరి అని, ముగ్గురు ఒకే ఇంట్లో కలిసి పెరిగినట్లు సమాచారం.



## చమురు నౌకలపై హూతీల దాడి.. ఇరాన్‌కు ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** అమెరికా- ఇరాన్ యుద్ధంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమవుతోంది. చమురు ధరలు పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో హూతీల రూపంలో మరో సమస్య వచ్చిపడింది. ఇరాన్‌కు మద్దతుగా నిలుస్తున్న హూతీలు.. ఎర్ర సముద్రంలో ప్రయాణిస్తున్న సౌదీ అరేబియాకు చెందిన రెండు చమురు నౌకలపై దాడి చేశారు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. హూతీలు దాడులకు పాల్పడినా.. టెహ్రాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. సైనిక చర్య చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.“వాణిజ్య నౌకలపై దాడి చేసినందుకు గానూ ఏడాది క్రితం హూతీలకు అమెరికా గట్టిగా బుద్ధి చెప్పింది. అప్పటి నుంచి వారు నియంత్రణలోనే ఉన్నారు. దురదృష్టవశాత్తు ఇప్పుడు మళ్లీ దాడులు మొదలుపెట్టారు. నిన్న రాత్రి రెండు సౌదీ అరేబియా నౌకలపై కాల్పులు జరిపారు. మరోసారి ఇదే తరహా ఘటనలు పునరావృతమైతే.. అందుకు ఇరాన్ బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఎందుకంటే హూతీలు ఇరాన్ ప్రతినిధులే” అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ నెల 12న అమెరికా బలగాలు ఇరాన్‌పై దాడికి ప్రతీకారంగా చమురు నౌకలను దెబ్బతీసినట్లు హూతీలు ప్రకటించిన సంగతి తెలిసిందే. మరోవైపు, వాణిజ్య నౌకలు, నావికులను బెదిరించేందుకు ఇరాన్ తీవ్రంగా ప్రయత్నిస్తోందని, దానికి అడ్డుకట్ట వేసేందుకే అమెరికా దాడులు చేస్తోందని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. హర్మూజ్ జలసంధిపై మళ్లీ పట్టు సాధించేందుకు, నౌకల రాకపోకలు సజావుగా సాగేలా చూసేందుకు అమెరికా దళాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయని తెలిపింది. హర్మూజ్‌పై పట్టు సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేసింది.

## మాదకద్రవ్యాల అక్రమ రవాణా.. అమెరికాలో భారతీయుడి అరెస్ట్




**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** కెనడా కేంద్రంగా నేర కార్యకలాపాలకు పాల్పడుతున్న అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాలపై ఎఫ్‌బీఐ చర్యలు చేపట్టింది. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, పంపిణీ, ఎగుమతికి సంబంధించిన ఆరోపణలపై లారెన్స్ బిష్ణోయ్, జగ్గు భగవాన్‌పురియా, రవీందర్ ధాండా గ్యాంగ్‌లను లక్ష్యంగా చేసుకుని ఆపరేషన్ హార్డ్ బాల్ పేరుతో దాడులు నిర్వహించింది. ఇందులో భాగంగా భారత్‌కు చెందిన హర్మన్‌వీర్ సింగ్‌ను కాలిఫోర్నియాలో అరెస్ట్ చేసినట్లు ఎఫ్‌బీఐ వెల్లడించింది. ఎఫ్‌బీఐ తెలిపిన వివరాల ప్రకారం.. రవీందర్ ధాండా ముఠా అమెరికా, కెనడా, మెక్సికో దేశాలకు భారీ మొత్తంలో కొకైన్, ఇతర మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ ముఠాలో సభ్యుడైన హర్మన్‌వీర్ సింగ్‌పై జూన్ 23న అమెరికా ఫెడరల్ కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఈ క్రమంలోనే తాజాగా అతడిని అధికారులు అరెస్ట్ చేశారు. ఇక, ఈ నెల ప్రారంభంలో అమెరికా, కెనడా, ఐరోపా దేశాలు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో.. అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాలకు చెందిన 24 మందిని అరెస్ట్ చేశాయి. వీరిలో 11 మందిని కాలిఫోర్నియాలోనే పట్టుకున్నారు.

## ఐదు నెలల్లో 26వేల విమాన సర్వీసులు రద్దు



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** అమెరికా- ఇరాన్ యుద్ధం నేపథ్యంలో గగనతల ఆంక్షల ప్రభావం భారతీయ విమానయాన సంస్థలపై పడుతోంది. ఈ క్రమంలో జులై 20 నాటికి దాదాపు 26వేల విమాన సర్వీసులు రద్దు అయినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు పౌరవిమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. “పశ్చిమాసియా సంక్షోభం అంతర్జాతీయ విమాన కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగించింది. అనేక విమానాలు రద్దు కావడం, దారి మళ్లించడం, ఆలస్యానికి కారణమైంది. ఫిబ్రవరి చివరలో మొదలైన గగనతల ఆంక్షలతో విమానాలు సుదూర మార్గాల్లో ప్రయాణించడం, తద్వారా ఇంధన వినియోగం పెరగడంతో విమానయాన సంస్థల నిర్వహణ ఖర్చులు కూడా పెరిగిపోయాయి. దారి మళ్లింపులు, ఆలస్యాలతోపాటు జులై 20 వరకు సుమారు 26వేల అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దు అయ్యాయి” అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విమానయాన సంస్థలు రెవెన్యూ నష్టాలను చవిచూస్తున్నాయని అన్నారు. అయినప్పటికీ, అవి కార్యకలాపాలు కొనసాగిస్తూనే.. నష్టాల ప్రభావాన్ని తగ్గించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాయన్నారు. మరోవైపు ప్రయాణికులు, సిబ్బంది, విమానాల భద్రతకు సంబంధించి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కు అనేక సూచనలు జారీ చేశామని కేంద్ర మంత్రి వెల్లడించారు.

# ‘నిరసనల్లో పాల్గొంటే డ్రగ్స్ కేసులో ఇరికిస్తా’..

## పోలీసు బెదిరింపు వీడియో వైరల్

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ చేస్తున్న ఆందోళనలకు మద్దతుగా దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ముంబయిలో నిరసన చేస్తున్న కొందరు విద్యార్థులను అదుపులోకి తీసుకున్న స్థానిక పోలీసులు.. వారిపై బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం. మళ్లీ నిరసనల్లో పాల్గొంటే డ్రగ్స్ కేసులో ఇరికిస్తానని ఓ పోలీసు అధికారి బెదిరించడం చర్చనీయాంశమైంది. “నిరసనల్లో మళ్లీ మీరు నాకు కనిపిస్తే డ్రగ్స్ కేసులో ఇరికిస్తా. అప్పుడు మీ జీవితం నాశనమవుతుంది. బెయిల్ కూడా రాదు. జైలులోనే మగ్గిపోవాల్సి ఉంటుంది” అని విద్యార్థులను ఉద్దేశిస్తూ పోలీసు అధికారి చెబుతున్నట్లు ఆ వీడియోలో ఉంది. ఇందుకు సంబంధించిన వీడియోను ముంబయి కాంగ్రెస్ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఈ వ్యవహారంపై



స్పందించిన నగర పోలీసులు దర్యాప్తునకు ఆదేశించారు. వాస్తవాలను ధ్రువీకరించుకున్న తర్వాత చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. విద్యార్థుల్ని బెదిరించిన సదరు అధికారిని ప్రస్తుతం పోస్టింగ్ నుంచి తప్పించినట్లు పోలీసులు ప్రకటించారు.

# భారత్‌ను వేలెత్తి చూపే ముందు.. ఇంట గెలవండి: పాక్‌కు చురకలు

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** ఐక్య రాజ్యసమితి వేదికగా పాకిస్థాన్‌కు భారత్ మరోసారి గట్టి కౌంటర్ ఇచ్చింది. ఉగ్రవాదాన్నే విదేశాంగ విధానంగా ఉపయోగిస్తున్న పాక్.. అసత్య ప్రచారంతో అంతర్జాతీయ వేదికను దుర్వినియోగం చేస్తోందని మండిపడింది. జమ్మూకశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టం చేసింది. సింధూ జలాల ఒప్పందంపై తమ విధానంలో ఎలాంటి మార్పూ లేదని భారత్ తేల్చిచెప్పింది.ఐరాస భద్రతా మండలిలో జరిగిన ఉన్నతస్థాయి చర్చ సందర్భంగా పాక్ కశ్మీర్ అంశాన్ని లేవనెత్తింది. దీంతో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్.. పాక్‌కు దీటుగా బదులిచ్చారు. ఈ చర్చలో ఇతర అంశాలను ప్రస్తావించడం తమ ఉద్దేశం కాదని, కానీ పాక్ తప్పుడు ప్రచారం చేసేందుకు ఈ వేదికను దుర్వినియోగం చేస్తుందంటూ మండిపడ్డారు. జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమనేది చట్టపరమైన వాస్తవమని గుర్తుచేశారు. కశ్మీర్‌కు సంబంధించి మిగిలి ఉన్న ఏకైక సమస్య పీవోకే మాత్రమేనని స్పష్టం చేశారు. సింధూ జలాల ఒప్పందంపై తమ విధానంలో ఎలాంటి మార్పు లేదని భారత ప్రతినిధి పునరుద్ఘాటించారు. పరస్పర విశ్వాసం,



సత్సంకల్పంతోనే ఇరు దేశాల మధ్య సహకారం సాధ్యమవుతుందని తెలిపారు. అయితే, సీమాంతర ఉగ్రదాడులకు పాల్పడుతోన్న పాక్.. ఇలాంటి ఒప్పందాల నుంచి ప్రయోజనాలను కోరుకోవడం సరికాదని దుయ్యబట్టారు. అంతర్జాతీయ వేదికలపై భారత్‌ను వేలెత్తి చూపుతూ నిరాధార ఆరోపణలు చేయడం మానుకొని.. పాక్ ముందుగా తమ దేశంలోని సమస్యలను పరిష్కరించుకోవాలని హరీశ్ హితవు పలికారు.

# ఏ సమస్యైనా పరిష్కారమయ్యే వరకు ఇన్‌ఛార్జ్ మంత్రులదే బాధ్యత

**విశ్వంభర, ఏపీ బ్యూరో:** రాష్ట్ర మంత్రివర్గం భేటీలో అజెండా అంశాలు ముగిశాక లోటు వర్షపాతం, ఎల్‌నినో ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించారు. వ్యవసాయ రంగం – జలవనరులు, పౌరసరఫరాలు, పరిశ్రమలు,పంచాయితీ రాజ్, ఆర్థిక శాఖలు సమన్వయంతో సంక్షోభాన్ని సవాలుగా తీసుకోవాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. తాగు నీటికి తొలి ప్రాధాన్యం, పశుగ్రాసానికి తదుపరి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు మంత్రులు వివరించాలన్నారు. ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఏ సమస్య ఎక్కడ తలెత్తినా ఇన్చార్జ్ మంత్రులు చొరవ తీసుకోవాలని సీఎం చంద్రబాబు మంత్రులకు సూచించారు. క్షేత్రస్థాయికి వెళ్లి సమస్య పరిష్కారం అయ్యేవరకు ఇన్చార్జ్ మంత్రులదే బాధ్యత అని స్పష్టం చేశారు. భోగాపురం ప్రధాని పర్యటన వివరాలు మంత్రులకు సీఎం వివరించారు. ఉత్తరాంధ్ర 6 జిల్లాల్లో ఫించన్లు ఒకరోజు ముందే ఇచ్చేసి ఆగస్టు 1న పూర్తి స్థాయిలో ప్రధానమంత్రి కార్యక్రమంలో నిమగ్నం కావాలని చంద్రబాబు ఆదేశించారు.దేశ వ్యాప్తంగా ఉన్న ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఈసారి క్లిష్ట పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం ఉందని మంత్రులతో సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. తాగునీటికి తీవ్ర సమస్య ఎదురు కావొచ్చన్నారు. క్లిష్ట పరిస్థితులపై రైతుల్లో చైతన్యవంతుల్ని చేసే బాధ్యత మంత్రులందరిపైనా ఉందని అభిప్రాయపడ్డారు. కృష్ణా, గుంటూరు డెల్టాలో వరి సాగు వేయకుండా రైతుల్ని చైతన్య పరచాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు పై రైతులకు అర్థమయ్యేలా వివరించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వెల్లడించారు.

**ఇళ్ల పట్టాలు పంపిణీకీ లోకేశ్ ప్రత్యేక చొరవ..**

జిల్లాల్లో ఇన్చార్జ్ మంత్రి – కలెక్టర్ కలిసి పనిచేస్తే మెజారిటీ సమస్యలు పరిష్కారం అయినట్లేనని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్ సమస్య పరిష్కారం అయినవి ఎమ్మెల్యేలు, మంత్రులు ఓనర్షిప్ తీసుకోవాలని సూచించారు. మంగళగిరిలో ఇళ్ల పట్టాలు పంపిణీకీ లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని గుర్తు చేశారు. గంటల తరబడి నిలబడి ప్రతి ఒక్కరికీ స్వయంగా ఇళ్ల పట్టా ఇచ్చారని అన్నారు. అన్ని చోట్లా ఎమ్మెల్యేలు మంత్రులు ఈ తరహా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. శాశ్వతమైన సమస్యల పరిష్కారానికి మంత్రులే బాధ్యత తీసుకోవాలన్నారు. రెండేళ్ల విజయాలపై మంత్రులు ప్రెస్?మీట్?లు పెట్టి చేతులు దులుపుకున్నారని అన్నారు. విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే అంశంలో వెనకబడ్డారన్నారు. పలాసలో రోడ్డు ప్రమాద ఘటన, టీటీడీ ఆంజనేయ స్వామి విగ్రహం చోరీ నిందితుల్ని సీసీ టీవీలు పట్టించిన తీరును సీఎం మంత్రులకు వివరించారు.

**అర్హులైన అందరికీ నేతన్న భరోసా..**

నేతన్న భరోసాపై మంత్రివర్గంలో చర్చకు వచ్చింది. అర్హులైన అందరికీ నేతన్న భరోసాను అందేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో కొంతమంది అనర్హులు నేతన్న భరోసా పొందినట్లు పలువురు మంత్రులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. అర్హులకు నష్టం జరగకుండా, నిజమైన నేతన్నలకు మేలు చేసే విధంగా పథకం అమలు కావాలని అధికారులను ఆదేశించారు. మెగా డీఎస్సీకి, దిల్లీ ఆందోళనలకు ముడిపెట్టాలని వైఎస్సార్సీపీ యత్నిస్తోందని మంత్రులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గొడ్డలి పార్టీ కుట్రల పట్ల పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లేని వివాదాలు సృష్టించటమే ఆ పార్టీ నైజం అని చంద్రబాబు మండిపడ్డారు.



అలాంటి చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని అన్నారు. ప్రో యాక్టివ్?గా మంత్రులు ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

**పుష్కరాల రోజు పోలవరం ప్రారంభోత్సవం!..**

ఆగస్టు చివరి వారంలో ఉద్యాన హబ్?ను మదనపల్లిలో ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆగస్టు మొదటి వారంలో ఉత్తరాంధ్రలో భోగాపురం ప్రారంభోత్సవం ఉంటే, చివర్లో రాయలసీమలో ఉద్యాన హబ్ ప్రారంభం ఉంటుందన్నారు. గోదావరి పుష్కరాల ప్రారంభ రోజునే పోలవరం ప్రాజెక్టు ప్రారంభోత్సవం చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తున్నామని సీఎం వ్యాఖ్యానించారు. ఉత్తరాంధ్ర ఆశలకు రెక్కలు కల్పించామన్నారు. వెనుకబాటుతనం అనేది ఇక ఆ ప్రాంతంలో ఉండరాదని సీఎం స్పష్టం చేశారు. రెండో త్రైమాసికంలోకి అడుగు పెట్టినందున శాఖల వారీగా సమీక్షలు చేసుకోవాలని సీఎం సూచించారు. కేంద్రం నుంచి శాఖల వారీగా రావాల్సిన నిధులపై దృష్టి సారించాలన్నారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధిలో మైలురాయి..**

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో మైలురాయిగా నిలిచే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్న వివరాలను సీఎం కేబినెట్‌కు వివరించారు. ఆగస్టు 1వ తేదీన జరిగే ఈ ప్రతిష్టాత్మక ప్రధానమంత్రి కార్యక్రమంలో మంత్రులు, అధికారులు పూర్తి స్థాయిలో నిమగ్నం కావాలని ఆదేశించారు. ఇందుకోసం ఉత్తరాంధ్రలోని 6 జిల్లాల్లో లబ్ధిదారులకు ఒక రోజు ముందే పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. వెనుకబాటుతనం అనే మాటే లేకుండా ఉత్తరాంధ్ర ప్రజల ఆశలకు రెక్కలు కల్పించేలా ఈ కార్యక్రమం విజయవంతం కావాలన్నారు.దేశంలో నదుల అనుసంధానానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సానుకూలంగా ఉందని, గంగా–కావేరి అనుసంధానంతో పాటు రాష్ట్రంలోని గోదావరి–బనకచర్ల నదుల అనుసంధానానికి దిల్లీ పెద్దల మద్దతు లభిస్తుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. కేంద్రం నుంచి వివిధ శాఖలకు రావలసిన నిధులపై మంత్రులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పొగాకు రైతుల సమస్యలపై కేబినెట్‌లో మూడు కీలక ప్రతిపాదనలు చర్చకు వచ్చాయని, రైతులకు రూ.60 వేల వడ్డీ లేని రుణం ఇచ్చే అంశం పరిశీలనలో ఉందన్నారు. పొగాకు బోర్డు నుంచి వయబిలిటీ గ్యాప్ ఫండ్ ఇచ్చేలా, గ్రేడింగ్ మార్పులపై కేంద్ర అధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ‘మమ్మీ, డాడీ సారీ.. నా ఇన్సూరెన్స్ డబ్బుతో వైద్యం చేయించుకోండి’

### సచివాలయంలో ఉరివేసుకుని ఏఎన్ఎం ఆత్మహత్య



**విశ్వంభర, చిల్లకూరు:** గ్రామ సచివాలయంలో ఉరివేసుకుని ఏఎన్ఎం ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం తొణుకుమాలలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓజిలి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన శ్రీపతి సాయి చందన ప్రియ (27) తొణుకుమాల సచివాలయం పరిధిలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఏడాది క్రితం బదిలీపై ఆమె ఇక్కడికి వచ్చారు. సచివాలయంలో ఎవరూ లేని సమయంలో తన చున్నీతో ఫ్యానుకు ఉరివేసుకుని మృతిచెందారు. వివిధ పనుల నిమిత్తం అక్కడికి వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు చేరుకుని పరిశీలించారు. ఘటనాస్థలంలో సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో “మమ్మీ, డాడీ.. మన్నించండి. నా చావుకు ఎవరూ కారణం కాదు. నేను రూ.60లక్షల ఇన్సూరెన్స్ చేశా ను. నా మరణానంతరం వచ్చే మొత్తంతో మీరు వైద్యం చేయించుకోండి” అని ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గూడూరులోని ప్రాంతీయ ఆస్పత్రికి తరలిం చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలి తండ్రి రమణయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చెన్నైలో వైద్యం చేయించుకుంటున్నారు. తల్లి సుకు మారి గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఆమెకూ ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే చందన ప్రియ మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నారు.

## మాజీ మంత్రి అప్పలరాజుకు 14 రోజుల రిమాండ్



**విశ్వంభర, పలాస:** వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కు పలాస కోర్టు 14రోజుల రిమాండ్ విధించింది. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. అప్పలరాజును శ్రీకాకుళం సమీపంలోని అంపోలు జైలుకు తరలించనున్నారు. ఈనెల 10నఅప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ బైక్‌తో ఢీకొట్టడంతో గొర్రెల కాపరి దానయ్య మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ కేసు నుంచి తన కుమారుణ్ని తప్పించేందుకు అప్పలరాజు కుట్ర పన్నినట్లు పోలీసులు నిర్ధరించారు. ఈ కేసులో ఆయన్ను ఏ3గా చేర్చారు. బుధవారం సాయంత్రం కాశీబుగ్గలో జీఎంఈ కాలనీలోని నివాసంలో అప్పలరాజును అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. గురువారం ఆయనకు పలాస సీహెచ్‌సీలో వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం కోర్టుకు తీసుకెళ్లారు.

# పగలు రెక్కీ, రాత్రి దొంగతనం..కిలాడీ దంపతుల ఆటకట్టించిన పోలీసులు..

**విశ్వంభర, ఏపీ బ్యూరో:** పగలు ఆటోలో భార్యతో కలిసి చక్కర్లు కొడతాడు. తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తిస్తాడు. రాత్రి కాగానే ముఠాతో కలిసి గుట్టుచప్పుడు కాకుండా దొంగతనానికి దిగుతాడు. ఏకంగా వందకు పైగా కేసుల్లో నిందితుడిగా ఉన్న ఆ కిలాడీ దొంగ, అతడి ముఠా ఆటను పోలీసులు ఎట్టకేలకు కట్టించారు. దొంగతనాలకు పాల్పడుతున్న కిలాడీ దంపతులతో పాటు వారి అనుచరుడిని విజయవాడ నున్న పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేశారు. విశాఖపట్నం జిల్లా గాజువాకకు చెందిన తోట శివకుమార్, తోట వరలక్ష్మి భార్యాభర్తలు. వీరు విజయవాడ రాజీవ్ నగర్‌కు చెందిన తుమ్మల మనోజ్ కుమార్‌తో కలిసి ఓ ముఠాగా ఏర్పడ్డారు. పగటి పూట శివకుమార్ తన భార్య వరలక్ష్మితో కలిసి ఆటోలో వివిధ కాలనీల్లో తిరుగుతాడు. తాళం వేసి ఉన్న ఇళ్లను జాగ్రత్తగా గమనించి రెక్కీ నిర్వహిస్తాడు. ఆ తర్వాత రాత్రి వేళల్లో తన అనుచరుడు మనోజ్ కుమార్‌తో కలిసి వెళ్లి దొంగతనాలకు పాల్పడతాడు. వరుస చోరీల ఫిర్యాదుల నేపథ్యంలో నున్న పోలీసులు రంగంలోకి దిగారు. పక్కా ప్రణాళికతో దర్యాప్తు చేపట్టి ఈ ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు తోట శివకుమార్ పెద్ద కరుడుగట్టిన నేరస్థుడు. దర్యాప్తులో పోలీసులకే మైండ్ బ్లాక్ అయ్యే నిజాలు వెలుగులోకి వచ్చాయి. అతడిపై ఇప్పటికే వివిధ పోలీస్ స్టేషన్లలో 100కు పైగా చోరీ కేసులు నమోదయ్యాయి. ఈ దొంగతనం కేసుల్లో జైలుకు వెళ్లిన సమయంలోనూ అతడు బుద్ధి మార్చుకోలేదు. పైగా అక్కడే కొందరు యువకులతో పరిచయాలు పెంచుకున్నాడు. ఆ యువకులకు దొంగతనాలు ఎలా చేయాలో జైల్లోనే ప్రత్యేక తర్ఫీదు (శిక్షణ) ఇచ్చాడు. జైలు నుంచి బయటకు రాగానే వారికి కూడా తన ముఠాలో చేర్చుకుని దొంగతనాలకు ఉసిగొల్పుతున్నాడు. ఈ కేసులో అరెస్టైన ముగ్గురు కూడా పాత నేరస్థులేనని పోలీసులు వివరించారు. విజయవాడ నున్న పోలీస్ స్టేషన్ ఆవరణలో వెస్ట్ జోన్ డీసీపీ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా పట్టుబడిన నిందితులను, వారి వద్ద నుంచి రికవరీ చేసిన ఆభరణాలను ఆయన మీడియాకు చూపించారు. విజయవాడ నున్న పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు వరుస చోరీలతో పాటు, ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులో జరిగిన మరో చోరీ కేసును ఛేదించినట్లు డీసీపీ తెలిపారు. పట్టుబడిన నిందితుల వద్ద నుంచి సుమారు రూ.15 లక్షల విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఇందులో 54 గ్రాముల బంగారు ఆభరణాలు, 2.8 కిలోల వెండి వస్తువులు ఉన్నట్లు వివరించారు. ఈ సమావేశంలో నార్త్ డివిజన్ ఏసీపీ సత్యానందం, నున్న సీఐ అలీ తదితరులు పాల్గొన్నారు.

## ‘తల్లికి వందనం’ డబ్బుల కోసం.. పోస్టాఫీస్ వద్ద మహిళల క్యూ



**విశ్వంభర, ఏపీ బ్యూరో:** అల్పాదాయ కుటుంబాల్లోని పిల్లల చదువును ప్రోత్సహిం చేలా ఏపీ ప్రభుత్వం ‘తల్లికి వందనం’ నిధులు విడుదల చేసింది. విద్యార్థు ల తల్లుల ఖాతాల్లో నగదు జమచేసింది. ఈ నేపథ్యంలో కడప లోని ప్రధాన పోస్టాఫీస్ వద్ద విద్యార్థుల తల్లులు బారులు తీరారు. డబ్బులు తీసుకునేందుకు భారీగా తరలివచ్చిన మహిళలు గంటల తరబడి క్యూలో వేచి ఉన్నారు. వారి కోసం కార్యాలయం వద్ద అధికారులు నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసి రోజుకు రూ.25 వేల చొప్పున నగదు ఇస్తున్నారు. లబ్ధిదారులు సమీపంలోని ఏ పోస్టాఫీస్‌లోనైనా డబ్బులు తీసుకోవచ్చని, నగదు పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు.


## మిషన్ శక్తిశాట్‌కు ఎంపికైన టెన్త్ స్టూడెంట్ : అభినందించిన పవన్ కల్యాణ్

**విశ్వంభర, ఏపీ బ్యూరో:**



పేదరికం విద్యార్థుల ప్రతిభకు ఏనాడూ అడ్డుకాదని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఓ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని మరోసారి నిరూపించింది. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దు కుంటున్న ఆల్–గర్ల్స్ గ్లోబల్ మూన్ మిషన్ ‘మిషన్ శక్తిశాట్’ కు ఎంపికై ఏపీకి చెందిన కందుల జెస్సీ చరిత్ర సృష్టించింది. 108 దేశాల నుంచి సుమారు 12,000 మంది బాలికలు పోటీ పడగా.. భారత్ నుంచి ఎంపికైన 20 మందిలో స్థానం పొందిన ఏకైక తెలుగు విద్యార్థినిగా జెస్సీ నిలిచింది. ఈ అద్భుత ఘనత సాధించిన కందుల జెస్సీని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థిని జెస్సీ పట్టుదలను, కృషిని ఆయన కొనియాడారు. “ప్రభుత్వ పాఠశాల తరగతి గది నుండి చంద్రుని యాత్ర అంచు వరకు సాగిన నీ ప్రయాణం అద్భుతం” అని కితాబు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఒక ప్రభుత్వ పాఠశాల స్థాయి నుంచి అంతర్జాతీయ అంతరిక్ష ప్రాజెక్టుకు ఎంపిక కావడం రాష్ట్రానికే గర్వకారణమని, ఎందరో విద్యార్థులకు జెస్సీ స్ఫూర్తిగా నిలిచిందని పేర్కొన్నారు.

## తమ్మినేని ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్




**విశ్వంభర, అమరావతి:** మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టు తీర్పురిజర్వ్ చేసింది.శ్రీకాకుళంలో రూ.4కోట్ల విలువైన భూకబ్జా కుట్ర కేసులో తమ్మినేని, ఆయన భార్య వాణి, కుమారుడు వెంకట శ్రీరామ చిరంజీవి నాగ్ నిందితులుగా ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. తమ్మినేని తరపున న్యాయవాది హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్లపై ఇరువర్గాల వాదనలు ముగిశాయి. ఈ అంశంపై ఈనెల 27న హైకోర్టు తీర్పు వెలువరించనుంది.

## రూ.679 కోట్లతో కదిరి- ముదిగుబ్బ మధ్య ఎన్‌హెచ్ 42 విస్తరణకు ఆమోదం



**విశ్వంభర, ఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్ శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో ముదిగుబ్బ–కదిరి మధ్యనున్న ఎన్‌హెచ్–42 రహదారిని రూ.679.71 కోట్లతో నాలుగు వరుసలుగా విస్తరించడానికి ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. గురువారం ఈమేరకు ‘ఎక్స్’లో ఒక ప్రకటన చేశారు. ఈ విస్తరణతో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు, కర్ణాటకల మధ్య రాకపోకలు వేగం పుంజుకుంటాయని చెప్పారు. బెంగళూరు–విజయ వాడ– కోల్‌కతా ఎక్స్‌ప్రెస్‌వే, తిరుపతి, చెన్నైల మధ్య రాకపోకల సమయం తగ్గి ప్రయాణం మరింత సులభమవుతుందని పేర్కొన్నారు. ఈ రహదారి విస్తరణతో ట్రాఫిక్ తగ్గి ప్రాంతీయంగా సరుకు రవాణా బలోపేతమవుతుందని, తద్వారా ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ మార్గంలో ప్రధాన నాలుగు వరుసల కారేజ్‌వే, సర్వీస్‌రోడ్లు, ఒక ఫ్లైఓవర్, ఒక వెహికిల్ అండర్‌పాస్ కం రోడ్డు ఓవర్ బ్రిడ్జి, ఒక ప్రధాన బ్రిడ్జి వస్తాయని చెప్పారు.

## పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా.. నేరస్థులతో కఠినంగా ఉండాలి: చంద్రబాబు

విశ్వంభర, విజయవాడ: పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా.. నేరస్థులతో కఠినంగా వ్యవహరించాలని సీఎం చంద్రబాబు అన్నారు. ఏపీ పోలీస్ రిట్రీట్ 2026– ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్స్‌కు ఆయన హాజరై మాట్లాడారు. అంతకుముందు వివిధ అంశాలపై తాము రూపొందించిన ప్రజంటేషన్లను ఐపీఎస్ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. “గతంతో పోలిస్తే నేరాల తీరు మారింది. సోషల్ మీడియా వేదికగా సమాజంలో అశాంతిని రెచ్చగొట్టేలా కొందరు వ్యవహరిస్తున్నారు. నేరాలను కట్టడి చేయడంతో పాటు తప్పులు చేసిన వారికి శిక్ష పడేలా చేయాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీస్ వ్యవస్థను రీస్ట్రక్చర్ చేయాల్సిన అవసరం ఏ మేరకు ఉందో పరిశీలించాలి. టెక్నాలజీని వినియోగించడం ద్వారా చాలా తక్కువ మందితో ఆపరేషన్ సిందూర్‌ను మన సైన్యం సక్సెస్ చేసింది. తిరుమల మెట్ల దారిలో అపహరణకు గురైన ఆంజనేయస్వామి విగ్రహాన్ని టెక్నాలజీ సాయంతో తక్కువ సమయంలో ట్రేస్ చేయగలిగాం. ఇలాంటి ఘటనల్లో సరైన చర్యలు తీసుకోకుంటే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు కొన్ని పార్టీలు ఏకంగా నేరాలు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. గంజాయిని చాలా వరకు కట్టడి చేశాం.. ఇంకా చేయాలి. డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలి. డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ విభాగాలను మరింత బలోపేతం చేయాలి. రౌడీయిజాన్ని, ఫ్యాక్షనిజాన్ని కంట్రోల్ చేశాం. పోలీసింగ్‌లో ఏఐని వినియోగించాలి. అవసరమైన మేరకు పోలీసులకు సర్టిఫికేషన్ కోర్సులు ప్రవేశపెట్టాలి. వివిధ రకాల నేరాలను కట్టడి చేసే విషయంలో నైపుణ్యం పెంచేలా శిక్షణ ఇవ్వాలి” అని చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి అనిత, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల నిర్వహణకు రూ.50కోట్లు.. ఏపీ క్యాబినెట్ ఆమోదం



**విశ్వంభర, అమరావతి:** గోదావరి పుష్కరాల సమర్థ నిర్వహణకు రూ.50 కోట్లు మంజూరుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ‘నేతన్నల సేవలో’ పథకం అమలుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసిందని చెప్పారు. ఈ పథకం కింద చేనేత కుటుంబాలకు ఏటా రూ.25వేల ఆర్థికసాయం అందించనున్నట్లు వివరించారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలను మీడియాకు ఆయన వెల్లడించారు. “రాష్ట్రంలో మొదటి ప్రైవేటు మహిళా యూనివర్సిటీ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. భీమవరంలో విష్ణు ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ పేరిట దీన్ని ఏర్పాటు చేయనున్నారు. శ్రీకాకుళంలో బ్రహ్మకుమారీస్ సంస్థకు మున్సిపల్ స్థలం లీజు కొనసాగింపునకు మంత్రివర్గం అంగీకారం తెలిపింది. అగ్నిమాపక సేవల విస్తరణ పనులకు ఆమోదముద్ర వేసింది. ఏపీ మార్క్‌ఫెడ్‌కు సెంట్రల్ బ్యాంక్ నుంచి రూ.300 కోట్ల రుణానికి ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వివిధ సంస్థలకు భూ కేటాయింపులకు మంత్రివర్గం అంగీకారం తెలిపింది” అని పార్థసారథి తెలిపారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే: ఏపీ రైతు సంఘం




విశ్వంభర, ఏలూరు ప్రతినిధి: నీట్ పేపర్ లీకేజ్ బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని 24న విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరగనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసం స్థల బంద్‌కు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం అన్నే భవనంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ 2014 నుండి దేశవ్యాప్తంగా 152 పరీక్షా పేపర్లు లీక్ అయ్యాయని చెప్పారు. నీట్ పేపర్ లీకేజ్ కారణంగా దేశవ్యాప్తంగా 22 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు.నీట్ పేపర్ లీకేజ్ కు ప్రభుత్వం బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, కేంద్ర ప్రభుత్వం జవాబుదారీతనంగా వ్యవహరించాలని గత నెల రోజులుగా ఆందోళనలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయని చెప్పారు. పర్యావరణ వేత్త సోనం వాంగ్ చుక్ నేటికి హాస్పిటల్లో ఆమరణదీక్ష కొనసాగిస్తూన్నట్లు ప్రకటించారన్నారు 20వ తేదీ లక్షలాది మంది విద్యార్థుల శాంతియుతంగా నిర్వహించిన పార్లమెంట్ మార్చ్ విద్యా వ్యవస్థ పరిరక్షణ కోసం కదం తొక్కిన విద్యార్థి, యువతపైన అత్యంత అమానవీయంగా లాఠీఛార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించి వేలాది మంది విద్యార్థులపై ఢిల్లీ పోలీలు వ్యవహరించిన తీరు అత్యంత కిరాతకం అని విమర్శించారు.ప్రజాస్వామ్యంను కాపాడాలని, దేశ విద్యావ్యవస్థలో సమూలమార్పులు కావాలని, నీట్ పరీక్షా విధానం రద్దుచేసి రాష్ట్రాల వారీగా మెడికల్ ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించాలిని, నీట్ తదితర పరీక్షా పత్రాల లీకేజ్ కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 24వ తేదీన తలపెట్టిన దేశ వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు రైతు సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## దాచేపల్లిలో విషాదం.. గోడ కూలి తాత, మనవడు మృతి

**విశ్వంభర, దాచేపల్లి:** పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. పాత ఇంటిని కూల్చుతుండగా మెట్లు, గోడ ఒక్కసారిగా కూలిపోవడంతో గొగుల శ్రీను అలియాస్ రాజాబాబు (50), ఆయన 4 ఏళ్ల మనవడు గొగుల యశస్విని నికాంత్ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న దాచేపల్లి సీఐ ఖాజావలి ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తిరుమలలో ఆంజనేయస్వామి విగ్రహం చోరీ.. నిందితుడు అరెస్ట్



**విశ్వంభర,తిరుమల:** తిరుమలలో ఆంజనేయ స్వామి విగ్రహంచోరీ చేసిన విషయం తెలిసిందే. అయితే నిందితుడిని పోలీసులు గుర్తించారు. అనంతరం అరెస్ట్ చేశారు. విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గం టి. నగరపాలెం గ్రామానికి చెందిన పొట్నూరు యశ్వంత్ అనే వ్యక్తి చోరీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. అసలు హనుమాన్ విగ్రహాన్ని యశ్వంత్ ఎందుకు చోరీ చేశారు. దీని వెనుక ఎవరైనా ప్రమేయం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని స్పష్టం చేశారు. అయితే పలువురు రాజకీయ నాయకులతో దిగిన యశ్వంత్ ఫొటోలు చర్చగా మారాయి. మరోవైపు ఆంజనేయ విగ్రహాన్ని తిరుమలలో పున:ప్రతిష్టించారు. తిరుమల ఘాట్ రోడ్ 7వ మైలు దగ్గర ఉన్న ఈ విగ్రహాన్ని యశ్వంత్ చోరీ చేశారు. దీంతో పోలీసులు 14 గంటల్లోనే విగ్రహాన్ని గుర్తించారు. విగ్రహం చోరీకి గురైన స్థలంలో అర్చకులు పుణ్యావాచనం, జల సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్చారణ మధ్య ఆంజనేయ స్వామి విగ్రహాన్ని పున:ప్రతిష్టించారు.

## కొత్త జిల్లాలకు ఇంచార్జి మంత్రుల నియామకం

**విశ్వంభర, ఏపీ బ్యూరో:** రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాలకు ఇన్ చార్జ్ మంత్రులను నియమిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పరిపాలనను మరింత వేగవంతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు సమీక్షించడానికి ఈ నియామకాలు చేపట్టింది. జిల్లాల వారీగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ బాధ్యతలనూ మంత్రులకు అప్పగించింది. పోలవరం జిల్లా ఇంచార్జి మంత్రి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని నియమించింది. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం , జిల్లాలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ఆమె ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించింది.

# ప్రధాని మోడీ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి

విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

ఈ ఉద్యమం ఇంతటితో ఆగదు.. రాహుల్ గాంధీ కి మద్దతుగా రోజుకో రీతిలో నిరసన చేపడుతాం : జగ్గారెడ్డి



విశ్వంభర, సంగారెడ్డి: ప్రధాని నరేంద్ర మోడీ విద్యార్థులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన నిరసనకు సంఘీభావంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డిలో సుమారు వెయ్యిమందితో భారీ పాదయాత్ర నిర్వహించారు. క్లాసిక్ గార్డెన్స్ నుంచి గంజ్ మైదాన్ వరకు సాగిన ఈ పాదయాత్రలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్గారెడ్డి మాట్లాడుతూ, బీజేపీ నాయకుల పిల్లలు ఎవరూ నీట్ పరీక్ష రాయలేదేమో.. అందుకే పేపర్ లీకేజీతో నష్టపోయిన విద్యార్థుల బాధ వారికి అర్థం కావడం లేదు” అని విమర్శించారు. పేపర్ లీకేజీ ప్రభావం ఎంత తీవ్రంగా ఉందో నీట్ పరీక్ష రాసిన విద్యార్థుల తల్లిదండ్రులను అడిగితే తెలుస్తుందని అన్నారు. సంగారెడ్డికి చెందిన ఓ విద్యార్థిని ఉదాహరణను ప్రస్తావిస్తూ, మొదటిసారి నీట్ పరీక్షలో 444 మార్కులు సాధించిన ఆమె, రెండోసారి పరీక్ష రాయగా 386 మార్కులకు పడిపోయి అర్హత కోల్పోయిందని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఈ పరిస్థితికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తూ, ప్రధాని నరేంద్ర మోడీ దేశ విద్యార్థులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇది ఒక్కరోజు నిరసన కాదని, రాహుల్ గాంధీకి మద్దతుగా సంగారెడ్డిలో ప్రతిరోజూ కొత్త రూపంలో ఆందోళనలు కొనసాగిస్తామని జగ్గారెడ్డి ప్రకటించారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు దేశం కోసం ప్రాణత్యాగం చేశారని పేర్కొంటూ, “బీజేపీలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన నాయకుడు ఎవరైనా ఉన్నారా?” అని ప్రశ్నించారు. అలాగే, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పలుమార్లు రాహుల్ గాంధీని ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టాలని కోరినా ఆయన అంగీకరించలేదని, సోనియా గాంధీ ప్రధానమంత్రి పదవిని త్యాగం చేసి మన్మోహన్ సింగ్‌ను ఆ పదవికి ఎంపిక చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

# నీట్ సాకుగా చూపుతూ అల్లర్లు సృష్టిస్తున్నారు

బిజెపి జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు




విశ్వంభర, ఇనుగుర్తి: బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, మానుకోట ఇంచార్జ్ కళ్యాణ్ నాయక్ ప్రభృతులను రాష్ట్ర ప్రభుత్వం చేసిన అక్రమ అరెస్టులకు నిరసనగా మండల కేంద్రం ఇనుగుర్తి లో బిజెపి మండల శాఖ అధ్యక్షులు దుంపల సందీప్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు గురువారం ధర్నా రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోలో బిజెపి జిల్లా అధ్యక్షులు వల్లబు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.ప్రధాన రహదారిపై బిజెపి శ్రేణులు బైఠాయించి రాహుల్ గాంధీకి, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో వాహన ప్రయాణికులకు అంతరాయం కలగడంతో స్థానిక ఎస్సై కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు జోక్యం చేసుకొని బిజెపి నాయకులతో మాట్లాడి ఆందోళన విరమింప చేశారు. అంతకు మునుపు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు వల్లబు వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ సీజేపీ, కాంగ్రెస్ లు నీట్ లీక్ ను సాకుగా చూపిస్తూ దేశంలో అల్లర్లు సృష్టించి కేంద్ర ప్రభుత్వాన్ని అస్థిర పరచాలని కుట్రపన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నీట్ పరీక్షా లీకైన తర్వాత బాధ్యులను జైల్లో వేసి మళ్లీ పరీక్ష నిర్వహించి ఫలితాలు సైతం వచ్చిన అనంతరం చాలా రోజులకు నీట్ పై లొల్లులు సృష్టించడ ˇమేంటన్నారు. పార్లమెంటు,ప్రధాని నివాసం ముందు ధర్నాలు నిర్వహించడం ఇందులో భాగమేనని దుయ్యబట్టారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతూ ప్రపంచ స్థాయిలో కీర్తి ఇనుమడించడం జీర్ణించుకోలేని శక్తులు కుయుక్తులు పన్ని అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం బిజెపి చీఫ్ రామచంద్రరావును, మానుకోట ఇంచార్జ్ కళ్యాణ్ నాయక్ తో పాటు పలువురు నేతలను అరెస్టు చేయడం దారుణం అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర,జిల్లా, మండల, వివిధ గ్రామాల నాయకులు కార్య కర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రామలింగేశ్వర స్వామి దేవాలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



విశ్వంభర, పరిగి: కుల్కచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామంలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్‌గా మైపాల్ రెడ్డి నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ మైపాల్ రెడ్డి పాలకవర్గ సభ్యులకు ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, దేవాలయ అభివృద్ధికి అంకితభావంతో సేవలందించాలని ఆకాంక్షించారు.పాంబండ రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ..ఆధ్యాత్మికత మనిషికి మానసిక ప్రశాంతతను కలిగిస్తుందని అన్నారు. దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు సహాయ సహకారాలు అందిస్తూ, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పరిగి నియోజకవర్గంలోని అన్ని దేవాలయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు.కుల్కచర్ల మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల పిఏసిఎస్ చైర్మన్ భీమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గోపాల్, చౌడపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ సత్య హరి చందర్, సర్పంచ్ శ్రీనివాస్, స్థానిక కాంగ్రెస్ నాయకులు అంజలయ్య గౌడ్, శివరాం నాయక్, రవీందర్ నాయక్, నరేష్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు, పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



విశ్వంభర, పెద్దపల్లి : విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు చదవడం, రాయడం నేర్పించాలని పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ సేవలు నాణ్యతప్రమాణాలు, జవాబుదారీతనం పెంపుపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు గురువారం పెద్దపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి, రాగినేడు, బొంపల్లి గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు చదవడం, రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలు అందేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అంగన్‌వాడీల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సకాలంలో అందించాలని సూచించారు.

పీహెచ్‌సీలలో వైద్య సేవల నాణ్యతను మెరుగుపరచాలని, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు నాణ్యతతో అందేలా పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. భూముల రీ-సర్వేను పారదర్శకంగా నిర్వహించడంతో పాటు రెవెన్యూ శాఖ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాగినేడు పిహెచ్ సీ డాక్టర్ శ్రావణ్ కుమార్ తో పాటు ఆయా గ్రామాల సర్పంచ్ లు , హెచ్ ఎంలు, అంగన్ వాడీ టీచర్ లు, డాక్టర్ ల బృందం పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



విశ్వంభర, కేసముద్రం: ఢిల్లీలో విద్యార్థుల ముసుగులో హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కేసముద్రం మండల బీజేపీ ఆధ్వర్యంలో పులే సెంటర్‌లో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడుతున్న పోలీసులపై దాడులు చేయడం హేయమైన చర్య అని ఖండించారు. విద్యార్థులను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించడం సరికాదని, హింసకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మండల అధ్యక్షుడు ఉప్పునుతల రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్, లెఫ్ట్, ఇతర విపక్షాల రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండల బీజేపీ నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎల్ నినో, నర్సరీ చట్టంపై అవగాహన



విశ్వంభర, మహబూబాబాద్: కురవి మండల రైతు వేదికలో జిల్లా వ్యాప్తంగా ఉన్న నర్సరీదారులకు ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఎల్ నినో పరిస్థితులు, నర్సరీ చట్టం, నాణ్యమైన నారు ఉత్పత్తిపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న మాట్లాడుతూ ఎల్ నినో పరిస్థితులకు అనుగుణంగా స్వల్పకాలిక రకాలను ఎంపిక చేసి, లైసెన్స్ పొందిన నర్సరీల్లోనే నాణ్యమైన నారును పెంచాలని సూచించారు. నర్సరీ చట్టాన్ని ఉల్లంఘించి నకిలీ విత్తనాలు, నారు విక్రయించే వారిపై పీడీ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధాన శాస్త్రవేత్త డా. ఎ. ప్రశాంత్, ఉద్యాన శాస్త్రవేత్త ఎల్. సుహాసిని భూసార పరీక్షలు, నీటి సంరక్షణ, షేడ్‌నెట్, మల్చింగ్, చీడపీడలను తట్టుకునే కూరగాయలు, పూల పంటలు, నిమ్మగడ్డి సాగుతో పాటు మార్కెట్ డిమాండ్ ఉన్న ఉద్యాన పంటల సాగుపై రైతులకు సూచనలు చేశారు. ఉద్యాన శాఖ అందిస్తున్న ప్లాస్టిక్ మల్చింగ్, బిందు సేద్యం, నీటి కుంటలు, కూరగాయల పందిర్లపై రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, నర్సరీదారులు పాల్గొన్నారు.

## ఆర్మీ భూమి ఆక్రమణపై హైడ్రాకు ఫిర్యాదు




విశ్వంభర, హైదరాబాదు : ఆర్మీకి చెందిన భూమిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారాణి, వెంటనే నిర్మాణాలను నిలిపివేసి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని రక్షణ శాఖ అధికారులు హైడ్రాకు విజ్ఞప్తి చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలోని జీఎల్ఆర్ సర్వే నంబర్ 507లో ఉన్న ఆర్మీకి చెందిన ఏ-1 భూమిలో అక్రమ ఆక్రమణలు జరుగుతున్నాయని ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ జై సింగ్ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు హైదరాబాదు హైడ్రా కార్యాలయంలో గురువారం వినతిపత్రం సమర్పించారు. భూమిని ఆక్రమించి అనుమతులు లేకుండానే జి ప్లస్ 2 భవన నిర్మాణం చేపట్టారని ఫిర్యా దులో పేర్కొన్నారు. వినతిపత్రాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి ఆక్రమణలు నిర్ధారణ అయితే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో: ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ జై సింగ్ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హైడ్రా ఏసీపీ ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



విశ్వంభర, జనగాం: నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ దేవరుప్పుల మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్‌తో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పేపర్ లీక్‌కు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులపై పోలీసుల చర్యలను ఖండించారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## తక్షణమే నవాబుపేట రిజర్వాయర్‌ను నింపాలి :పల్లా సుందర్ రాంరెడ్డి



విశ్వంభర, జనగామ: దేవరుప్పుల మండల ప్రజల సాగు,తాగునీటి కష్టాలను వెంటనే తీర్చాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వల్లో కానరాని సాగునీరు అడుగంటిన బోర్లు ఆందోళన చెందుతున్న రైతన్నలని,స్టేషన్ఘన్పూర్ రిజర్వాయర్ నవాబ్ పేట రిజర్వాయర్ నింపి కాలువకు నీళ్లు విడుదల చేసి సాగు,తాగు నీటిని తక్షణమే సరఫరా చేయాలని,నవాబు పేట రిజర్వాయర్ ఖాళీగా ఉందని,ఇంకా ఆలస్యం చేయకుండా వెంటనే నవాబుపేట రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపి దేవరుప్పుల మండలంలో ఉన్నటువంటి కాలువలను చెక్ డ్యాములను చెరువులను కుంటలను నింపి ప్రజలకు సాగునీరు,తాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి: ఎంఈఓ రాందాస్



విశ్వంభర,నెల్లికుదురు: బోధన నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల శిక్షణ ను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి ఆంగోత్ రాందాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి ఇన్ సర్వీస్ టీచర్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధన వినూత్న పద్ధతిలో చేపట్టినప్పుడు విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుందని పాఠ్యాంశంపై విశ్లేషణ శక్తి సామర్థ్యం వృద్ధి చెందుతుందని తెలిపారు.మండల వ్యాప్తంగా ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న 120 మంది సెకండరీ గ్రేడ్ టీచర్స్ లకు రెండు విడతలుగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.అనంతరం అర్పిలు చంద్రశేఖర్, లక్ష్మినారాయణ, ఫణీంద్ర, రాజు,సుధాకర్ లు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు వాణిశ్రీ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల ఎం ఎస్ కోఆర్డినేటర్ ఎం సుధాకర్ ఐ ఈ ఆర్ పి పి యాకయ్య సీఆర్పీలు జె. కవిత బి. వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## క్షయవ్యాధి నిర్మూలనకు సమన్వయంతో పనిచేయాలి: డీఎంహెచ్ఓ



విశ్వంభర, మహబూబాబాద్: జిల్లాలో క్షయవ్యాధి (టీబీ) నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బి. రవి రాథోడ్ సూచించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో టీబీ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. టీబీ పూర్తిగా నయం చేయగల వ్యాధి అని, లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించుకుని ఉచిత చికిత్సను పూర్తిగా తీసుకుంటే కోలుకోవచ్చని తెలిపారు. రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ అనుమానితులను సకాలంలో గుర్తించడం, నిర్ధారణైన వారికి వెంటనే చికిత్స ప్రారంభించడం, చికిత్స పూర్తయ్యేలా పర్యవేక్షించడం, ఇంటింటి సర్వేలు, కాంటాక్ట్ ట్రేసింగ్, నిక్షయ్ పథకం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ ఆసుపత్రులు గుర్తించిన టీబీ కేసులను కూడా తప్పనిసరిగా నిక్షయ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా టీబీ అధికారి డా. అర్జున్‌తో పాటు టీబీ సిబ్బంది పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ ఆందోళన



విశ్వంభర, రామన్నపేట: నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలో నిరసన తెలుపుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో కాంగ్రెస్ నాయకులు శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న జగన్మోహన్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు. నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు మద్దతుగా నిరసన తెలిపిన రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ జమీరుద్దీన్, డీసీసీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రధాని నివాసం ముట్టడి ఘటనను ఖండిస్తూ బీజేపీ నిరసన



విశ్వంభర, కమాన్‌పూర్ : ప్రధాని నరేంద్ర మోదీ నివాసాన్ని కాంగ్రెస్ శ్రేణులు ముట్టడించే ప్రయత్నాన్ని నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కమాన్‌పూర్ మండలశాఖ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కొయ్యడ సతీష్ మాట్లాడుతూ, దేశ ప్రజల మద్దతుతో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. అలాంటి సమయంలో ప్రధాని నివాసాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు ప్రయత్నించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. దేశ రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు సహజమే అయినప్పటికీ, నిరసన కార్యక్రమాలు రాజ్యాంగబద్ధమైన పరిమితుల్లోనే జరగాలని పేర్కొన్నారు. ప్రధాని నివాసాన్ని లక్ష్యంగా చేసుకుని ఆందోళనలు చేపట్టడం తగదని అభిప్రాయపడ్డారు. ఇటువంటి చర్యలను ప్రజలు సమర్థించరని, భవిష్యత్తులో కూడా బీజేపీ ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే స్పందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము, సీనియర్ నాయకులు మట్ట శంకర్, జంగపల్లి అజయ్, మల్లారపు అరుణ్, మండల ప్రధాన కార్యదర్శి పంతకాని విశ్వతేజ్, పెద్దపల్లి శ్యాంసుందర్, మండల ఉపాధ్యక్షుడు పిల్లి చంద్రయ్య, సదానందం, కార్యదర్శి అగ్గి శ్రావణ్, సంపత్, శ్రీమన్, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.



నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీ వేదికగా విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి రోజు రోజుకు మద్దతు పెరుగుతోంది. ఈ క్రమంలోనే తాజాగా ఈ ఉద్యమానికి తన మద్దతును తెలుపుతూ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ షేర్ చేసింది బాలీవుడ్ నటి ఆలియా భట్. 'గత కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలతో నా హృదయం ముక్కలైంది.. అదే సమయంలో విద్యార్థులు చూపిస్తున్న ధైర్యం మళ్లీ ఆశను కలిగించింది. ప్రతి విద్యార్థి వెనుక కుటుంబం కలలు, ఎన్నో త్యాగాలు, భవిష్యత్తుపై ఆశలు దాగి ఉంటాయి' అంటూ భావోద్వేగ నోట్ షేర్ చేసిన ఆలియా.. దేశ భవిష్యత్తును నిర్మించబోయే యువత గొంతును వినాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది.. 'జై హింద్.. విద్యార్థుల కోసం.. విద్యార్థుల చేత' అంటూ తన అభిప్రాయాన్ని పంచుకుంది.

# నా హృదయం ముక్కలైంది..



# ఈ సినిమా పెద్ద సక్సెస్ అవుతుంది..

హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా, రవి నంబూరి దర్శకత్వంలో తెరకెక్కిన 'చెన్నై లవ్ స్టోరీ' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమైంది. ఈ మేరకు తాజాగా ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ.. 'చెన్నై లవ్ స్టోరీ టైటిల్ వినగానే నాకు చెన్నైతో ఉన్న అనుబంధం, ప్రేమ గుర్తుకువచ్చాయి. ఎస్ కేఎన్, సాయి రాజేష్, కిరణ్ అబ్బవరం, మణిశర్మ.. ఇలా వీళ్లంతా నా మీద పెంచుకున్న అభిమానం, ప్రేమ నన్ను ఈ వేదిక మీద నిలబడేలా చేశాయి. నా అభిమానులను ఇష్టపడతాను.నా అభిమానులు ఎదిగితే ప్రాణప్రదంగా చూసుకుంటాను. నన్ను అభిమానించడమే కాదు మీరు ప్రయోజకులై, మీ కుటుంబానికి, సమాజానికి పేరు తీసుకొచ్చి, అందరూ గర్వపడేలా చేస్తే అదే నాకు నిజమైన సంతోషం. అదే నాపై మీరు చూపించే నిజమైన ప్రేమగా భావిస్తాను. అలాంటి అభిమానులను చూసి ముచ్చటపడుతుంటాను. ఈ వేదిక మీద అలాంటి అభిమానులను చూసి ఆనందానికి లోనవుతున్నాను. ఏదో పిలిచారు కదా అని ఈవెంట్‌కు వచ్చి విశెస్ అందించి వెళ్లిపోవడం కాదు మీ అభిమానం తాలుక వైబ్రేషన్ అనుభవించాలని, మనస్ఫూర్తిగా ఈ టీమ్‌ను ప్రోత్సహించాలని వచ్చాను. కిరణ్ అబ్బవరం పక్కింటి కుర్రాడిలా కనిపిస్తాడు. కష్టపడి ఈ స్థాయికి వచ్చిన కిరణ్.. చెన్నై లవ్ స్టోరీతో ఇంకా ఎత్తుకు ఎదగాలి. ఈ సినిమాలో భాగం అయిన ప్రతి ఒక్కరిని ఆల్ ది బెస్ట్' అని తెలిపారు.




# మంచి పాత్ర వస్తే అప్పుడు ఆలోచిస్తా..

జబర్దస్త్ ఫేమ్ అదిరే అభి (అభినయ కృష్ణ) దర్శకత్వంలో తెరకెక్కిన లేటెస్ట్ మూవీ 'కర్మాఖ్య'. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం నుంచి తాజాగా ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఒకప్పుడు స్టార్ హీరోయిన్, ప్రస్తుత రాజకీయ నేత విజయశాంతి ఆసక్తిక కామెంట్స్ చేశారు. 'పెద్ద సినిమాలతో పోలిస్తే చిన్న చిత్రాలకు లభించే మద్దతు కాస్త తక్కువే అయినప్పటికీ, నిజమైన దమ్ము, కొత్తదనం, బలమైన కథలు చిన్న సినిమాల్లోనే ఉంటాయి. ప్రేక్షకులు ఇలాంటి వైవిధ్యమైన ప్రయత్నాలను ఆదరిస్తే పరిశ్రమకు మరింత మంది కొత్త నటీనటులు, దర్శకులు వస్తారు. ముఖ్యంగా చిన్న సినిమా నిర్మాతలు నిలదొక్కుకోవాలంటే మీడియా సహకారం చాలా అవసరం. కొత్త కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లడంలో మీడియానే కీలక పాత్ర పోషిస్తుంది' అని తెలిపారు. అలాగే.. ఆమె నటన కెరీర్‌పై స్పందిస్తూ.. 'ప్రస్తుతం నేను రాజకీయాల్లో బిజీగా ఉన్నందున నటించే ఆలోచన లేదు. అయితే బలమైన కథ, గుర్తుండిపోయే మంచి పాత్ర వస్తే మాత్రం ఆలోచిస్తాను' అని చెప్పుకొచ్చారు. కాగా.. కర్మాఖ్య చిత్రం జులై 31న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది.



# 'జన నాయగన్' రిలీజ్.. థియేటర్ లో నటి త్రిష సందడి

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నటించిన జయ నాయగన్ సినిమా ఎట్టకేలకు రిలీజ్ అయింది. మొన్నటి సంక్రాంతి కానుకగా ఈ సినిమా రిలీజ్ కానుండగా.. అనేక రకాల కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. కానీ విజయ్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ సినిమా రిలీజ్ కు ఉన్న అడ్డంకులు అన్ని తొలగిపోయాయి. ఈ క్రమంలో గురువారం సినిమా రిలీజ్ అయి.. సక్సెస్ ఫుల్ గా దూసుకు వెళ్తోంది. ఈ క్రమంలో ఈ సినిమాను చూసేందుకు హీరోయిన్ త్రిష థియేటర్ కు రావడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. చెన్నైలోని రోహిణి థియేటర్ కు వెళ్లిన ఆమె... మూవీని వీక్షించారు. అయితే ఈ థియేటర్ కు ఆమె వెళ్లగానే అక్కడ ఉన్న అభిమానులు రచ్చ చేశారు. త్రిష.. త్రిష అంటూ నినాదాలు చేసి సందడి చేశారు. సినిమా చూసిన తర్వాత ఎలాంటి కామెంట్ చేయకుండా... కారెక్కి త్రిష వెళ్లిపోయారు. అయితే గత కొన్ని రోజులుగా సీఎం విజయ్, హీరోయిన్ త్రిష మధ్య ఏదో ఉందని జోరుగా ప్రచారం తాగుతోంది. ఈ నేపథ్యంలోనే త్రిష ఎక్కడికి వెళ్ళినా తమిళనాడులో హడావిడి కనిపిస్తోంది. కాగా ఇప్పటికే త్రిష, విజయ్ కాంబినేషన్ లో చాలా సినిమాలు వచ్చాయి. ఆయన నటించిన గోట్ సినిమాలో కూడా స్పెషల్ రోల్ చేసి ఈ సందడి చేసింది.



# శ్రీ విష్ణు సినిమాలో ఛాన్స్ కొట్టేసిన సాక్షి మడోల్కర్..

'సామజవరగమన' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత శ్రీ విష్ణు, దర్శకుడు రామ్ అబ్బరాజు కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైనప్పటికీ, ఇందులో హీరోయిన్ ఎవరు అనే విషయాన్ని చిత్ర బృందం ఇంతకాలం అధికారికంగా వెల్లడించలేదు. తాజాగా ఈ చిత్రంలో సాక్షి మాడల్కర్ కథానాయికగా నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. రోషన్ హీరోగా సందీప్ రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'మోగ్లీ' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన సాక్షి, ఇప్పుడు శ్రీ విష్ణు సరసన నటించే అవకాశం దక్కించుకుంది. ఈ సినిమాతో ఆమెకు ఎలాంటి గుర్తింపు లభిస్తుందో చూడాలి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'సామజవరగమన'కు పనిచేసిన భాను బోగవరపు, నందు సావిరిగణ ఈ చిత్రానికి కూడా కథ, మాటలను అందిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం సమకూరుస్తుండగా, నరేష్, వెన్నెల కిషోర్, సుదర్శన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# వైభవ్ మెరుపులు.. జింబాబ్వేపై తొలి టీ20లో భారత్ విజయం

**విశ్వంభర, హరారే:** వరుసగా రెండో టీ20 ప్రపంచకప్ గెలిచాక ఆడిన రెండు సిరీస్‌ల్లోనూ వైట్‌వాష్‌కు గురైన టీమ్‌ఇండియా.. ఎట్టకేలకు గెలుపు రుచి చూసింది. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. భారత టీ20 సారథిగా ఏడు మ్యాచ్‌ల తర్వాత శ్రేయస్ అయ్యర్ తొలి విజయం అందుకున్నాడు.టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 125 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని టీమ్‌ఇండియా 13.2 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వైభవ్ సూర్యవంశీ (50; 19 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగాడు. ఇషాన్ కిషన్ (35; 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), శ్రేయస్ అయ్యర్ (28లి; 24 బంతుల్లో 3 ఫోర్లు) పరుగులు చేశారు. మయాంక్ యాదవ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. రెండో టీ20 శనివారం జరగనుంది.తొలుత జింబాబ్వే టాప్-4 బ్యాటర్లు బ్రయాన్ బెనెట్ (0), బెన్ కర్రాన్ (10), డియోన్ మైయర్స్ (6), సికిందర్ రజా (4) త్వరగానే పెవిలియన్ చేరారు. దీంతో ఆ జట్టు 32 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. తర్వాత వచ్చిన వెస్లీ మద్వేర (39), మరుమాని (27లి), ర్యాన్ బర్ల్ (26) జట్టును ఆదుకున్నారు. మరుమాని, మద్వేర ఆరో వికెట్‌కు 37 బంతుల్లో 57 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ 2, ప్రిన్స్ యాదవ్ 2, శివమ్ దూబె, రవి బిష్ణోయ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.



# ఒక్క హాఫ్ సెంచరీ.. వైభవ్ సూర్యవంశీ మూడు ప్రపంచ రికార్డులు

**విశ్వంభర, స్పోర్ట్స్:** ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అరంగేట్రం చేసిన టీనేజీ సంచలనం వైభవ్ సూర్యవంశీ.. అక్కడ ఆడిన మూడు మ్యాచ్‌ల్లో 14, 13, 15 స్కోర్లకే వెనుదిరిగాడు. ఇప్పుడు జింబాబ్వే పర్యటనలో ( ఉన్న ఈ కుర్రాడు.. ఫామ్ అందుకున్నాడు. జింబాబ్వేతో జరిగిన తొలి టీ20లో వైభవ్ (50; 19 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. 18 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్న సూర్యవంశీ తర్వాత బంతికే ఔటయ్యాడు. ఈ ఇన్నింగ్స్‌తో వైభవ్ మూడు ప్రపంచ రికార్డులు బ్రేక్ చేశాడు.

**సచిన్ రికార్డు బ్రేక్..**

అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో పూర్తి సభ్య దేశాల తరఫున అత్యంత పిన్న వయసులో (15 ఏళ్ల 118 రోజులు) అర్ధ శతకం చేసిన క్రికెటర్‌గా వైభవ్ ప్రపంచ రికార్డు సాధించాడు. అంతకుముందు ఈ రికార్డు సచిన్ తెందూల్కర్ (16 ఏళ్ల 213 రోజులు) పేరిట ఉండేది. 1989లో పాకిస్థాన్‌తో టెస్టు మ్యాచ్‌లో సచిన్ హాఫ్ సెంచరీ చేశాడు. ఇప్పుడు ఆ రికార్డును వైభవ్ బ్రేక్ చేశాడు.

**టీ20ల్లోనూ..**

అంతర్జాతీయ టీ20ల్లోనూ పిన్న వయసులో హాఫ్ సెంచరీ చేసిన బ్యాటర్‌గా సూర్యవంశీ ఘనత సాధించాడు. 2021లో గిబ్రాల్టర్ ఆటగాడు లూయిస్ బ్రూస్ 16 ఏళ్ల 56 రోజుల వయసులో మాల్టాపై అర్ధ శతకం చేశాడు. తాజా ఇన్నింగ్స్‌తో లూయిస్‌ను వైభవ్ అధిగమించాడు. పూర్తిసభ్యదేశాలపరంగా చూసుకుంటే ఇప్పటివరకు ఆ రికార్డు అఫ్గాన్ ఆటగాడు రహ్మానుల్లా గుర్బాజ్ (17 ఏళ్ల 296 రోజులు) పేరిట ఉంది.అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో (పూర్తిస్థాయి, అసోసియేట్ దేశాలు కలిపి) 50 ప్లస్ స్కోరు చేసిన పిన్న వయస్కుడైన ఆటగాడు కూడా సూర్యవంశీనే. 2020లో అమెరికాతో జరిగిన వన్డే మ్యాచ్‌లో నేపాల్‌కు చెందిన కుశాల్ మల్లా 15 ఏళ్ల 340 రోజుల వయసులో హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. ఆ రికార్డును ఇప్పుడు వైభవ్ బద్దలుకొట్టాడు.



# కామన్వెల్త్ గేమ్స్.. భారత్‌కు తొలి పతకం ఖాయం

**గ్లాస్గో:** స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా కామన్వెల్త్ గేమ్స్ ప్రారంభం రోజే భారత్‌కు తొలి పతకం ఖాయమైంది. బాక్సింగ్‌లో మహిళల 75 కేజీల విభాగంలో లవ్లీనా బొర్గో హెయిన్ నేరుగా సెమీ ఫైనల్‌కు అర్హత సాధించింది. దీంతో లవ్లీనా భారత్‌కు కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసింది. క్వార్టర్ ఫైనల్స్‌లో ఐదుగురు బాక్సర్లు మాత్రమే అందుబాటులో ఉండటంతో డ్రాలో లవ్లీనాకు బై లభించింది. బొర్గో హెయిన్‌తోపాటు మరో ఇద్దరు నేరుగా సెమీస్‌కు అర్హత సాధించారు. మిగిలిన ఇద్దరు బాక్సర్లు ఏకైక క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడతారు. జులై 31న జరిగే సెమీ ఫైనల్‌లో తువాలుకు చెందిన టీకేబీపీ తాఫాకీతో లవ్లీనా తలపడనుంది. ఇందులో గెలిచిన వారు స్వర్ణ పతక పోరుకు అర్హత సాధిస్తారు.కెరీర్‌లో ఎన్నో ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో పతకాలు సాధించిన లవ్లీనాకు కామన్వెల్త్ క్రీడల్లో ఇదే తొలి పతకం కావడం విశేషం. అస్సాంకు చెందిన ఈ బాక్సర్ టోక్యో ఒలింపిక్స్ (2020)లో కాంస్య పతకం (69 కేజీల విభాగం), 2023 ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం (75 కేజీలు) సాధించింది. 2022 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం, 2023 ఆసియా క్రీడల్లో రజతంతో మెరిసింది.



Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com